# సామాన్యుల
# పరిచయ వ్యాసాలు

కందుకూరి రమేష్ బాబు

ప్రచురణ: ఏప్రిల్, 2005
ప్రతులు: 1,000
వెల: వ్యక్తుల కోసం. రూ.10/-
సంస్థలు, లైబ్రరిల కోసం: రూ.60/-
విదేశాల వెల: 5 డాలర్లు
అట్ట రూపకల్పన: అక్బర్
ముద్రణ: నవ్య ప్రింటర్స్, హిమాయత్‌నగర్, హైదరాబాద్

ఈ పుస్తకంలోని ఒకటి రెండు వ్యాసాలు మినహా, మిగతా వ్యాసాలన్నీ ఆదివారం ఆంధ్రజ్యోతి సంచికలో 20 అక్టోబర్ 2002 నుంచి 4 జూలై 2004 వరకు 'సామాన్యశాస్త్రం' శీర్షికలో ప్రచురితమయ్యాయి. వాటిని తిరిగి పుస్తకరూపంలో తెచ్చుకోవడానికి అనుమతించిన ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణగారికి, సంపాదకులు కె.రామచంద్రమూర్తి గారికి, ఫీచర్స్ ఎడిటర్ వసంతక్కకి, ఖదీర్‌కు, డి.టి.పి.ఆపరేటర్ రఘురామయ్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇక, చేయితిరిగిన నా మిత్రుడు, ఫీచర్ రైటర్ సాంబుకు, అద్భుతమైన బద్దక కలం యాకూబ్‌కు, నాగసుందరి, జ్యోతి, కిరణ్మయిల సందడికి, అక్బర్, లేపాక్షిల నిశ్శబ్దానికి, స్కానింగ్ సెక్షన్ మిత్రుల ఆయాసానికి, ఆంధ్రజ్యోతిని బయటినుంచి నిరంతరం చురుకుగా ఉంచే రెండు టీ బంకులకూ ఈ పుస్తకం తెస్తున్న సంతోషాన్ని పంచుతున్నాను.

# కోళ్ల మంగారం
# మరి కొందరు


| | | |
|---|---|---|
| 0. | శంకర్ | 01 |
| 1. | విజయ | 07 |
| 2. | గర్భ నిరోధ్ | 13 |
| 3. | అల్తాఫ్, ఖలీల్ | 21 |
| 4. | తూర్పాటి కృష్ణ | 27 |
| 5. | ఆదిల్, రబ్బాని | 33 |
| 6. | కోళ్ల మంగారం | 43 |
| 7. | విజయరామ్ | 55 |
| 8. | రమణారెడ్డి | 61 |
| 9. | కొలచల చంద్రశేఖర్ | 69 |
| 10. | గుడికాడి చిన ఐలయ్య | 77 |
| 11. | సత్య శ్రీనివాస్ | 87 |
| 12. | సుభాని అలియాస్ శైలి | 95 |
| 13. | మల్లెల సుధాకర్ | 103 |
| 14. | కాపు రాజయ్య | 107 |
| 15. | మేఘరాజ్ అగర్వాల్ | 119 |
| 16. | కుసుమ రాజయ్య | 127 |
| 17. | జెల్లి మధు | 135 |
| 18. | గుండా ఆంజనేయులు అలియాస్ పాపర్ | 141 |

కోళ్ల మంగారం గురించి మొదట చెప్పింది వంశీ. మంగారం పేరుతో వస్తున్న ఈ పుస్తకం అట్టమీది ఫోటోలు తీసింది కూడా వంశీయే.

మొదటి అట్టమీది ఫోటో గుడికాడి చిన ఐలయ్యది. ఇతను సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ వద్ద ఫుట్‌పాత్‌పై నివసిస్తాడు. ఉదయాన్నే ట్రాఫిక్‌ను అదుపు చేసేందుకు తనంతట తానుగా సిద్ధమవుతాడు. సరిగ్గా ఆ సమయంలో తీసిన ఫోటో ఇది. ఆయనపై రాసిన వ్యాసం 77వ పేజీలో ఉంది.

ఇక, చివరి అట్టమీది ఫోటో ఒక విషాద సన్నివేశం. ఇతడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ఉండే ఓ బిక్షగాడు. ఆయనకు సిగరెట్ కుతి! ఏం చేస్తాడు! స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ ఇరానీ హోటల్ ముందు మోకాళ్లమీద కూచొని, పదుగురు తాగి పారేసిన సిగరెట్టు పీకలను వెలుగిస్తూ నిరాశను పారదోలుతుంటాడు. ఒక చేతిలో నిప్పు ఆరిపోని సిగరెట్టు, మరోచేతిలో అది ఆరిపోకముందే అంటించుకునేందుకు రెడీగా మరో సిగరెట్టు పీక. సరిగ్గా ఈ స్థితిని కెమెరాలో బంధించినప్పటి ఫోటో ఇది. కోపం, నిస్సహాయత, బేలతనం కలగలసి ఆయనలా చూస్తున్నాడు. ఈ పుస్తకంలో అనుమతి లేకుండా వాడిన ఫోటో ఇదొక్కటే. ఆయనకు నా క్షమాపణలు.

అన్నట్టు, నేను రాసిన ప్రతి వ్యాసానికీ నా వెంట తిరిగి చక్కటి ఫోటోలు తీసిపెట్టిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్లు రాజు, రజనీకాంత్, మురళి, నారాయణ, బాలస్వామి, చీఫ్ ఫోటోగ్రాఫర్ రమేష్‌లకు ధన్యవాదాలు చెప్పుకోకుండా ఉండలేను. ఫీచర్స్ జర్నలిజాన్ని బతికించేది ఫోటోయే అని నా భావన.

## ఒకని ప్రశంస

పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులకు అబద్ధాలు రాసి లేక నిజాలు పాతేసి నాలుగు డబ్బులు సంపాదించుకునే అవకాశం వుంటుంది. అలాగే మాయమర్మాలు లేకుండా ఉద్యోగం చేసుకుంటూ తమకు ఆసక్తి వున్న అంశాలపై ప్రమాదరహితమైన పరిశోధనలు చేసి యదార్థ జీవితాన్ని ఆవిష్కరించవచ్చు. పెద్ద పెద్ద లక్ష్యాలతో పెద్ద పెద్ద పనులకు తెలివైన వారిని ఎడిటర్లు పురమాయిస్తుంటారు. అమాయకపు పనుల మీద కొందరు చిన్న వారిని పంపుతూ కూడా వుంటారు. అలాంటి ఒక చిన్నవాడు మనసుకు నచ్చిన రీతిలో సంపాదించిన జీవిత శకలాలు ఇందులో వున్నాయి.



కాచిగూడ చౌరస్తాలో మార్క్ టైలర్స్ షట్టర్‌పై కోళ్ల మంగారం వేసిన పెయింటింగ్. ఫోటో: రజనీకాంత్.

రాజులమీద, రాచకుటుంబాల మీద, తెగబలిసిన కలవారి మీదా మాత్రమే రష్యాలో సాహిత్య సృష్టి జరుగుతున్న వేళ నికొలాయ్ గొగోల్ అనే ఆసామి ఒక పేద గుమాస్తా చలికోటు మీద ఒక కథ రాశాడు. సామాన్యులు కూడా కథా వస్తువులు కాగలరని రష్యా రచయితలకు అంత వరకూ తెలీదు. అందువల్లనే యావత్ రష్యన్ సారస్వతం కూడా గొగోల్ గ్రేట్‌కోట్ నుంచే పుట్టిందని డాస్టొవిస్కి అప్పట్లో ప్రకటించాడు. దినపత్రికల్లో  మహానుభావుల జీవితాల మీదా, చలోక్తుల మీదా, చమత్కారాల మీదా, గొప్పవారి జీవితాల మీదా రకరకాల ఆర్టికల్స్ రావడం రివాజు. అట్టి దినపత్రికల్లో తోపుడుబళ్ళ వాళ్ళ మీదా, ఫుట్‌పాత్ నివాసుల మీదా, జోక్స్ పుస్తకాలు రాసే వాళ్ల మీదా రాయడం జర్నలిస్టుల సామాజిక దృష్టిలో వచ్చిన మార్పుకు సంకేతం. ఇలాంటి పని ఇంతకు ముందు కూడా జరగలేదని కాదు. ఇరవై ఏళ్ళ క్రితం ఈనాడులో రావూరి భరద్వాజగారు ఇట్టి పని చేశారు. అంతకు ముందు అనేక తెలుగు పత్రికల్లో అపుడపుడూ అనేక మంది రాశారు. కానీ కందుకూరి రమేష్ బాబుకు వారికీ కొంత తేడావుంది. ఇతనికి ఇది నచ్చిన పని.

ఇర్వింగ్ వాలెస్ అనే వాణిజ్య రచయిత వారానికి ఆరు రోజులు డబ్బుల కోసం రాసి, ఏడో రోజున తనకు నచ్చిన విషయాలమీద రాసేవాడు. అలాంటి రాతల్ని 'సండే జంటిల్మన్' పేరుతో ఒక పుస్తకం కింద వేశాడు. నాకు అది చాలా నచ్చింది. ఆయనకు డబ్బులు సంపాదించి పెట్టిన మిగిలిన అన్ని పుస్తకాలూ కలిపినా ఆ ఒక పుస్తకానికి సమానం కాదని నా అభిప్రాయం. నచ్చిన విషయం మీద రాసిన రాతలు వేరే కారణాలతో రాసిన వాటికన్నా తప్పక బాగుంటాయి. కందుకూరి రమేష్‌బాబు రాసుకున్న ఈ జీవిత చిత్రాలు ఆ కారణం వల్లనే చాలా హాయిగా, ఆసక్తికరంగా వున్నాయి.

నెమలి మీద ఎంత ఆసక్తికరంగా, అందంగా రాయవచ్చో ఊరపిచ్చుక మీద కూడా అంతే బాగా రాయవచ్చు. కాకపోతే రాయడం రావాలి. ఆ పని ఇష్టం కావాలి. 'ఆంధ్రజ్యోతి' పత్రికవారు రమేష్ బాబుకు ఇష్టమైన విషయాల మీద రాయడానికి అనుమతి ఇవ్వడం రమేష్ బాబు అదృష్టం కింద లెక్క.

పుస్తకం చిన్నదీ, ముందుమాట పెద్దదీ అని ఎవరైనా వెక్కిరిస్తారేమోనని ఎక్కువ రాయడం లేదు. ఇది నాకు నచ్చింది. రమేష్ ఇది బాగా రాశాడు.

-కె.ఎన్.వై. పతంజలి

## టెన్త్ ఫెయిలైతే మాస్

ఈ పుస్తకం వస్తోందని చెప్పడానికి వెళితే
అతడు లేడని తెలిసింది.






## 0.
## శంకర్

బిల్ క్లింటన్ హైదరాబాద్ వచ్చినప్పుడు భిక్షగాళ్లను, ఫుట్‌పాత్ వాసులను నగర శివార్లకు తరిమారు. శంకర్‌ను కూడా తరిమారు. తలలో నాలుకలా మెసిలే శంకర్ కూడా అందరితో కలిసి వెళ్లాడు.

క్లింటన్ పని చూసుకుని వెళ్లిపోయాడు.

శంకర్, మిగతా వారంతా మళ్లీ కాచిగూడ స్టేషన్‌కు వచ్చేశారు.

ఎవరి పనుల్లో వారు పడ్డారు. శంకర్ కూడా.

రాత్రి మేల్కొని, ఉదయాలు నిద్రపోయే జీవితాలు వారివి. అవి ఎప్పట్లాగే గడిచిపోయాయి. క్లింటన్ వెళ్లాక, ఈ భిక్షగాళ్లకో లీడర్ ఉన్నాడని ఎవరో చెబితే ఆ వెతుకులాటలో శంకర్ తగిలాడు.

ఆ నాటినుంచి అతడితో పరిచయం, స్నేహం.

ఎన్నో రకాల మనుషుల గురించి పరిచయం, స్నేహం.

అతడి ద్వారా విజయ పరిచయం.

నాగన్న పరిచయం.

మరికొందరు. ఇంకొందరు. ఇలా, పరిచయం పెరిగింది. స్నేహం గడిచింది.

'సామాన్యశాస్త్రం' శీర్షిక ద్వారా మొదట విజయను పరిచయం చేశాను.

ఆంధ్రజ్యోతి తిరిగి తెరిచాక వచ్చిన మొదటి సంచికలో ఆమె గురించి రాశాను.

తన జీవితం గురించి చెబుతూ, అకస్మాత్తుగా, తన భర్త తప్పతాగి కాలు రైలు కింద పెట్టిన విషయం చెప్పింది. 'మూడు కిలోమీటర్లపాటు ఆ కాలు ఒరుసుకుని ప్రయాణించింది'అని వివరించింది. ఆమె చెబుతుంటే, ఒళ్లు జలదరించింది.

అట్లా, దుఃఖం ఆమె జీవితాన్ని ఒరుసుకుంటూ ప్రవహించింది.

అచ్చయిన ఆ సంచికను తీసుకుని ఆఫీసు నుంచి నేరుగా స్టేషన్‌కు వెళ్లాను. అక్కడ భిక్షగాళ్లు విశ్రాంతి తీసుకునే సిమెంట్ చప్టాపై వారంతా కూచుంటే, నిలబడి చదివాను.

ఓ పాతికమంది భిక్షగాళ్ల మధ్యన జీవిత పఠనం. విని, కంటతడి పెట్టారు.

శంకర్ మటుకు మౌనంగా ఉన్నాడు.

ఆయన ఆమెకు అండగా ఉన్నాడు.

+++

విజయ, వారి పిల్లలు, అక్కడి మనుషులతో నా పరిచయం అలా గడిచింది.

శంకర్‌తో సంభాషణ నాటినుంచి మరింత పెరిగింది.

ఓ రోజు కాచిగూడ స్టేషన్ ఎదురు ఇరానీ హోటల్లో చాయ్ తాగుతున్నాం. 'ఈ మడిగను పదిసార్లు కొనేంత సంపాదించాను. పోగొట్టుకున్నాను కూడా' అన్నాడు శంకర్, నవ్వుతూనే.

'నరాల్లోని రక్తాన్ని, ఒంట్లోని కిడ్నీలను, మానాన్ని కూడా కడుపుతిప్పలు కోసం అమ్ముకునే జీవితాలు మావి. మగ ఆడా అన్న తేడా లేదు. ఇక్కడి జీవితాలే ఇంత. సంపాదనా, ఖర్చులకు ఇక్కడ లెక్కలేదు. ప్రాధాన్యతా లేదు.' అన్నాడు.

వారి వద్ద ధనం ఉంది. ధనం లేదు.

వారికి మతి ఉంది. మతి లేదు.

వారికి భయం ఉంది. భయం లేదు.

వారికి బతుకుంది. బతుకులేదు.

అన్నిటిని మించి, వీరంతా అనాథలు. అనాథలు కాదు.

వారికి కుటుంబం ఉంది. కుటుంబం లేదు.

ఉదాహరణకు విజయ.

ఆమెది ఒకసారి దెబ్బతిన్న జీవితం.

ఇక్కడ శంకర్ తోడయ్యాడు.

ఇప్పుడు శంకర్ లేడు.

ఆమె మరెక్కడికో వెళ్లింది.

ఆమెకు కుటుంబం ఉంది! కుటుంబం లేదు!

మరి శంకర్ ఏమయ్యాడు?

మాస్!

పదో తరగతి ఫెయిలైన ఏకైక కారణంతో అతడు ఇల్లు వదిలి వచ్చిన విషయం చెప్పినప్పుడు మొదట ఆశ్చర్యంగా అనిపించింది. ఆ తర్వాత తన చేతుల మీదుగా కొందరి కిడ్నీలు అమ్మేశానని చెప్పినప్పుడు మరింత ఆశ్చర్యపోయాను. 'ఇవి హత్యలు చేసిన చేతులు' అని చెప్పినప్పుడు మరింత ఆశ్చర్యపోయాను.

ఆ తర్వాత ఆశ్చర్యం లేదు.

అతడు చెప్పే విషయాలు కళ్లముందు కనపడేవే.

కాకపోతే ఎవరు చేసేవారో ఇదివరకు తెలియదు. ఇప్పుడు తెలుస్తోంది.

టెన్త్ ఫెయిలైతే శంకర్.

తండ్రి కొప్పడితే శంకర్.

యజమాని కూలి డబ్బులు ఇవ్వకపోతే- గల్లలోంచి రహస్యంగా డబ్బులు తీసుకుని- ఆ మరునాడు యజమాని అడుగుతాడనే భయంతో పారిపోతే- శంకర్.

+++





శంకర్‌కు కాచిగూడలో మంచి పేరుంది. ఎవర్నయినా అడగండి. చేతులెత్తి మొక్కుతారు.

ఈ మధ్య అటువైపు వెళ్లలేదు.

సామాన్యశాస్త్రం వ్యాసాలను పుస్తకంగా తెస్తున్నానని చెప్పడానికి వెళ్లేసరికి విజయ లేదు. వారి పిల్లలు లేరు.

శంకర్ కనిపించలేదు.

నాగన్న మోకాళ్లమీద కూచొని నలుగురైదుగురితో పిచ్చాపాటిలో ఉన్నాడు.

ఇంగ్లీషు తప్పా మరో మాట పలకని నాగన్న- బద్రుకా కాలేజీ స్టూడెంట్ నాగన్న -నన్ను చూడగానే లేచొచ్చిన నాగన్న- తలదించుకున్నాడు.

శంకర్ పోయాడన్నాడు. 'మాన్, హి పాస్‌డవే' అన్నాడు.

చచ్చిపోయాడని చెప్పాడు!

ఆశ్చర్యపోయాను.

'గుడుంబా తాగిన ఒంటికి ఇంజక్షన్ ఇవ్వడంతో రియాక్షన్ అయింది. అప్పటికప్పుడే పోయాడు' అని తెలుగులోనే చెప్పాడు.

నేను మౌనంగా ఉండటాన్ని చూసి, 'నేను ఈ మధ్య ఇక్కడ లేను. ఏదో కేసు. జైలుశిక్ష. వారం క్రితమే వచ్చానన్నా' అన్నాడు, సంజాయిషిగా.

ఆయన మాటల్ని మధ్యలోనే తుంచి, మరి, విజయ? అంటే, 'ఆమె నిజాంబాద్ తిరిగి వెళ్లిపోయింది. నిజాంబాద్ కూడా కాదు. ఎక్కడికో వెళ్లిపోయింది!' అని చెప్పాడు.

'పుస్తకం వస్తోంది. అందులో మొదటి వ్యాసం నీదే' అని విజయకు, శంకర్‌కూ చెప్పి సంతోషపెట్టాలనుకున్నాను. వారిద్దరూ కలిసి ఉన్న మంచి ఫొటోను పుస్తకంలో వేయాలనుకుని వంశీని వెంట పెట్టుకెళ్లాను.

+++

చాయ్ తాగడానికి కూడా నాగన్న రాలేదు.

ఇరానీ హోటల్‌లో నేనూ వంశీ కూచున్నాం.

ఒక హిందీ పాటలోని చరణం చెప్పాడు వంశీ.


నేను మాత్రం ఈ వాక్యాలు మనసులో అనుకున్నాను.

" ఫుట్‌పాత్ మీద మూడు దశాబ్దాలు జీవించి, ఆ ఫుట్‌పాత్ మీదే పోయిన శంకర్‌కు, ఆయన అండలో కాసిన్ని సంవత్సరాలు ఆత్మీయతను చవిచూసిన విజయ, వారి కుటుంబ సభ్యులకు, కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని తోటి అనాధ భిక్షకులకు, వారిని చల్లగా చూసే పోలీసులకు ఈ పుస్తకం అంకితం."

-కందుకూరి రమేష్ బాబు

16.04.2005

కాచిగూడ టేషనే
మా ఇల్లూ వాకిలి






## 1.
## విజయ

"నా పేరు విజయ. మా తల్లిగారిది వరంగల్ జిల్లా ఉర్సు కరీంబాద. నాయిన సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీల పని చేసేటోడు. నా పెనిమిటి ఆంధ్ర నుంచి నిజాంబాద్‌కు బతక వచ్చిండు. ఆయన పేరు సుందరయ్య. వట్టి తాగుబోతు. చేతుల పైసలు నిలిచేవి కావు. ఆయన గంజిలో హమాలి పని చేస్తే నేను బీడీలు చేసేదాన్ని. ఇప్పుడు మస్తు కంపెనీలున్నయి గని, అప్పుడు ఫర్మాయిషి బీడీలే. కంపెనీవాళ్లు తంబాకు ఇద్దురు. కోటగల్లికి పోయి ఆకు మేం తెచ్చుకొనెటోళ్లం. నా కొడుకు కడుపుల వడ్డంక హైద్రాబాదుకు వచ్చినం. ఇరవై ఏళ్ల కిందటి మాట. నిజాంబాద్‌ల రైలెక్కినం. కాచిగూడ టేషన్‌ల దిగినం. ఇగ అప్పటినుంచి టేషనే మాకు ఇల్లూ వాకిలి.

మొగ పిలగాడు పుట్టిన సంవత్సరానికి పక్కటేషన్ మల్కంపేట్ దగ్గర ఇల్లు కిరాయి తీస్కున్నాం. అప్పుడు మొయింజా మార్కెట్ల నా పెనిమిటి పని చేస్తుండె. సంవత్సరం ఉన్నమో లేదో పని పోయింది. మల్ల కాచిగూడ టేషన్‌కి వచ్చినం. చాతనయిన కష్టం చేయడం, రైల్వే స్టేషన్ల తల దాచుకోవడం. ఇట్లా గడిచింది బతుకు. రాంగ రాంగ ముగ్గురు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టింది. ఒక రోజు, 'ఇక్కడ ఉంటె విపరీతంగా తాగుతున్నాను, నిజాంబాద్ పోదాం' అన్నడు సుందరయ్య. సరే అన్న. ఆడికి పోయినంక మిర్చి బండి పెట్టినం. ఆ టైంల నేను బీడీలు కూడ చేసిన. అక్కడ ఒక ఆడపిల్ల పుట్టింది. బండి సరిగ నడవక ఆడ కూడ ఎక్కువ రోజులు లేము. మల్ల కాచిగూడకే వచ్చినం. ఇట్ల మొత్తం ఇరవైయేండ్లల్ల పదిహేనేండ్లు కాచిగూడ టేషనే మాకు నీడ ఇచ్చింది.

నాకు మొత్తం పదిమంది సంతానం అయింరు. పెద్దోడు గొండసామి. వాడు ఎనిమి దేళ్లనాడే బొంబాయి వోయిండు. రెండోవాడు శివ. పదేండ్లప్పుడు ఏడికో పారిపోయిండు. ఇప్పటికి వాళ్ళ జాడ తెల్వదు. తండ్రి బాధకే వీళ్ళు పోయింద్రు. బాగ తాగి కొట్టెటోడు. ఎవర్నీ తిననీయక పోతుండె. నిద్రపోనీయక పోతుండె.

సుందరయ్య సచ్చిపోయి ఐదేండ్లయింది.

చివరి పిల్లగాడు ఏడాదుండగ తాగి, తాగి సచ్చిపోయిండు.

సావడానికి ఏడాది ముందు బండి కింద పడ్డడు.

అప్పుడు మేం ఉప్పుగూడల ఉన్నం. ఒకరోజు ఇద్దరం లొల్లి పెట్టుకొన్నం. ఆనాడు బాగ సార తాగిండు. అట్లనే బండెక్కిండు. చెప్పు పడిపోయిందని దిగ వోయిండు. బండి స్పీడందుకుంది. దండ వట్టుకున్నడు గని అప్పటికే కాలు పట్టాలకు రాస్కపోతున్నది. డబుర్‌పుర

నుంచి మల్కంపేట వరకు బండితోనే ఊగులాడుకుంట వచ్చిండు. కాలంత కంకరకు రాస్కపోయింది. ఇగ అప్పటికప్పుడు ఉస్మానియాకు తీస్కపోయినం. కాలు తీసెస్తమని డాక్టర్లు చెప్పింరు. మోకాలు వరకు కాలు తీసేస్తరనే వరకు సుందరయ్య భయపడ్డడు. ఆస్పిటల్ వద్ద ఏమొద్దు అని ఇంటికి తీస్కపొమ్మన్నడు. ఇంటికి వచ్చినంక కాలంత సీమొచ్చింది. మల్ల అడ్మిట్ చేస్తే సగం పాదం తీసేసింరు.

దేవుని వాక్యం అంటే విననీయక పోవు.

కాలు వోయినంకనే ఇద్దరం కలిసి నారాయణగూడ చర్చికి వోయి బాప్టిజం తీస్కున్నం. అటెనుక పుట్టిన పిల్లలకు ప్రభు, మేరి అని పేర్లు పెట్టుకొన్నం.

మతం తీస్కున్నట్టేగని సుందరయ్య తాగుడు మానలేదు.

తాగి తాగి సచ్చిపోయిండు.

+++

మస్తు బాధలు పడిన. ఇప్పుడు నలుగురు ఆడపిల్లలు. నలుగురు మగపిల్లలు. వీళ్ళందరిని రోడ్డు మీదుండే  సాదుకొంటున్న. సుందరయ్యకు కాలు వోయినంక పిల్లలందరిని తెచ్చి గుడికాడ పెట్టిన. శ్యాంబాబగుడి అంటరు. ఈ ఇరవై యేండ్లల్ల పాణం బాగలేకపోయినా, కడుపుతోని ఉన్నా ఈ గుడి కాడనే కూసున్న. అడుక్కొన్న.

నా మొగుడు తాగుబోతే. అయినా, పని మా చేసిండు.

హమాలి పని చేసిండు. మిర్చిబండి పెట్టిండు. కాయిదాలు ఏరిండు. నేను కూడ మస్తు సేసిన. మక్కబుట్టలు అమ్మిన. పల్లీలు అమ్మిన. బీడీలు జేసిన. ఇండ్లల్ల అంట్లు తోమిన. బిచ్చం అడుక్కున్న. పిల్లలకు బుక్కెడంత కూడు దొరికేతందుకు ఏం చేయాలో అది చేసిన. ఇరవై ఐదేండ్ల కింద వచ్చినపుడు ఇదే పరిస్థితి. ఇప్పుడూ  అదే పరిస్థితి. మొగుడున్నా బాధపడిన. లేకున్నా పడుతున్న. ముంగట సూస్తె బాయుండె. ఎనుక సూస్తె చెరువుండె.

నా లెక్క టేషన్ల ఎంతో మంది ఉన్నరు. మనిషికో చరిత్ర ఉందిక్కడ. ఎన్ని బాధలు పడకపోతె రోడ్డెక్కుతరు. ఫుట్‌పాత్‌ల మీద బతుకుతరు. ఎవరో ఉషమ్మ అట. సాయం చేస్తానని వస్తది. రాత్రిపూట పడుకొనేటందుకు షెల్టర్ ఇప్పిస్త అంటది. రాత్రి ఆడ పడుకోవాలెనట. తెల్లారి ఈడికి వచ్చి ఆడుక్కోవాలె. అది ఎవ్వరికి నచ్చడం లేదు. సరె అంటరు గని, ఎవరూ ముందుకు రారు. ఇక్కడ పది మంది పది రకాలు. మంచి ఉండె. చెడు ఉండె. నాకేం జబ్బు ఉందో నీకు తెల్వదు. నీకే ముందో నాకు తెల్వదు. అందరినీ ఒక్క జాగల వేస్తనంటె ఎవరొస్తరు. వీళ్లందరిని అద్దాలమేడల పెట్టినా మల్ల ఈడికే వస్తరని రైల్వే పోలీసులే అంటున్నరు. నిజమేగద!

నాకు ఆస్తిపాస్తులేం లేవు. సుందరయ్య కట్టిన పుస్తె ఉండె. బాధలున్నపుడు అమ్ముకొన్న. రెండు మూడుతులాల మట్టెలుండె. ముండ మోసినపుడు సాకలోల్లు తీసుకొన్నరు. ఇక నాకు





ఆస్తిపాస్తులు పిల్లలే. వెండి, బంగారం, ఇల్లూ వాకిలీ పిల్లలే. ఆయన ఎల్లి పోయిండు. పుట్టిచ్చి సచ్చిపోయిండు. నాలుగు సంవత్సరాలనుంచి ఎనిమిదిమంది పిల్లలతో బతుకుతున్న. నలుగురు పిల్లల్ని స్కూలుకు పంపుతున్న. నెలకు మూడు కిలోల బియ్యం ఇస్తరు. సత్యనగర్‌ల బడి ఉంది. చెట్టు కింద వండుకొంటం. రైలుకట్ట పక్కకు స్నానాలు చేపిస్త, రోడ్డు మీది బతుకు. కష్టాలు కాక ఏముంటయి. పోలీసోళ్లు టేషన్‌ల పండనీయరు. వానొస్తే మడిగల పొంటి పడుకోవాలె. ఆడపిల్లలకు ఇబ్బందే. వాళ్లకోసం ఈ నడుమ ఒక రేకుల షెడ్ కిరాయికి తీస్కొన్న!

పిలగాళ్లు అదిగావాలే ఇదిగావాలే అని నన్నేమి అడగరు. వాళ్లకు సేవలు చేసుకొంట బతుకుతున్న. ఇద్దరు మొగపిల్లలైతే ఆవారా. ఫుట్‌పాత్ మీదనే ఉంటరు. మాట చెబితే వినరు. మూడోవోడు మూర్తి మెంటలోడు. పనేమీ చేయడు. వానికి కోపం ఎక్కువ. నాలుగోవోడు సంతోష్. రాత్రయితే చాలు పైసలు తీస్కొని వోటల్లకెల్లి అన్నం తెచ్చుకొని తింటడు. రెండు రూపాయల కోసం దొంగతనం చేయనియ్యకే అంటడు.

నవ్వాల్నా, ఏడ్వాల్నా?

పోలీసోల్లు నన్నేమీ అనరు. వాళ్లకన్నీ తెలుసు.

వాళ్ళముందే నా మొగుడు సచ్చిపోయిండు. పిల్లలు పెద్దగైతున్నరు. ఏండ్లనుంచి సూస్తున్నరు. ఏం దందజేసినా పొట్టతిప్పల కోసమేనని వాళ్ళకు తెలుసు. అందుకే, వాళ్ళు నన్నేమి అనరు.


ఎట్ల బతుకుతున్న అంటే, ఆ దేవునికే తెలుసు!

సస్తె లోకమేమనుకుంటుందో, పిల్లలను సాకలేక సచ్చిందంటదో అని, అన్నీ ఆలోచించుకొని బతుకుతున్న.

20 అక్టోబర్ 2002

ఇతను పుట్టబోయే
బిడ్డకు ప్రతినిధి

శ్రీశ్రీ ప్రపంచం బాధను తన బాధగా చేసుకున్నాడు.
కృష్ణశాస్త్రి తన బాధను ప్రపంచ బాధగా మలిచాడు.
కానీ గని అలియాస్ గర్భనిరోధ్ ప్రంపంచం వేరు.
ఆయనది పుట్టబోయే శిశువుల ప్రపంచం.



గర్భ నిరోధ్



## 2.
## గర్భ నిరోధ్

దుఃఖానికి మూలకారణం కోరిక అని బుద్ధుడు చెప్పాడు. గని మాత్రం పుట్టుకే దుఃఖానికి మూల కారణం అని చెబుతున్నాడు. పుట్టబోయే బిడ్డ రక్షణ కోసం గర్భనిరోధమే సరైన మార్గమని ఉపదేశిస్తున్నాడు. ఇంతకీ ఈ గని ఎవరు? ఆయన ఫిలాసఫి ఏమిటి?

గని ఆధ్యాత్మిక కార్యకర్త కాదు, సామాజిక కార్యకర్త కూడా కాదంటాడు. ఆయన మాటల్లో తాను ఒన్ మాన్ ఆర్మీ. ఇప్పుడున్న వారికి చావు తప్పదు. తిరిగి చనిపోయే వారిని పుట్టించడం ఎందుకనేది ఆయన మౌలిక ప్రశ్న. దుఃఖం లేని ప్రపంచం లేనప్పుడు సంతానాన్ని కని, ఆ సంతానాన్ని ఇబ్బందుల్లోకి నెట్టే నైతిక హక్కు మనకెక్కడిదని ఆయన ప్రశ్నిస్తున్నారు.

జీవశాస్త్రం, నైతికత కలగలసిన సిద్ధాంతం తనదని చెప్పే గని అలియాస్ గర్భనిరోధ్ హైదరాబాద్‌లోని భూగర్భశాఖ డైరెక్టరు కార్యాలయంలో డ్రాఫ్ట్‌మెన్‌గా పని చేస్తున్నారు.

తనని తాను పుట్టబోయే శిశువులకు ప్రతినిధిగా అభివర్ణించుకునే గని కాలికి బలపం కట్టుకుని తిరిగాడంటారు చూడండి, అలా ఈ మనిషి అంతకన్నా ఎక్కువే ఈ ప్రచారంలో పాల్గొంటారు.

ఆయన తన దేహాన్నే ప్రచారానికి సాధనంగా మలుచుకున్నారు.

నుదుటి మీద 'పుట్టించుట హింసించుటయే' అనే పచ్చబొట్టు కనిపిస్తుంది. చేతిలో తన ప్రచార అంశాలను వివరించే బోర్డు ఎల్లవేళలా వెంట ఉంటుంది.

తనని కేవలం ఒక మానవ జీవి అని పరిచయం చేసుకునే గని అలియాస్ గర్భ నిరోధ్ అసలు పేరు సూర్యశంకరరావు. నీలం రంగు సఫారీ దుస్తుల్లో నీట్‌గా షేవ్ చేసుకుని ఉల్లాసంగా కనిపించే గనికి ఇప్పుడు యాభై ఐదేళ్లు. ఆయన స్వగ్రామం కాకినాడ దగ్గరి తాళ్లరేవు. మండలం జార్జిపేట. మధ్య తరగతి కుటుంబానికి చెందిన గని పాండిచ్చేరి మోతిలాల్ నెహ్రూ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యను పూర్తి చేశారు. ఆయన చదివింది డిజైన్ టెక్నాలజి. పాలిటెక్నిక్ పూర్తవగానే ఆయన డాక్టరు కోర్సు చదవాలనుకున్నారు. అందుకోసం తిరిగి ఇంటర్మీడియట్‌లో చేరారు. మొదటి సంవత్సరం ఆయన జంతు, వృక్షజాలంలో పునరుత్పత్తి ఎలా జరుగుతుందో చదివాడు. అప్పటి వరకూ ఆయనకి సంతానం ఎలా కలుగుతుందో తెలియదు. ఆ తర్వాతి సంవత్సరం అనుకోకుండా ఏదో ఒక కరపత్రం కనిపించిందట. శిశుజననం అనే పేరుతో వచ్చిన ఆ కరపత్రంలో పిండోత్పత్తి గూర్చి వివరంగా ఉంది. అది చదివిన తరువాత సూర్యశంకరరావుకు ఒక విషయం బోధపడింది. సృష్టి మన ప్రమేయంతో జరగకపోయినా, సంతానోత్పత్తి మటుకు మన ప్రమేయంతోనే జరుగుతుంది.

దాన్ని నివారించవచ్చునిని కూడా అతడికి స్పష్టమయింది.

అంతేకాదు.

ఆయనకు అర్థమయినంత వరకు స్త్రీ పురుష బీజ కణాలు జీవులుకాదు. అవి అజీవులు. అజీవి జీవిగా మారడమే పునరుత్పత్తి అని అర్థం చేసుకున్నారు. ఈ అవగాహన ఆయన జీవనశైలిని మార్చివేసింది. దుఃఖానికి మూలకారణం తెలిసిపోయింది. పుట్టుక వల్లే దుఃఖం కలుగుతున్నది కనుక పుట్టుకను నిరోధించగలిగితే చాలనే నిర్ణయానికి వచ్చేసారు. ఆ నిర్ణయం తీసుకున్న వెంటనే అంతకుముందు తాను డాక్టరై రోగికి సేవ చేయాలనే ఆలోచన విరమించుకున్నారు. రోగానికి చికిత్స చేయడం కంటే శాశ్వతంగా రోగాన్ని నిరోధించడం ఇంకా మేలైన పని అని ధృడంగా నమ్మారు. వెంటనే ఆచరణలోకి దిగారు.

ఒకానొకప్పుడు భూమి బల్లపరుపుగా ఉండేదనేవారు. భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతుంటాడని కూడా అనేవారు. అవన్నీ నిజమైనాయా? సత్యం సత్యమే. అలాగే ఈ ప్రపంచపు బాధను తొలగించేందుకు పుట్టబోయే శిశువును రక్షించడమే మార్గం. ఇతర అభివృద్ధి నమూనాల వల్ల ఫలితం లేదు అని సూర్యశంకరరావు మనఃస్ఫూర్తిగా విశ్వసించారు.

అదు విశ్వాసంతో, 1974 నుంచి ఈ ప్రచారాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

అంటే ఆయన ప్రచారానికి రెండు దశాబ్దాల వయసుంది.

+++

1982లో సర్వీస్ కమిషన్ ద్వారా ఆయన ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకున్నారు. మొదట జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. టెక్నికల్ క్వాలిఫికేషన్ ఉన్నందువల్ల ఆ తర్వాత డ్రాఫ్ట్‌మెన్‌గా జాయినయ్యారు. ఉద్యోగం వచ్చిన తర్వాతే తన పేరును గర్భనిరోధ్‌గా మార్చుకున్నారు. ఆయన గవర్నమెంట్ సర్వెంట్ కావడం వల్ల ఇండియన్ గెజెట్‌లో పేరు మార్చుకోవాల్సి వచ్చింది. అందుకోసం గని చాలా కష్టాలే పడ్డారు.

ఇంతకీ పేరు మార్చుకోవడానికి గల కారణమేమిటీ? అని అడిగితే 'కొత్త పేరు వల్ల నా ఆశయం ప్రచారం అవుతుంది. కులం, మతం ఇతరులకు తెలిసే అవకాశమే ఉండదు' అని చెప్పారు.

"పుట్టించుట హింసించుటయే" అని నుదిటి మీద అతను పచ్చబొట్టు పొడిపించుకున్నారు. పచ్చబొట్టు వేయించాలనే ఆలోచన ఎలా వచ్చిందీ, దీని వల్ల ప్రయోజనం ఏమిటీ అంటే "నేను ఏమని అభ్యర్థించాలనుకున్నానో దాన్ని నా పేరుగా మార్చుకున్నాను. నేను ఎందుకు ప్రచారం జరుపుతున్నానో వివరించే నినాదాన్ని పచ్చబొట్టుగా వేయించుకున్నాను." అని చెప్పారు.

"అదీగాక, ఎవరైనా మనతో మాట్లాడాలంటే మన మొహం చూస్తారు. చూడగానే నేను చెప్పదల్చుకున్న మెసేజ్ వారికి అందుతుంది. అకస్మాత్తుగా ఏదైనా ప్రమాదానికి గురై నేను మృతి చెందాననుకోండి. ముందు నేనెవరో గుర్తు పట్టడానికి నా మొహం చూస్తారు. అప్పుడు





కూడా నా మృతదేహం ప్రచారానికి సద్వినియోగం అవుతుంది" అని వివరించి చెప్పారు.

కాకినాడలోని మెజిస్టిక్ టాకీస్ వద్ద పచ్చబొట్టు వేయించుకున్నానని గని గుర్తు చేసుకుని చెప్పారు. తాను నల్లగా ఉన్నందువల్ల ఆ పచ్చబొట్టు సరిగా కనపడటం లేదని కూడా ఆయన విచారం వ్యక్తం చేశారు. పచ్చబొట్టు వంకరటింకరగా రాసినందుకు కూడా ఆయన ఇప్పటికీ బాధపడుతారు. 'ముందు ఒక ఆర్టిస్ట్‌తో రాయించి, ఆ తర్వాత ఆ అక్షరాల మీద పచ్చబొట్టు వేయించుకుని ఉంటే బావుండేదని, ఒకింత బాధగా చెప్పారాయన.

గని వెంట ఎప్పుడూ ఒక బోర్డ్ ఉంటుంది. తన మెసేజ్‌ను ప్రచారం చేసేందుకు ఆయన ఈ బోర్డుతోనే బస్ ప్రయాణం చేస్తారు. ఇంటినుంచి కాలు బయట పెట్టారంటే ఈ బోర్డుతోనే. ప్రచారానికి పగలూ రాత్రీ అనే తేడా లేదు. ఆదివారాలు, సెలవులు అనే ప్రశ్నేలేదు. బతికినన్నాళ్లూ గర్భనిరోధానికి అనుకూల ప్రచారం చేయడమే తన ధ్యేయం అని ఆయన చెప్పారు.

ఇంకా ఆయన జీవితం గురించి తెలుసుకోవాలనిపిస్తే, పూర్తి వ్యాసం చదవండి.

+++

పుట్టుకకు రకరకాల కారణాలు వాడుకలో ఉన్నాయి. కొంతమంది దేవుడు కారణం అంటారు. మరికొంత మంది తల్లిదండ్రులే కారణం అంటారు. ఇంకొందరు ఎవరి పుట్టుకకు వారే కారణం అంటారు. కర్మ సిద్ధాంతాన్ని నమ్మే వారు మరొకటి చెబుతారు. అయితే గని మాత్రం తల్లిదండ్రులే సంతానోత్పత్తికి కారణం అంటారు. శిశువు పుట్టుకకు, చావుకు తల్లిదండ్రులదే బాధ్యతంటారు.

ఆయన చాలా కాన్షియస్‌గా 'ఉత్పత్తి' అనే పదాన్ని వాడుతారు.

ముందే చెప్పినట్టు ఆయన స్త్రీ పురుష బీజ కణాలను జీవిగా గుర్తించరు. అవి సంయోగం చెందాకే జీవిగా మారతాయని చెబుతారు. ఇదే ఆయన సిద్ధాంతంలోని మౌలికాంశం. అలాగే, జన్మనివ్వడం, దేహాన్నివ్వడం, పుట్టించడం అనే మాటలను కూడా ఆయన వాడరు. ఇవన్నీ కర్మ సిద్ధాంతంతో ముడిపడి ఉన్న మాటలని ఆయన అభిప్రాయం. ఇంకా వివరంగా ఆయన్ని అర్థం చేసుకుంటే, పుట్టుక అంటే బీజ కణం ఒక జీవిగా మార్పుచెందడమని ఆయన అంటారు. ఇంతకీ ఇదంతా ఎందుకు వివరిస్తున్నట్టు?

సర్వ దుఃఖాలకు పుట్టుకే మూలమని తెలుసుకొని బిడ్డను దుఃఖాలన్నింటి నుంచి రక్షించమని ఆయన అభ్యర్థిస్తున్నారు. మానవ జీవి బెడద నుంచి మిగతా జీవులకు విమోచన ఇవ్వమని కూడా ఆయన కోరతారు. వివాహం చేసుకోవచ్చు. అయితే సంతానోత్పత్తి లక్ష్యంగా చేసుకోవద్దని ఆయన నొక్కి చెబుతారు. 'పుట్టబోయే బిడ్డ తరపున ఇదే నా అభ్యర్థన' అని ఆయన ప్రచారం చేస్తున్నారు.

ఏ బాధలూ ఎరగకుండా ఉండే మనిషిని పుట్టించగలిగే సామర్థ్యం ఉంటే నిరభ్యంతరంగా

సంతానోత్పత్తి చేయండని ఆయన సూచిస్తారు. అది అసాధ్యమని ఆయనకు తెలుసు. అందుకే, చచ్చేవారిని పుట్టించి తీరిగ్గా బాధ పడటం ఎందుకని ఆయన సూటిగా ప్రశ్నిస్తున్నారు.


ఒకరు, ఇద్దరు అన్న పరిమితి కూడా వృధా అని ఆయన అంటారు. బాధకు సంఖ్యతో సంబంధం లేదన్నది ఆయన వాదన.

+++

గని తన డిపార్ట్‌మెంట్ తరపున కల్చరల్ టూర్‌కు వెళ్లినపుడు తనదైన సరళిలో ప్రచారం జరుపుతారు. వివిధ జిల్లా కేంద్రాలకు టూర్లకు వెళ్లినప్పుడు కూడా ఆయన ప్రచారంపై శ్రద్ధ పెడతారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ధరించేందుకు ప్రత్యేకంగా ఒక జత దుస్తులు ఉన్నాయి. వాటిపై ఇంగ్లీష్, హిందీ భాషల్లో తన మెసేజ్ రాసి ఉంటుంది.

గతంలో చిన్న చిన్న బుక్‌లెట్ల ద్వారా, సినిమా స్లైడ్ల ద్వారా సైతం గర్భనిరోధానికి అనుకూలంగా ప్రచారం జరిపిన అనుభవం ఉందని ఈ సందర్భంగా గని చెప్పారు.

తాను కుటుంబ నియంత్రణ కోసం ప్రచారం జరపడం లేదని గని స్పష్టంగా చెప్పారు. సర్వదుఃఖాల నుంచి మానవ జాతిని రక్షించడమే తన లక్ష్యం అని ఆయన చెప్పారు. "నాకు మానవ జాతిపై ద్వేషం ఏర్పడింది కాబట్టే ఇలాంటి ప్రచారం జరుపుతున్నాను అనే వారున్నారు. కొందరేమో నన్ను నిరాశావాది అంటారు. మరికొందరు పలాయనవాది అంటారు. శూన్యవాది అనేవారూ ఉన్నారు. ఎవరి దృష్టికోణం నుంచి వారు అంచనా వేయాలనే చూస్తారు గానీ నన్ను నన్నుగా అర్థం చేసుకునేవారు తక్కువ" అని ఆయన చెప్పారు.








అయితే, తనతో ఏకీభవిస్తున్న వారూ ఉన్నారని, వారిలో మహిళలే ఎక్కువని ఆయన చెప్పారు.

+++

"ప్రజలు మట్టిముద్దలు కాదు. వారికి ఏదో చూపించి, ఆచరించమని చెప్పడం తప్పు. అందువల్ల ప్రయోజనం లేదు. వారిలో పరివర్తన రావాలి. ఆ పరివర్తన కూడా ప్రేమ ద్వారా రావాలి" అని గని అంటారు.

చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అని ప్రభుత్వం జరుపుతున్న ప్రచారం వల్ల లాభం లేదని ఆయన అభిప్రాయం. 1947లో మనదేశ జనాభా 35 కోట్లు ఉండేది. ఇప్పుడు 102 కోట్లు అయింది. జనాభా పెరుగుదలతోనే సమస్యలు పెరుగుతున్నాయనే వాదన పూర్తిగా తప్పు. అసలు సమస్య పుట్టుక. 'బర్త్ ఈజ్ రూట్ కాజ్ ఆఫ్ ఆల్ సఫరింగ్' అని గని తేల్చేస్తున్నారు.

'జనాభా తక్కువ ఉన్న దేశాల్లో కూడా సమస్యలు ఉన్నాయి కదా' అంటూ, తిరిగి గని తన వాదనలోకే వెళతాడు. పోలియో డ్రాప్స్ వేయించడానికి, ఎయిడ్స్ కంట్రోల్ చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి వల్ల జరిగే మేలేమీ లేదని; ఎంత సైన్స్ అభివృద్ధి చెందినా కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ఒక సమస్య పరిష్కారం అయ్యేసరికి మరొక సమస్య ముందుకు వస్తుంది. కాబట్టి పరిష్కారం చికిత్సలో లేదు. పుట్టకను నిరోధించడంలోనే ఉంది. ఇది రోగానికీ వర్తిస్తుంది. జాతి ఎదుర్కొంటున్న సమస్యలకూ వర్తిస్తుందని నొక్కి చెప్పారు.

గర్భనిరోధానికి అనుకూలంగా ఒంటరి ప్రచారం చేస్తున్న గని సన్మానాలకే కాదు, విరాళాలు తీసుకోవడానికి కూడా వ్యతిరేకం. ఆయన అవివాహితుడు. ఇక పిల్లల గురించి చెప్పే పనిలేదు.

"నేను చేస్తున్న పనిలో పాల్గొనమని ఎవరినీ కోరను. నాది ఒక ఉద్యమం అని కూడా నేను అనుకోవడం లేదు. ఉద్యమం అంటే ఒక వర్గం మరొక వర్గంపై జరిపే పోరు కదా. ఇది అలాంటిది కాదు. ఇది మనుషులందరికీ వర్తించే ప్రచారం. ప్రపంచ వ్యాప్తంగా అనుసరించవలసిన కర్తవ్యం" అని ఆయన వివరించారు.

గర్భనిరోధానికి అనుకూలంగా సంఘటితంగా ప్రచారం చేయవచ్చు కదా అంటే 'కాద'నే అంటారు గని. 'ఒక్కో మనిషి యుద్ధంగా, వన్ మాన్ ఆర్మీ అంటారే.. అలా పని చేయాలి. అప్పుడే ఫలితం ఉంటుంది' అంటారాయన.

"సంతానోత్పత్తి చేయవద్దని నేను అభ్యర్థించగానే చాలామంది హర్ట్ అవుతున్నారు. ఎందుకంటే వారు తమ స్వార్థం కోసం పిల్లలను కంటున్నారు. అది వారి బలహీనత. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి వాదిస్తుంటారు. ఏదో ఒక కుంటి సాకు చెబుతారు. పిల్లలు లేకపోతే ప్రపంచం ఆగిపోతుందని అంటారు. ఇదంతా కాదు. మీ స్వార్థం కోసం మీ సంతానాన్ని

బాధ పెట్టే నైతిక హక్కు మీకెక్కడిదని అడుగుతున్నాను. ఈ ప్రశ్న మిమ్మల్ని ఏ సంఘం, మరే చట్టం అడగటం లేదు. నేనే అడుగుతున్నాను. మరోసారి ఆలోచించండి. నేను మీ పుట్టబోయే బిడ్డ తరపున పని చేస్తున్నాను" అంటారు గని అలియాస్ గర్భనిరోధ్.

"నేను ఒక మనిషినై ఉండి తోటి మనిషికి వ్యతిరేకంగా ఈ విషయం ప్రచారం చేయడం ఒక రకంగా విషాదమే" అని చివరకు అంగీకరించారు గని.

ఆయన మనుషుల్లేని మరో ప్రపంచాన్ని కలగంటున్నారు.

1 డిసెంబర్ 2002

పోస్ట్ స్క్రిప్ట్:

తనపై రాసిన ఈ వ్యాసం చదివిన గని, ఉత్తరం రూపంలో తీవ్రఅసంతృప్తిని వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత విషయాలకన్నా ప్రచార ఉద్దేశ్యాలే పాఠకులకు చేరడం అవసరమని ఆయన అభిప్రాయం. ఈ వ్యాసంలో అందజేసిన వివరాలకన్నా ఆయన అందజేసే కరపత్రం ఇంకా ఎక్కువ సమాచారం అందిస్తుందని ఆయన అంటారు. అందుకే ఆయన ఇచ్చిన కరపత్రంలోని కొన్ని అంశాలను యథాతథంగా ఇవ్వడం.

-జీవిగా మార్పు చేయబడటమే పుట్టుకన్నది సహేతుక వాదన.

-సర్వదుఃఖాలకు పుట్టుకే మూలమని తెలుసుకుని చేయండి గర్భనిరోధన.

-అలా ఇవ్వండి మీ పుట్టబోయే బిడ్డకు దుఃఖాలన్నింటినుండి రక్షణ.

-చేకూర్చండి ఆ మానవజీవి బెడదనుండి మిగతా జీవులకు విమోచన.

-త్రోసిపుచ్చండి ఎవరి బాధలకు వారే బాధ్యులనే తప్పుడు ప్రతిపాదన.

-ఏనాడూ చూపకండి ఆదరణకు అర్హులైన అమ్మానాన్నల పట్ల నిరాదరణ.

-వివాహం చేసుకోవచ్చు. దాని లక్ష్యం మాత్రం కాకూడదు సంతానోత్పాదన.

-గర్భనిరోధ్, (ఒక మానవజీవి)

గర్భనిరోధ్,
8 ఫ్లోర్, బి.ఆర్.కె.ఆర్.భవన్, సెక్రెటేరియట్ రోడ్డు, హైదరాబాద్.



# సెవన్ లీవర్స్

వాహనదారులను, కాలినడకన వస్తున్న
వారిని చివరకు బస్‌లోని
ప్రయాణీకులను సైతం ఆకర్షించే ఈ
రంగుల డబ్బాలు తాళకళకు అడ్డాలు.
అవి ఎండలో వానలో మెరిసిపోతుంటే
చూడాలి!.





3.

## ఖలీల్, అల్తాఫ్

హైదరాబాద్‌లోని విద్యానగర్ బస్టాప్‌లో గోడకు అతికించిన పోస్టర్లను చదువుకుంటూ నడిస్తే, ఆ స్టాప్ చివర ఇనుపరేకుల డబ్బా కనిపిస్తుంది.

ముడతలు ముడతలుగా ఉండే ఆ ఇనుపరేకుపై 'షీల్ కీస్' అనే ఎర్రటి అక్షరాలు కనిపిస్తాయి. ఇప్పుడా డబ్బా మూసి ఉంది. అది తెరిస్తే ఫరవాలేదు. లేకుంటే మరి కొంత దూరం నడవాలి. ఒక కేఫ్ వస్తుంది. దాని ఎదురుగా, రోడ్డు వారగా ఒక రంగుల విశేషం ఆకర్షిస్తుంది. తాళాలు రిపేర్ చేసే స్థలం అది.

నీలం రంగు చతురస్రాకారపు డబ్బా. దానిపై పసుపు పచ్చ రంగులోఉన్న తాళం చెవి బొమ్మ. వంకర టింకరగా మొరటుగా ఉన్న తాళం చెవి అది. ఆ తాళం చెవి మధ్యన చిన్నగా ఎ.కె. అనే రెండు ఇంగ్లీషు అక్షరాలు కనిపిస్తాయి. ఎ.కె. అంటే ఏమిటి? "ఎ.కె. అంటే ఎ.కె.లాక్" అని చెప్పి, ఏదో పనిమీద ఆ చతురస్రాకారపు డబ్బాలోకి తలదూర్చాడు అల్తాఫ్.

'షీల్ లాక్' లాగా 'ఎకె లాక్' అంటే అదొక తాళం పేరేమో! అదే అడిగితే, తాళాల గుత్తితో తలపైకెత్తిన అల్తాఫ్ పెదాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. "ఎ అంటేఅల్తాఫ్, కే అంటే ఖలీల్" చెప్పాడు అల్తాఫ్ సిగ్గుపడుతూ!

అల్తాఫ్, ఖలీల్‌లు అన్న దమ్ములు. వాళ్లది అంబర్‌నగర్, ఒక తాళాల గుత్తి వంటి కుటుంబం వీరిది. అల్తాఫ్ తాతలు, మామలు అందరూ తాళాలు రిపేర్ చేసే బతుకు తున్నారు. గోద్రెజ్, షీల్, ఆల్విన్, అలిగడ్ తాళాల్ని రిపేర్ చేయడంలో వీరు మంచి పనోళ్లు. ఇవి కాకుండా రైల్వే లాక్స్, చైనా లాక్స్, చేతక్ బండి లాక్స్ వంటివి రిపేర్ చేస్తారు. తాళానికి పది రూపాయల చొప్పున రోజుకు వంద రూపాయలు వీరు సంపాదిస్తుంటారు.



+++

తాళాలు రిపేర్ చేసుకుని పొట్టపోసుకునే ఇటువంటి వారు నగరంలో వందలాది మంది ఉన్నారు. రంగుల డబ్బావీరి ప్రత్యేకత. పసుపు, ఆకుపచ్చ, నీలం, ఎరుపు, తెలుపు రంగులతో ఆకర్షించే తాళం డబ్బాకు యజమానులు వీరు. నారాయణగూడ,


విద్యానగర్, తార్నాక, వారాసిగూడ, చిలకలగూడ, పద్మారావు నగర్, సికిందరాబాద్- ఎక్కడకైనా వెళ్లండి. ఆకస్మాత్తుగా రంగుల విశేషం వంటి తాళం డబ్బా కనిపిస్తుంది. వాటిపై లతీఫ్, అఫీస్, ముజఫర్, సలీం వంటి పేర్లు గలవారు పనిచేస్తుంటారు. వీరి పేర్లేమైనా, వీరెక్కడున్నా చెప్పే కథ మాత్రం ఒకటే.

+++

"మా పనులు రెండు రకాలు. ఒకటేమో లాక్ బటన్స్ ఇరిగి ఉంటాయి. వాటిని రిపేర్ చేసుడు. ఇంకోటేమో లివర్ సెట్ చేసుడు. కీస్ ఇస్టీల్, ఐరన్, బ్రాస్‌వి ఉంటాయి.ప్లేన్ కీస్ కూడా ఉంటాయి. వాటికి లివర్ తయారు చేసిస్తాం" అంటాడు ఖలీల్. ఇతనికి తార్నాకలోని ఆరాధన థియేటర్ వద్ద తాళం డబ్బా ఉంది.


+++

"తాళం అంటే తాళం కాదు తాళానికి లీవరే గుండె. ఒక్కో తాళానికి ఒక్కో నంబర్ లీవర్ ఉంటుంది. సిక్స్ లీవర్స్, సెవన్ లీవర్స్ తాళాలు మంచివి. అవే ఒరిజినల్ తాళాలు. 'డుబ్లికేట్' తాళాలకు రెండు లీవర్లే ఉంటాయి. అయితే వాటిపైన సిక్స్ లీవర్స్ అని 'భాజాప్తా' రాసి ఉంటాయి" అని వివరించాడు సలీం. ఇతనికి చిలకలగూడలోని వెల్‌కం టిఫిన్ సెంటర్ వద్ద తాళం డబ్బా ఉంది.







+++

ఈ తాళం డబ్బాలు ఎందుకంత ఆకర్షణీయంగా ఉంటాయి? వాటినెలా తయారు చేసుకుంటారు? అదే అడిగితే, అల్తాఫ్ ఇలా చెప్పాడు.

"నాలుగు వేలతో తయారు చేసిన ఆ డబ్బాకు ఇనుపరేకు కొట్టాను. దానిపై నలుపు రంగు ఆయిల్ పెయింట్ చేసాను. అది ఆరిన తర్వాత ఎరుపు రంగుతో మరొక కోటింగ్ ఇచ్చాను. తర్వాత నాలుగడుగుల వెడల్పు, పొడవున్న ఒక రేకును తీసుకుని, దానిని తాళం చెవి ఆకృతిలో కత్తిరించుకున్నాను. దాని ఆధారంగా డబ్బా మూడు వైపులా స్కెచ్ వేసుకున్నాను. ఆ స్కెచ్ మేరకు నలుపు రంగుతో లైనింగ్ చేసుకున్నాను. ఇక తాళాన్ని రెడ్‌ల కెల్లి గుంజిన" అంటూ అల్తాఫ్ అర్థాంతరంగా మాటలు ఆపాడు. తిరిగి కొనసాగిస్తూ "ఇంత చేస్తే సానా డేంజర్‌గా కనపడింది. ఎర్రరంగు కదా! ఎండల కెల్లి చూస్తే రక్తం లెక్క గుంజుతది. అందుకే సంవత్సరం ఆగి రంగు మార్చేసిన" అని చెప్పాడు.

ప్రస్తుతం ఆకుపచ్చరంగు బేక్‌గ్రౌండ్‌పై పసుపు పచ్చ తాళం చెవితో వున్న డబ్బా మీద అల్తాఫ్ పని చేస్తున్నాడు. తొందర్లోనే మరోసారి డబ్బా రంగు మార్చాలన్నది అతని సంకల్పం.

"ఇప్పుడు బ్లూ మీద రెడ్ తాళంచెవి గుంజుత" అన్నాడు అల్తాఫ్.

+++

ఇంత ఆకర్షణీయంగా ఈ డబ్బాలు ఎందుకున్నాయి?

మళ్లీ పాత ప్రశ్నే. ఈ సారి ఖలీల్ జవాబిచ్చాడు.

"మా నాయిన కుటుంబానికి పెద్దదిక్కు. ఆయన చనిపోయి నాలుగు నెలలైంది. మేం ఎనిమిది మంది సంతానం. మా తిండికి, మందుగోళీలకి కరెంటు, ఇంటి కిరాయికి పైసలెల్లాలె. ఇదంతా జరగాలంటే పనితనం ఒక్కటే సాలదు. వట్టి డబ్బాతో ఎల్లనే ఎల్లదు. డబ్బాకు రంగు వేయాలె. ఆ రంగులకెల్లి తాళాన్ని గుంజాలె!"

ఒక్క క్షణం ఆగి మళ్లీ ఇలా చెప్పాడు:

"ప్రేమగ, ధీమాగా కనిపించే రంగుల తాళం చెవులను చూస్తే మీరే ఎనకకు తిరిగి చూస్తరు. గీడ తాళాలు రిపేర్ చేస్తరని యాదికి పెట్టుకుంటారు. అందుకే గీ రంగుల అట్రాక్షన్. నమస్తే!" అని ముగించాడు.

23 మార్చి 2003

అన్నం పెడుతున్న పద్యం

తోలుబొమ్మలు పోయాయి.
నాటకాలు పోయాయి.
ఇప్పుడాయనకు పద్యమే
జీవనాధారం.





4.

## తూర్పాటి కృష్ణ

గత పదిహేనేళ్లుగా మహా భాగవతంలోని పోతన పద్యాలు వినిపించి పొట్టపోసుకుంటున్న వ్యక్తి పరిచయం ఇది. అతన్ని హైదరాబాద్ హరిదాసు అనవచ్చును. పేరు తూర్పాటి కృష్ణ. ఉండేది రంగారెడ్డి జిల్లా శంషాబాద్ దగ్గరి ఉమ్దానగర్. ఆయన తనను తాను ఇలా పరిచయం చేసుకుంటారు:

"కులానికి మేం బుడగ జంగాలం. శివ భక్తులం. మా గురువులు నీలకంఠ స్వామి. ఎనుకటికి మేం తోలుబొమ్మలు ఆడిపించినం. వీధి నాటకాలు, పగటి వేషాలు వేసినం. తులాభారం, హరిశ్చంద్ర, కుంభుడు నికుంభుడు, రావణబ్రహ్మ వంటి నాటకాల్లో నా వేషం అదిరిపోయేడిది. మా వంశమే కళావంశమనుకోండి" కొనసాగించాడు.

"మహా భాగవతంలోని పోతన పద్యాలు, హరిశ్చంద్రలోని పద్యాలు, శ్రీకృష్ణుడి మేలు కొలుపు పద్యాలు, రాములవారి భక్తి పాటలు, శ్రీరామాంజనేయ యుద్ధంలోని మరికొన్ని పద్యాలు నాకు కంఠతా వస్తాయి. పద్యం నాకు తాతగారు నేర్పిన విద్యాఫలం" ఒకింత గర్వంగా చెప్పాడు కృష్ణ.

విశాలమైన పాలభాగం, వంకీలు తిరిగిన జుట్టు, మెడలో రుద్రాక్షమాల, భుజంపై ఒక పట్టువస్త్రం, చేతిలో మర చెంబు- ఇదీ తూర్పాటి కృష్ణ రూపం.

ఇక ఆయన గొంతెత్తితే...

"అన్న దానము కన్న అధిక దానమేది?

తల్లిదండ్రుల కన్న దైవమేది?

సత్య శీలము కన్న జగతి తపంబు ఏది?

సంతోషం కన్న స్వర్గమేది?"

మధ్యలో మెడలోని రుద్రాక్షమాలను భక్తితో కళ్లకద్దుకుంటాడు.

"దయకన్న మిక్కిలి ధర్మమేది?

ధరణి కన్న నరులకు రోగమేది?

సుజన సంపన్నుడి కన్న సూడలాభమేమి?

ధరణి అపకీర్తికన్న మరణమేది?

క్రోధం కన్న శతృత్వం ఏది?

రామా............................." అని దీర్ఘంగా ఆలపిస్తాడు.

ఆర్ద్రత మిళితమైన అతని కంచుకంఠపు రాగం గాలిలో అలలు అలలుగా



తెలియాడుతుంది. ఒక్కో ఇంటి గేటు వద్ద కనీసం ఐదు నిమిషాలు ఉంటాడు. అపార్ట్‌మెంట్ల వద్దయితే ఇంకాసేపు ఎక్కువ నిలబడతాడు. ఆయన ఉండేది కొద్దిసేపే అయినా అతని గొంతులోని భక్తి పారవశ్యం అపార్ట్‌మెంట్‌లోని ప్రతి ఫ్లాటులోకి ప్రవహించి పోగొట్టుకున్న పల్లె జీవితాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

ఆయన నివసించే ఉమ్దానగర్‌లో రైల్వేస్టాఫ్ ఉంది. అక్కడ రైలెక్కి ఆయన హైదరాబాద్‌కు వస్తాడు. వచ్చే ముందు కృష్ణ తన వెంట మర చెంబు తెచ్చుకోవడం మరచిపోడు. "పద్యమే కాదు, ఈ మరచెంబు కూడా నాకు తాత ముత్తాతలనుంచి వారసత్వంగా వచ్చింది" అంటాడు.

"మీ గొంతు కూడా అక్కడిదే కదా" అంటే నవ్వి, "అన్నదమ్ముల్లం వేరు పడితే మరచెంబు నా వంతుకు వచ్చింది. ఇది లేకపోతే నాకు గొంతు పూడుకుపోయినట్లు అవుతుంది" అన్నాడాయన.

కృష్ణ వారంలో ఐదు రోజులు హైదరాబాద్ వస్తాడు. మిగతా రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటాడు. ముఖ్యంగా మధ్యతరగతి, సంపన్నులు నివసించే వీధుల్లోకి వెళ్లి గొంతెత్తి పోతన పద్యాల్ని ఆలపిస్తాడు. అన్నట్టు, అతనికో టైం టేబుల్ ఉంది.

"సోమవారం నాడు విద్యానగర్‌లోని రైల్వేస్టాఫ్ వద్ద దిగుతాను. ఆ వెనకాల ఉన్న బస్తీలోకి వెళ్లి పాడుతాను. మంగళవారం విజయనగర్ కాలనీకి వెళతాను. శుక్రవారం కాచిగూడ, బర్కత్‌పుర, బాగ్‌లింగంపల్లి అంతటా తిరుగుతాను. శనివారం జామై ఉస్మానియా వద్ద దిగి, పక్కన ఉన్న కాలనీల్లో పాడుతాను. పక్షానికి ఒక ఆదివారం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీకి వెళతాను" అని ఒక కార్యక్రమాన్ని వివరించినట్లు చెప్పాడు కృష్ణ.

జనంలో ఉన్న సెంటిమెంట్స్, నాస్టాల్జియాను తట్టిలేపడంలోనే జీవిక ఉందని గ్రహించాడు కృష్ణ. 'ఎనకటి' టైపు పద్యాలు, పాటలు పాడితే జనం చెవొగ్గి వింటారని అనుభవం మీద గ్రహించాడతను.

అతని పద్యం విని భక్తి భావంతో కొందరు పూలుఫలాలు ఇస్తే మరికొందరు గౌరవంగా 116 రూపాయలు ముట్టచెబుతారట. ఇంకొందరు రేడియో, టీ.వీ.ల్లో అవకాశం కల్పిస్తామని విజిటింగ్ కార్డు ఇచ్చి 'సండే' కలవ మంటారట.. మనిషికో తీరున స్పందిస్తారని ఆయన చెప్పాడు.

ఆయన గొంతునుంచి జాలువారే కీర్తనలు విన్నవారెవరైనా ఇంటింటికి తిరిగి పద్యం చెప్పి పొట్టపోసుకుంటన్న తీరుని చూసి 'అయ్యో పాపం' అనుకోకుండా ఉండలేరు. 'ఇంత కళ పెట్టుకుని గేటు దగ్గరే ఉన్నాడే' అనే మనసు కలచివేస్తుంది.

"పద్యం చెపుతున్నప్పుడు మనసయ్యేటట్లు పాడతాను. ఎవరైనా విసిగి పోయినట్లు కనిపిస్తే చప్పున అక్కడినుంచి తప్పుకుంటాను" అని ఆయన పద్య రహస్యాన్ని వివరించాడు.





గొంతెత్తి పద్యం పాడుతుంటే విసుక్కునే వారుంటారా? అని అడిగితే "రూపాయికి బారాన మందం ప్రేమ జేస్తరు. చారాన మందం గొంతు తగ్గించుకో మంటరు" అన్నాడు.

ఈ సమస్య ఎలా ఎదుర్కోవాలో కూడా కృష్ణకు తెలుసు. "చదువుకున్న వారికి అభిరుచి ఉంటుంది. సంగీతం, సాహిత్యంలో ప్రవేశం ఉంటుంది. కాబట్టి వారుండే ఇంటికే వెళతాను. పద్యం ఎత్తుకుంటాను. భావం, రాగం తెలియని పామరుల వద్దకు వెళితే ఏ విధంగానూ తృప్తి లభించదు. అందువల్లే హైదరాబాద్‌లోని స్లమ్స్‌వైపు నేను కన్నెత్తి చూడను"

"కాలేజీ చదువులు చదివే అమ్మాయిలు కూడా పద్యాలంటే ఆసక్తి చూపుతారు. మేలు కొలుపు పాటలు, దేవీ కీర్తనలు డైరీలో రాసిమ్మని అడుగుతారు. ఆనందంగా రాసిస్తాను. వారితో పరిచయం పెంచుకుంటాను. ఇంటికి వచ్చిన ప్రతిసారీ కొత్త పద్యాలు వినిపిస్తాను. పిల్లలకు పద్యం అంటే భక్తి కలగడం మంచిదే కదా!"

"కొంతమంది ఉంటారు. 'హడావిడిగా ఉన్నాను. నువ్విప్పుడు పాడిన పాటలు రాసుకుని తెస్తావా?' అని కోరుతారు. తప్పకుండా అని అంగీకరిస్తాను. అలాగే కొంతమంది పద్యాల్ని టేప్ చేసుకుంటామని పాడించుకుంటారు. అందుకూ అంగీకరిస్తాను. పద్యం ఎన్ని విధాల చెలామణిలోకి వస్తే నాకంత మంచిది" చెప్పాడు కృష్ణ.

"మనసంతా పారవశ్యం చేస్తేగానీ ఎవ్వరూ డబ్బులు ఇవ్వరు. దయ, భక్తి, శక్తితోటి ఇచ్చేటోళ్లు ఇస్తరు. సంపాదన అంటారా? రోజుకు నూరు నూట యాభై రూపాయల వరకు వస్తాయి. కొంతమంది ప్రేమతోటి బట్టలు కూడా పెడతారు"

పొట్టతిప్పలు గురించి సరే. తన మూలాల గురించి మరింత వివరించమన్నప్పుడు ఆయన చెప్పిందిది:

"మాది రాజమండ్రి దగ్గరి సామర్లకోట. మా తాతలు తండ్రులు ముప్పయ్ ఏళ్ల క్రితం శంషాబాద్ వచ్చారు. కళాకారులకు అక్కడ సాధనము లేక వచ్చి ఉంటారు. తాళం వేసేవారు, హార్మోనియం వేసేవారు, తబలా కొట్టేవారు దాదాపు ముప్పయ్ మంది ఒక ట్రూప్‌గా వచ్చారు. ఊరూరుకీ నాటకాలు వేసుకుంటూ తిరిగారు. ఇప్పుడందరం నాటకాలు మానేసినం. మా ఇండ్లల్ల నేనూ, మా చిన్నాయన ఇద్దరం ఇలా పద్యం మీద బతుకుతున్నం"

"అల్లిరాణి చరిత్ర, ప్రమీలార్చన, దుర్గాసుందరి కథ, జలంధాసుర వధ, శ్రీ కృష్ణ శమంతకమణి, గయోపాఖ్యానం వంటి నాటకాలు వేసేవాళ్లం. ఇంటింటికీ టీ.వీ.లు, సినిమాలు వచ్చినాక మా కళ ఎనకటయింది. ఇప్పుడు నాటకాలే వేయడం లేదు. అడపా తడపా వేసినా ఆ సంబరం, సంతోషం ఎక్కడిది?" బాధ నిండిన గొంతుతో అన్నాడు కృష్ణ.

"మనసంతా తృప్తిగా ఉంటే ఏ టీ.వీ. కేంద్రానికో, రేడియో స్టేషన్‌కో వెళ్లి అవకాశాల కోసం అన్వేషించేవాడిని. కానీ ఏ పూటకాపూట పద్యం చెప్పి కుటుంబాన్ని పోషించుకోవాలి. నాకు నలుగురు బిడ్డలు. ఆమె (భార్య) లేదు. పిల్లలు చిన్నగున్నప్పుడే మరణించింది. పిల్లలు

పెళ్లికి ఎదుగుతున్నారు. పెద్దమ్మాయి వివాహం ఈ నెలాఖరికి నిశ్చయించాము. ఇలాంటి పరిస్థితి నడుమ నేను పద్యం పాడాల్సి వస్తున్నది" వివరించాడు.

"ఎన్ని ఇబ్బందులున్నా గొంతు కాపాడుకోవడం నాకు ముఖ్యం. బీడీ, కల్లు వంటి మత్తు పానీయాలు ముట్టను. చిల్లర తిండ్లు తినను. టీ, స్నానం, మంచిగ భోజనం చేయడం తప్ప నాకు వేరే అలవాట్లేమీ లేవు"

"నాది నన్ను గన్న తల్లి గొంతు. మా తల్లి ఎంత మధురంగా పాడేదో?"అంటూ ఒక్క క్షణం కళ్లు మూసుకున్నాడు. ఇంతలోనే తేరుకుని "ఎనకటి పద్యాలు ఎన్నటికీ చెడిపోవు. నాకు గొంతు ఉన్నంత వరకూ నా కుటుంబానికి భయంలేదు" అంటూ గొంతు సర్దుకుని మరో పద్యం ఎత్తుకుని.... అలాగే వెళ్లి పోయాడు.

"ఆటలాడుకోరా గోపాలా

నా ముద్దుల మూట గదరా

గజ్జెలన్ని ఘల్లు ఘల్లు మనగ

గంతులేయరా గోపాలా..."

దూరంగా వెళ్లినా కృష్ణ గొంతు లీలగా వినిపిస్తోంది.

ఆయన వెళ్లే ముందు చెప్పిన విషయమే పదే పదే గుర్తొస్తోంది.

"టీ.వీ.లో నా పాట రావాలనేది చిరకాల కోరిక. టీ.వీల వస్తె నేను సచ్చిపోయినాగని నా బొమ్మ కనవడ్తది. పాట వినిపిస్తది. పదిహేనేళ్లుగా నా పద్యం విన్న మనుషులు ఎక్కడున్నా నన్ను గుర్తుపడతరు. 'అరె. ఆ మనిషే కదా' అని యాజ్జేసుకుంటరు."

23 మార్చి 2003,
ఫోటోలు: రాజు.వి

తూర్పాటి కృష్ణ,
ఇం.నెం. 22/57/3,
సిద్ధేశ్వరాలయం దగ్గర, శంషాబాద్,
హైదరాబాద్.



# ఇచ్చట అన్ని రకముల సైలెన్సర్లు కాల్చబడును

శబ్ద కాలుష్యాన్ని
అదుపుచేసే ఇద్దరు
బాలకార్మికుల జీవనశైలి.







## 5.
## ఆదిల్, రబ్బాని

రాంనగర్ చౌరస్తా నుంచి రాంనగర్ గుండు వైపు వస్తుండగా ఎడమవైపు వీధిలో ఒక ఫర్లాంగు నడిస్తే పార్సీగుట్ట వస్తుంది. ఎత్తయిన ఆ ప్రదేశానికి వెళుతుంటే ఆటోలు మన పక్కనుంచి డుర్రు.....ర్రు.....ర్రు...ర్రుమని శబ్దం చేసుకుంటూ నెమ్మదిగా వెళుతుంటాయి.





'సార్ సికింద్రాబాద్‌కొస్తారా?' అంటూ డ్రైవర్లు ఆటోలోంచి తల బయటకు పెట్టి అడుగుతుంటారు. ఎత్తయిన ఆ మూలమలుపు వద్దకు రాగానే మూత్రపు వాసన గుప్పు మంటుంది. వెంటనే ఖర్చీఫ్‌తో ముక్కు మూసుకోవాల్సిందే. నాలుగడుగులు వేయగానే హిందూ స్మశాన వాటిక కనిపిస్తుంది. లోపల కాలుతున్న శవం తాలూకు పొగ నిదానంగా సుళ్లు తిరుగుతూ వచ్చి రోడ్డు కుడివైపు ఉన్న పార్సీ స్మశాన వాటికపై మాయ మవుతుంది.

ఇటు హిందువుల స్మశాన వాటిక, అటు పార్సీల స్మశాన వాటిక. ఈ రెండు స్మశానాలను వేరు చేసే రోడ్డు వారగా కాటికాపరుల మల్లే సైలెన్సర్లు కాలుస్తూ ఇద్దరు పిల్లలు కనిపిస్తారు. వారి పేర్లు ఆదిల్, రబ్బానీ.

+++

"చేతక్, లూనా, ఆటో, కెనెటిక్ హోండా..." అంటూ తాము చేసే పనేమిటో చెప్పేందుకు స్మశానపు గోడపై ఉన్న బోర్డుమీది అక్షరాలను చదివి చెబుతున్నాడు పదేళ్ల ఆదిల్. అతని మాటలను మధ్యలోనే కట్ చేస్తూ "అవన్నీ అక్కడ రాసున్నాయా?" అడిగాడు రబ్బాని విసుగ్గా.

"లేవా" ఒకింత విస్మయంగా అడిగాడు ఆదిల్.

"లేవు" అన్నట్లు తల పంకించి బట్టీలోంచి చేతక్ సైలెన్సరును ఒడుపుగా బయటకి లాగేసాడు రబ్బాని. ఇతనికి పదిహేనేళ్లు.

ఇంతకీ ఆ బోర్డుపై ఉన్నదేమిటి?

'అన్ని రకముల సైలెన్సర్లు కాల్చబడును' అని. అంతే! తనకి చదవడం రాదనే సంగతి తేలిపోవడంతో ఆదిల్ కొంచెం నొచ్చు కున్నాడు. ఆవేశాన్ని పెదవి కింద అదిమి పెట్టి, కిందపడి ఉన్న ఒక ఇనుప పట్టీని చేతుల్లోకి తీసుకుని చకచకా ముందుకు వచ్చాడు. అరికాళ్ల మీద







నిలబడి బోర్డుపై నాలుగైదు సార్లు కొట్టాడు. ఇంతలో ఆ బోర్డు వెనకాల దాచి ఉంచిన ఒక పుస్తకం జారి కింద పడింది. దాన్ని తెచ్చి నా చేతుల్లోపెట్టి 'చదువు' అన్నాడు అధికారికంగా.

పుస్తకానికి అట్ట లేదు. నేరుగా 'యోహాను సువార్త' పేరిట ఒకటవ అధ్యాయము ఈ కింద పేరాగ్రాఫ్‌తో ప్రారంభమయింది.

"ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై ఉండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తము ఆయన మూలముగా కలిగెను. ఆయనతో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గానీ చీకటి కాదని గ్రహింపకుండెను."

పక్కనే ఉన్న స్మశానం నుంచి వెగటైన వాసన, ఇటు మూత్రపు వాసన, ఎండవేడిమి-వీటికి తోడు పిల్లవాడు పరీక్ష పెట్టినట్టు చదవమంటుంటే అదోలా ఉంది. చదవడం ఆపి ఆదిల్ వైపు చూసాను.

ఆయిల్ మరకలతో నల్లబారిన ప్యాంటు జేబులో చేతులు దోపుకున్న ఆదిల్ "నాకు చదువుకోవాలని ఉంది" అన్నాడు మెల్లగా.

"బడికి పోవాలని ఉంటుంది గానీ మా ఇంట్లో పంపరు" అని విరక్తిగా చెప్పాడు. వాళ్ల నాన్న టైలరట. ఆదిల్‌కు 'రెండు తమ్ముళ్లు, రెండు చెల్లెలు' ఉన్నాయట. రబ్బాని వాళ్ల నాన్న ఫ్యాన్లను బాగు చేస్తాడట. అతనికి రెండు తమ్ముళ్లు, మూడు చెల్లెండ్లు అని కూడా ఆదిల్ చెప్పాడు.



మీ అమ్మ కూడా ఏదైనా పని చేస్తుందా? అంటే, కడుపుల ఏమైనా పడాలంటే అమ్మ ఇంట్లో ఉండాలి కదా! అన్నాడు.

మేం మాట్లాడుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదన్నట్లు రబ్బాని గుల్లేర్‌ని వేగంగా తిప్పసాగాడు. రబ్బాని తిప్పుతున్న వేగానికి బట్టీలోని బొగ్గులు ఖణఖణమని మండుతుంటే సైలెన్సరులోని ఆయిల్ కరిగి పొగలు పైకి చిమ్ముతున్నాయి.

"రబ్బానీ!..నువ్ సైలెన్సర్లని ఎప్పటినుంచి కాలుస్తున్నావు" అడిగాను.

"యాడాదైంది" చెప్పాడు.

"మరి ఆదిల్"

"ఈ మధ్యనే"

"ఇదివరకు ఇక్కడ పనిచేసే పిల్లలు ఏమైనారు?"

"వాళ్లని తీసేసారు. మేం చేరాము"

"మీ ఓనరు ఎవరు?"

"పాషా"

"ఎక్కడుంటాడు?"

"పార్సీగుట్ట చౌరస్తా దగ్గర. అక్కడ మెకానిక్ షాపు ఉన్నది"

"మీకెంత కూలీ ఇస్తాడు?"

ఈ ప్రశ్న అడిగేసరికి రబ్బాని ఒక్కక్షణం ఆగాడు. ఇంతలో ఆదిల్ ముందుకు వచ్చి "నాకు రోజుకు పది రూపాయలు, రబ్బానికి ఇరవై ఐదు రూపాయలు ఇస్తాడు" అని చెప్పాడు.

"పొద్దున పదకొండుకు వచ్చి పని మొదలు పెట్టాలి. ఆరింటికి పోవాలి. ఇంటికి పోయేటప్పుడు పైసలు ఇస్తాడు."

"అవును" అన్నట్లు తల ఊపాడు రబ్బాని.

"ఇంతకి సైలెన్సర్లు ఎందుకు కాలుస్తారో చెబుతావా?" అడిగాను.

"సైలెన్సరు మంచిగ ఫైర్ కావడానికి కాలుస్తం" ముక్తసరిగ చెప్పి ఊరుకున్నాడు రబ్బాని.

"మరికొంచెం" బతిమాలినట్లు ఆడిగాను.

"సైలెన్సర్‌లో ఆయిల్ నిండితే బండి ఉరకదు. పికప్ పడిపోతది. అందుకని వాటిని కాలుస్తం. ఆయిల్ కార్బన్‌గా సైలెన్సర్లకెళ్లి పోతది. సౌండు కంట్రోల్ చేసేందుకు సైలెన్సర్లల్ల ఫిల్టర్లుంటాయి. ఈ ఫిల్టర్లనే మఫ్లర్లని కూడా అంటారు. మఫ్లర్లకు రంధ్రాలుంటాయి. బండి నడువంగ ఆయిల్ నిండి ఈ రంధ్రాలు మూసుకుపోతాయి. పికప్ తగ్గిపోతుంది. అందుకే వాటిని కట్‌చేసి కాలుస్తాం. క్లీన్ చేసి, వెల్డింగ్ చేసి ఫిట్ చేస్తాము. అదంతా మా ఓనరు చూసుకుంటాడు. మేం బట్టీమీదసైలెన్సర్లను కాల్చి క్లీన్ చేసిస్తాం. అంతే.."





మళ్లీ ఏం జ్ఞాపకం వచ్చిందో ఏమో.. "మూడుసార్లు కాలిస్తే సైలెన్సరు లైఫ్ అయిపోతది' అని చెప్పాడు రబ్బాని.

ఇంతకీ వాళ్ల సరంజామా స్వల్పమే. ఒక గుల్లేర్, ఇనుప రేకులతో తయారు చేసిన బట్టీ-దాని డోర్, కూర్చోవడానికి ఇనుప కుర్చీ, చిమ్టా, పట్టీ బొగ్గులు, అగ్గిపెట్టె, నీళ్లక్యాను-వీటన్నింటినీ వేసుకపోవడానికి ఒక తోపుడుబండి- ఇవీ ఈ పిల్లల సరంజామా!

ఒక హిందీ పాటను హమ్ చేసుకుంటూ గుల్లేర్‌ను మళ్లీవేగంగా తిప్పసాగాడు రబ్బాని. ఆ వేగానికి బొగ్గుల్లోంచి మంటలు నాల్కలు చాపుతూ సైలెన్సర్లను ఆక్రమించసాగాయి. అది చూసిన ఆదిల్ బట్టీపై ఉన్న సైలెన్సరు విడి భాగాల మూతుల్లోకి బట్ట పీలికలను పట్టీతో దూర్చసాగాడు. తీవ్రమైన వేడిమి వల్ల ఆ బట్ట పీలికలు వెంటనే బగ్గుమని అంటుకుని మండిపోసాగాయి. సైలెన్సర్లు వేడిమికి కాగికాగి అందులోని నల్లటి ఆయిల్ బట్టీలోని బొగ్గులపై కారుతుంటే సుయ్..సుయ్ మని శబ్దం రాసాగింది.

"సైలెన్సరు లోపలున్న ఆయిల్ కరిగిపోయేందుకే ఇలా బట్టపీలికలను వాడుతాము" తనలో తాను అనుకున్నట్లు చెప్పాడు ఆదిల్.

ఆదిల్ మాటిమాటికి చిమ్టాను చేతుల్లోకి తీసుకుని బట్టీలోని సైలెన్సరుని అటూ ఇటూ కదుపుతున్నాడు. సైలెన్సరు అన్ని భాగాలకు మంట తగిలేలా జాగ్రత్త తీసుకుంటున్నాడు. అకస్మాత్తుగా చిమ్టాను కిందకు విసిరేస్తున్నాడు. రెండు మూడు సార్లు చూసాక గానీ అర్థంకాలేదు. బట్టీ వేడిమి ఆదిల్ లేత చేతులని కాలుస్తోందని.

ఆయిల్ మరకలతో ఉన్న బుషర్ట్‌ను దులుపుకుంటూ మళ్లీ దగ్గరకు వచ్చి ప్యాంటు జేబులోకి చేతులు దూర్చి అగ్గిపెట్టెను తీశాడు. 'ఉహు' అనుకుని ఎడమవైపు జేబులోంచి ఇంతకు ముందరి పుస్తకాన్ని తీసి మళ్లీ చదవమని ఇచ్చాడు.

"నీకు ఏం అర్ధమైతది" అడిగాను.

"నా కోసం కాదు, రబ్బానీ కోసం" అన్నాడు.

రబ్బాని నా వైపు చూసి గుల్లేర్ తిప్పుతున్నాడు.

రబ్బాని మజీద్‌కు పోతాడు తెలుసా? అన్నాడు ఆదిల్.

"అవునా?" అడిగాను. అవును అంటూ "పొద్దున, రాతిరి మజీద్‌కు పోతాను. ఖురాన్ చదువుతాను" అన్నాడు.

"ఇక వేరే బడికి పోవా?" అడిగాను.

"ఎందుకూ" అర్థం కానట్టు అడిగాడు.

"చదువుకోవడానికి"

"ఖురాన్ చదివానుగా, ఇంకేం చదవాలి?" ఆశ్చర్యంగా అడిగాడు రబ్బాని.

నాకేం చెప్పాలో తెలియలేదు.

అదలా ఉంచి "మరి ఈ పని బాగుందా?" అడిగాను మళ్లీ.

"................................."

మౌనమే సమాధానం.

నిజానికి వారికేం చెప్పాలో తెలియలేదనిపించింది. ఇంతలో రబ్బానిని కుర్చీమీంచి లేపి ఆదిల్ గుల్లేర్ తిప్పడానికి మారాడు.

రబ్బాని వయసులో ఆదిల్‌కన్నా పెద్దవాడు. కాబట్టి ఏదైనా చెప్పాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచించి మరీ చెబుతున్నాడు. ఆదిల్ హుషారుగా ఉన్నాడు. సమయం సాయంత్రం ఆరు కావస్తోంది. ఇక ఇంటికి వెళ్లడానికి సామానుని ఇనుప తోపుడు బండిలో వేయసాగాడు రబ్బాని. ఆదిల్ బట్టీలోని బొగ్గులపై నీళ్లు చిలకరించి ఆర్పుతున్నాడు. ఐదు నిమిషాల్లో అక్కడి సైలెన్సర్లు, సామాను అంతా తోపుడుబండిపై వేసుకుని యజమాని షాపు వైపు  నెట్టుకెళ్లసాగాడు రబ్బాని.

ఆదిల్ అక్కడే, నాతో మాట్లాడ్డానికా అన్నట్టు ఉన్నాడు.

దూరంనుంచి చేతిలో ఫ్లాస్కుతో "టీ......కాఫీ" అంటూ ఇరానీ కేఫ్ అబ్బాయి వస్తున్నాడు.

"సార్ ఛాయ్ తాగుదామా" అన్నాడు ఆదిల్.

"కాఫీ ఎప్పుడైనా తాగావా" అడిగాను.

లేదన్నట్టు పెదవి విరిచాడు.

కేఫ్ అబ్బాయిని రెండు కాఫీలు ఇవ్వమన్నాను.

ఇద్దరికీ ముందు రెండు ప్లాస్టిక్ కప్పులు ఇచ్చాడు. బ్రూ కాఫీ పొట్లం నుంచి ఆ కప్పుల్లో పౌడర్ చల్లి, ఫ్లాస్కులోంచి పాలు వంచాడు ఆ అబ్బాయి. మూడు రూపాయలు చేతిలో పెట్టగానే వెళ్లిపోయాడు.

ఒక్కగుక్క తాగి "సాబ్ కాఫీ మస్తుంది" అని పెదవులు చప్పరించాడు ఆదిల్.

కాఫీ తాగగానే ఉత్సాహం ఎక్కువైందేమో "గిఫా..గిఫా" అంటూ గాలిలో పిడికిలి బిగించి కొడుతున్నాడు ఆదిల్.

"ఎవరిని కొడుతున్నావు?"

"మా ఓనర్ సాబ్‌ని" నవ్వుతూ అన్నాడు.

"ఎందుకూ?" అంటే, కుడిచేతిని వెనక్కు తిప్పి బెత్తెడంత గాయాన్ని చూపించాడు. ప్యాంటును పైకిలాగి మోకాలి వద్ద ఉన్న మరొక గాయాన్ని కూడా చూపించాడు.

"హోళీ తెల్లారి మా ఓనరు కొడుతుంటే తప్పించుకునేందుకు పరిగెత్తాను. కారుని తప్పించుకునేంతలో బజాజ్ చేతక్ కింద పడిపోయాను. ఇవీ దెబ్బలు. మానుతున్నాయి" గాయంవైపే చూస్తూ చెప్పాడు ఆదిల్.

"ఎందుకు కొట్టాడు?" అడిగాను.





"రోజు కొడుతడు సార్. షర్బ్ తాగుతడు కదా!" అన్నాడు యధాలాపంగా.

"డిష్యూ..డిష్యూ.." ఈ సారి గాలిలో చేతులతోనే కాదు, కాళ్లతోనూ తంతున్నాడు.

నేనతన్నే చూస్తున్నానని గ్రహించి కాబోలు నవ్వేసాడు.

"నాకు తాకత్ బాగా వచ్చినంక, మీ అంత పెద్దయినంక పోలీసాఫీసరుని అయితను" అన్నాడు ఆనందంగా.

ఎందుకో నవ్వొచ్చింది. "సరే అయిదువులే" అంటూ ఆదిల్ భుజాన్ని తట్టి "నీ ఫోటోలు తీసుకోవడానికి రేపు వస్తాను" అని చెప్పి అక్కడినుంచి వెనుదిరిగాను.

+++

మరునాడు అక్కడికి వెళ్లేసరికి పిల్లవాళ్లు లేరు. ముప్పయేళ్ల యువకుడున్నాడు. అతను ఆ పిల్లల యజమాని- పాషా కొడుకు.

"పిల్లలను పని మాన్పించాము సార్. వాళ్లు బడికి పోతున్నారు. నేనూ, మా నాయిన ఈ పని చేస్తున్నాము. నాయిన ఇప్పుడే లంచ్‌కి పోయిండు" (అప్పుడు సాయంత్రం ఐదు గంటలవుతున్నది) అని ఆదుర్దాతో చేతులు కట్టుకుని చెప్పసాగాడు.

నా వెంట ఫోటోగ్రాఫర్, మరొక మిత్రుడు ఉన్నారు. మేమంతా చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చామని అతని అభిప్రాయం. మరి కొన్ని క్షణాల్లో వారిని జీపులోకి తోసి పోలీస్ స్టేషన్‌కు నడువమంటామని బెదిరిపోతున్నాడు. మేం పత్రికల వాళ్లమని చెప్పినా వినలేదు.

"పిల్లల ఫోటోలు వేస్తే ఆఫీసర్లు ఐదొందలు ఫైన్ ఏస్తరు సార్. ఆ తిప్పలు పడలేము. అసలే మన సి.ఎం.(చంద్రబాబు నాయడు) బాల కార్మికులతో పని చేయించవద్దంటున్నడు సార్. ఇదంతా పేపర్ల వస్తే మా పని అయిపోతది సార్. పిల్లగాళ్లతో పని చేయించం సార్. మానేస్తం సార్" -వేడుకోలు.

ఇంతకీ ఆ పిల్లలెక్కడున్నారు?

"బడికి పంపించినం సార్. నిజం సార్. నమ్మండి. నిన్ననే వాళ్ల అమ్మనాన్నలతో మాట్లాడి పిల్లల్ని బడిలో చేర్పించినం. బడికి పోతే బియ్యం కూడా ఇస్తున్నారు సార్" అతను చెబుతూనే ఉన్నాడు. మా భయంవల్ల అతను ఓ వారం రోజుల పాటు ఆ పిల్లలని పనికి పంపడని మాకు అర్థమైంది. వారం తర్వాత మళ్లీ మామూలే. ఈ సారి పార్సీగుట్ట నుంచి వెళ్లేటప్పుడు చూడండి. ఇద్దరు పిల్లలు సైలెన్సర్లని కాలుస్తూ కనిపిస్తారు. మిట్టమధ్యాహ్నం లేత బాల్యం ఆ బట్టీముందు కాలుతుంటుంది. ఆదిల్, రబ్బాని - వీరు కాకపోతే మరో ఇద్దరు పిల్లలుంటారు. ఈ కథ అలా కొనసాగుతుందంతే!

బొమ్మలు : విఠల్. ఫోటోలు: మురళి, రజనీకాంత్.
13 ఏప్రిల్ 2003

రాజధానిలో
ఈ పుంజును చూశారా?

హైదరాబాదులో బోనాల పండగ ఎంత ఫేమసో, కోళ్ల మంగారం బొమ్మలు అంత ఫేమసని అంటారు. అటువంటి ఒక శూద్ర చిత్రకారుడి పరిచయ వ్యాసమిది.





6.

## కోళ్ల మంగారం


హైదరాబాద్ నగరంలో చికెన్ సెంటర్ పెట్టాలంటే ముందుగా గుర్తొచ్చేది ఆర్టిస్ట్ మంగారం. అతను కోళ్ల మంగారంగానే ప్రసిద్ధుడు. అతను వేసే కోడికి ఎంత డిమాండ్ అంటే అతను బోర్డు రాయడానికి తీరిక లేదంటే చాలు, సదరు షాపు యజమాని 'ఇనాగరేషన్‌ను' వాయిదా వేసుకున్న సంఘటనలున్నాయి. మంగారం బొమ్మ ఉంటే చాలు, వ్యాపారం బాగా జరుగుతుందనేది షాపు యజమానుల విశ్వాసం.

ఇంతకీ మంగారం ప్రత్యేకత ఏమిటి?

కోడిపుంజులోని రాజసాన్ని బొమ్మలోకి తేవడమే అతని ప్రత్యేకత.

కోడిపుంజు అందం తెలిసిన వారు మంగారం బొమ్మను చూసి మెచ్చుకోకుండా ఉండలేరు.

కొచ్చెటి ముక్కు, చురుకైన కళ్లు, తలమీద ఎర్రటి తురాయి, వేలాడే చెవులతో మంగారం కోడి చికెన్ సెంటర్ల ముందు కనిపిస్తుంది. కోడంటే కోడి కాదు. అతను మొత్తం పిక్చర్ వేయడు. కేవలం తల వరకే వేస్తాడు.



ప్రకాశవంతమైన రంగుల్లో చూడగానే కళ్లు తిప్పుకోలేనంతటి ఆకర్షణ మంగారం కోడి ప్రత్యేకత. నిజానికి మంగారం బొమ్మకూ ఒరిజినల్ కోడికి ఏ సంబంధమూ లేదు. ఇంకా చెప్పాలంటే ప్రపంచంలోని ఏ కోడీ మంగారం బొమ్మలా ఉండదు. కానీ మంగారం కోడిని చూసిన వాళ్లు 'కోడి అంటే ఇలా ఉండాలి' అని అనుకోకుండా ఉండలేరు.

అదీ మంగారం క్రెడిట్.

డ్రెస్సింగ్ చేసిన కోడి బొమ్మను వేసే ఆర్టిస్టులున్నారు. అదెంత బ్యాడ్ టేస్టో మంగారం కోళ్లని చూస్తేగానీ అర్థంకాదు.

జంటనగరాల్లో మంగారం పరిచయంలేని చికెన్‌సెంటర్ యజమాని లేడు.







మంగారం కోళ్లను మాత్రమే వేస్తాడనుకుంటే పొరబాటు. శూద్ర దేవతలను వేయడంలో ఆయన తర్వాతే ఎవరైనా. హైదరాబాద్‌లో బోనాలు ఎంత 'ఫేమసో' మంగారం బొమ్మలు అంత 'ఫేమస్' అంటారు అతని మిత్రులు. ఆయన వేసిన దుర్గామాత, మహంకాళమ్మ, కనుకదుర్గ, అండాళమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, మల్లమ్మ, కట్ట మైసమ్మ, ఆంజనేయస్వామి, నాగదేవత వంటి దేవీదేవతల బొమ్మలను చూస్తే ఎవరైనా ఇదే మాట అంటారు.

బేగంపేట డౌన్‌లో కేసరి హనుమాన్ టెంపుల్‌పై ఉన్న బొమ్మలు కూడా ఆయనవే. అలాగే



గాంధీనగర్‌లోని సాయిబాబాగుడి, మారేడ్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద అష్టలక్ష్మి గుడిపై ఉన్న బొమ్మలు కూడా మంగారం గీసినవే.

"ఆయన బొమ్మలు మేధావులకు నచ్చవు. సామాన్యులు మాత్రం సంబరపడుతారు. అబ్బురపడుతారు" అని మంగారాన్ని బాగా ఎరిగిన విఠల్ అనే ఆర్టిస్ట్ అన్నాడు.

కాచిగూడ చౌరస్తా వద్ద మార్క్ టేలర్ షాపు ఉంది. ఈ షాపు కోసం మంగారం పదేళ్లక్రితం బొమ్మ వేశాడు. గ్రామాలనుంచి వచ్చిన చిన్న చిన్న ఆర్టిస్టులు ఆ పెయింటింగ్‌ను చూసి తమ కళానైపుణ్యం గురించి బెంగపెట్టుకునేవారట. ఎందరో ఔత్సాహిక చిత్రకారులకు అది ఫేవరేట్ పెయింటింగ్.

సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్ వద్ద ఉన్న అక్వేరియం షాపుకోసం మంగారం గీసిన చేప బొమ్మల్ని చూడాల్సిందే. అంతేకాదు, వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కెనడీ విద్యాభవన్ స్కూల్లో వేసిన స్విమ్మింగ్‌పూల్ చిత్రాన్ని చూడటం గొప్ప అనుభవం. పలువురు పండ్ల వర్తకుల కోరిక మీదట మంగారం గీసిచ్చిన పండ్ల బొమ్మలు కూడా ఎంతో బావుంటాయి. ముందే చెప్పినట్లు, నిజమైన పండ్లకంటే అద్భుతంగా వేయడమే మంగారం ప్రత్యేకత.

పాతకాలం నాటి ఫోటోలు వేయడం కూడా మంగారానికి వచ్చు. ఎవరైనా పారిపోయి నప్పుడు, పత్రికలో ప్రకటన ఇవ్వాలనప్పుడు ఫంక్షన్స్‌లో తీసిన వీడియోలోంచి సదరు వ్యక్తిని చూసి బొమ్మ గీసిచ్చేవాడు.







మంగారం వాడే కలర్ కాంబినేషన్ గొప్పగా ఉంటుంది. ఒక రకమైన డెప్త్, షైనింగ్ తేవడం అతనికే సాధ్యమని తోటి ఆర్టిస్టులు చెబుతారు. ఎనామిల్ వర్క్‌లో ఫ్లోరోసెంట్ మిక్స్ చేసేవాడు. అందుకే సినిమా హోర్డింగ్స్‌లోని హీరోల్లా అతడి కోడి వెలిగిపోతుందంటారు మిత్రులు.

మంగారం తండ్రి నాగేశ్వరరావు కూడా ఆర్టిస్టే. చిన్నప్పుడు తండ్రి వద్ద  ఓనమాలు దిద్దిన మంగారం పది, పదిహేనేళ్ల వయసులో ఇంట్లో గొడవపడి బొంబాయి వెళ్లిపోయాడు.



అక్కడ బ్యానర్ సెక్షన్‌లో పనిచేసి మెళుకువలు గ్రహించి హైదరాబాద్ తిరిగి వచ్చాడు. కోడికి కొత్త అందాలు దిద్దాడు. మంగారం కలగజేసుకోకముందు నగరంలోని కోళ్ల వెలవెల బోయేవంటే అతిశయోక్తి కాదు.

మంగారం సినిమా హోర్డింగ్స్‌కు కూడా పని చేశాడు. హైదరాబాద్‌లో సినీ ప్రచార మెటీరియల్‌ను తయారు చేసే ప్రముఖ యాడ్ ఏజెన్సీ 'యాడ్-వింగ్స్'లో చాలాకాలం కాంట్రాక్ట్ ఆర్టిస్ట్‌గా పని చేశాడు. ఇటీవల ఆయన విజయశాంతి, జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు హోర్డింగ్స్ తయారు చేశాడు కూడా.

విశ్వబ్రాహ్మణుల (అవుసుల) కులానికి చెందిన మంగారం ఇంట్రావర్ట్. అతి తక్కువ మాట్లాడుతాడు. ఎప్పుడూ నవ్వు ముఖంతో ఉండే ఆయనకి పని తప్ప వేరే లోకం లేదు. సినిమాలంటే పిచ్చి వ్యామోహం. స్నేహితులు కలిస్తే ఓ నాలుగు 'గుట్కా లఢీలు' ఇప్పించమని వేధించడం తప్ప మరే చెడు అలవాటు లేదు.

ఒక్క మాటలో సుద్దరోళ్ల చిత్రకారుడని పిలువదగ్గ వాడితను.

+++

విషాదమేమిటంటే ఆయనిప్పుడు లేడు.

ఆర్ట్ వర్క్ కోసం స్కూటర్‌పై భువనగిరికి వెళ్లి వస్తుండగా యాదగిరిగుట్ట డిపో బస్ ఇతని స్కూటర్‌ని గుద్దేసింది. మంగారం అక్కడికక్కడే మరణించాడు. 16 నవంబర్ 2001న మంగారం ఈ ప్రపంచాన్ని వొదిలి వెళ్లి పోయాడు. మంగారానికి ఒక భార్య, కూతురు ఉన్నారు.

ఆయన మరణించిన సంగతి చాలామందికి తెలియదు.

గత వారం సికింద్రాబాద్‌లోని శివాజీ నగర్‌లో ఉండే మంగారం ఇంటికి ఒక చికెన్ సెంటర్ యజమాని వచ్చి "మంగారం ఉన్నాడా?" అని అడిగితే ఆయన భార్య సాయికుమారికి నోటమాట పెగల్లేదు.

"లేడు. ఆయన చనిపోయాడు" అని ఆవిడ బాధను గొంతులో దిగమింగుకొని చెబితే సదరు వ్యక్తి బెల్లం కొట్టిన రాయిలా ఉండిపోయాడు. కళ్లనీళ్లపర్యంతమయ్యాడు. ఆ వెంటనే మంగారం కూతురు పన్నెండేళ్ల నాగరాణి చేతిలో వొద్దువొద్దన్నా వంద రూపాయలు పెట్టి వెనుదిరిగాడు. మంగారం లేడనే విషయాన్ని జీర్ణించుకోని ఇలాంటి వ్యక్తులు ఎందరో.

"వారం పది రోజులకు ఒకసారి ఎవరో ఒకరు చికెన్ బొమ్మ వేయమని వస్తారు. ఆయన లేడంటాను. ఎక్కడికి వెళ్లాడో చెప్పమంటారు. ఇక తప్పనిసరై చనిపోయిన సంగతి చెబుతాను. ఇలా ఇంటికి వచ్చేవారు మంగారాన్ని ఏదో విధంగా గుర్తు చేస్తారు. ఎంత మరచిపోదామన్నా మరచిపోనివ్వరు" అంది సాయికుమారి గద్గద స్వరంతో.

బి.ఎ. వరకూ చదువుకున్న సాయికుమారి కుటుంబ పోషణార్థం ఒక చిరుద్యోగం చేస్తున్నది.

"తనకున్న ఒక్కగానొక్క కూతురిని డాక్టరు చేయాలనుకున్నాడు. కానీ ఆయన మధ్యలోనే





వెళ్లాడు" అంటూ భర్త హఠాన్మరణం తాలూకు బాధను ఆవిడ మరోసారి వెల్లడించింది.

"సాయీ... నా గురించి నీకు సరిగా తెలియక గొడవ పడతావు గానీ ట్విన్‌సిటీల నా అంత ఆర్టిస్ట్ ఎవడూ లేడు. సంపాదన ఒకటే సర్వస్వం కాదు. ఒకసారి నిన్ను స్కూటర్‌పై ఎక్కించుకుని నా బొమ్మలన్నీ చూపిస్త. అప్పుడు తెలుస్తది నా గొప్పతనం" అని నవ్వుతూ తన భర్త తరచూ చెప్పేవాడని సాయికుమారి జ్ఞాపకం చేసుకున్నది.

"నీకూ నీ బిడ్డకూ ఢోకాలేదు. నా చేతిలో కళ ఉన్నదని" చెప్పేవాడని గుర్తు చేసుకున్నది.



యాక్సిడెంట్ జరగడానికి వారం ముందు కూతురిని దగ్గర కూచోబెట్టుకుని "నువ్వు ఆర్టిస్ట్‌వి కావాలి" అన్నాడని కూతురు చెప్పింది. ఆమెకు పన్నెండేళ్లు. పేరు నాగరాణి.

"మా డాడి నాతో కలర్ కాంబినేషన్ మీద నోట్స్ రాయించాడు" అంటూ వాటిని చూపించింది.

రెడ్ + ఎల్లో = ఆరెంజ్

ఎల్లో + బ్లూ = గ్రీన్







బ్లాక్ + ఆరెంజ్ = బ్రౌన్

వైట్ + బ్లూ = స్కైబ్లూ

బ్లాక్ + వైట్ = స్మోక్ గ్రే

లైట్ బ్లూ + రెడ్ = వయొలెట్

ఇలా సాగుతాయా నోట్స్.

నాగరాణి కెనడీ పబ్లిక్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్నది. ఆమె స్కూల్ నోట్స్‌లో ఉన్న బొమ్మలని, ఫ్రెండ్స్, టీచర్స్ చూసి అవన్నీ తండ్రే వేస్తున్నాడని వెక్కిరించేవాళ్లట. తండ్రిపోయిన తర్వాత వారి అభిప్రాయం మారింది. నోట్స్‌పై ఎప్పట్లాగే బొమ్మలుండటంతో వారంతా ఆమెను దగ్గరకు తీసుకుని అభినందించారట. ఈ అనుభవాన్ని చెప్పాక కొంత సేపు ఆ తల్లీకూతుళ్లు మౌనంగా ఉండిపోయారు.

కొన్ని క్షణాలు గడిచాక, "మీరేమనుకోనంటే ఒక మాట" అంది సాయికుమారి. అదీ, మొహమాటంగానే.

"నా భర్త వెంట ఆయన గీసిన బొమ్మల ఆల్బం ఉండేది. యాక్సిడెంట్ అయినప్పుడు బండి డిక్కీలో ఉన్న ఆ ఆల్బం పోయింది. మరొక ఆల్బం తయారు చేసుకోవాలని ఉంది. ఎప్పటికైనా ఆయన గీసిన బొమ్మల ఫొటోలు సంపాదించి, ఆయన గుర్తుగా ఒక ఎగ్జిబిషను పెట్టాలి. మా ఆయన మామూలు పెయింటర్ కాదు. గొప్ప ఆర్టిస్ట్ అని లోకానికి చాటి చెప్పాలి. ఇందుకు మీరేమైనా సహకరిస్తారా?" అడిగిందావిడ.

ఇది చిన్న కోరికలాగే అనిపించింది. కానీ అదెంత పెద్దపనో ఆలోచించిన మీదట గానీ అర్థం కాలేదు.

మంగారం నగరంలోనే కాదు. ఇరుగుపొరుగు జిల్లాల్లో వేలాది బొమ్మలు వేశాడు. వాటన్నిటినీ కలెక్ట్ చేయడం చాలా కష్టం. ఏ ఒక్కరో ఫొటోలు తీయడం వల్ల కూడా సాధ్యంకాదు. మంగారంతో బొమ్మలు వేయించుకున్న యజమానులే ఇందుకు పూనుకోవాలి. ఎవరికి వారు వాటిని ఫొటో తీయించి పంపడం తప్ప వేరే మార్గం లేదు. కానీ అది సాధ్యమయ్యేదేనా? అనుమానమే!

ఆ సంగతి ఆవిడకూ తెలుసు. కానీ కోరిక మాత్రం ఉంది.

20 ఏప్రిల్ 2003, ఫొటోలు: రజనీకాంత్.

సాయి కుమారి,
ఇం.నెం. 8-1-342, శివాజీనగర్,
వెంకటేశ్వరస్వామి దేవాలయం దగ్గర, సికింద్రాబాద్.

స్వీట్లు తినండి,
భూగోళాన్ని కాదు



కళ, పర్యావరణ ప్రచారం,
మిఠాయి వ్యాపారం. ఈ మూడింటినీ సమన్వయం
చేసిన ఒక యువకుడి జీవనశైలి ఇది.





7.


# విజయరామ్

హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్‌నుండి ఇందిరాపార్క్ వైపు వస్తుంటే పెట్రోల్‌బంక్ కనిపిస్తుంది. దాన్ని దాటి మరికొన్ని అడుగులు వేస్తే పసుపు, ఆకుపచ్చ రంగులతో ఆకర్షించే మిఠాయి షాపు ఒకటి కనిపిస్తుంది. లోపలికి వెళ్లగానే నల్లటి గడ్డం, తెల్లచొక్కాలో ఉన్న ఓ ముప్పై రెండేళ్ల మృదుభాషి అద్దాల కౌంటర్‌పై కనిపిస్తాడు. అతను అప్పటికే మిఠాయి బాక్స్‌ను పేపర్ బేగ్‌లో పెడుతూ పాలిథిన్ కవర్ వల్ల జరిగే హాని గూర్చి ఎదురుగా ఉన్న కస్టమర్‌కు వివరిస్తుంటాడు. ఈ లోగా మీ రాకను గమనించి 'ప్లీజ్ ఒక్క నిమిషం' అంటూ తాను వివరిస్తున్న విషయాన్ని క్లుప్తంగా చెప్పేసి 'ఏమిటండీ' అని మర్యాద నిండిన స్వరంతో మీ వేపు తిరుగుతాడు. అతని పేరు విజయరామ్.

మీకు పర్యావరణం గురించి ఆసక్తి వుందన్న నమ్మకం కుదిరిందంటే చాలు 'నా స్టూడియోకి వెళ్లి మాట్లాడుకుందాం. మీకేమైనా అభ్యంతరమా?" అని ముందుకు దారితీస్తాడు.

ఈ మిఠాయి షాపుకు దగ్గరే ఒక కేఫ్ ఉంది. దానిపై ఉన్న చిన్న గదే అతని స్టూడియో. "నాకు 'పచ్చలు' అంటే ఎంతో ఇష్టం. అందుకే నా స్టూడియోకి, మిఠాయి షాపుకి ఎమిరాల్డ్ అని పేరు పెట్టుకున్నాను" చెప్పాడతను, స్టూడియోలోకి దారితీస్తూ.

రెండు కంప్యూటర్లు, ఒక స్కానర్, బ్రష్‌లు, కలర్స్, చెల్లాచెదురుగా కాగితాలు, గోడకు



వేలాడదీసిన పెయింటింగ్స్, ఏవో అవార్డులు అందుకుంటున్న ఫోటోలు. బెల్లం రంగులో టేక్‌వుడ్ కుర్చీలు-ఇదీ ఆయన గది లేదా స్టూడియో.

మొదటి చూపులో మనకు ఏ విశేషమూ కనిపించదు. అయితే కంప్యూటర్ పక్కన వాల్చి ఉన్న పెయింటింగ్‌ని జాగ్రత్తగా చూస్తే నీటిని కాపాడమనే మెసేజ్‌తో కూడిన వర్షపు చినుకు కనిపిస్తుంది. మరొక పెయింటింగ్ పర్యావరణ పరిరక్షణ గూర్చి చెబుతుంది. వీటితో ఏ మాత్రం పొంతనలేని విధంగా బందరులడ్డు తినండని చెప్పే మరొక బేనర్ ఆకర్షిస్తుంది. దానిపై 'పచ్చదనాన్ని పెంచుదాం, భావితరాలకు చేయూతనిద్దాం' అనిరాసి ఉంటుంది. ఆ పక్కనే మిఠాయి షాపుకోసం రకరకాల సైజుల్లో తయారు చేసిన బాక్స్‌లు, పేపర్ బేగ్స్ కనిపిస్తాయి. ఇవన్నీ ఎవరికోసమో చేసిన వర్క్ అనుకుంటాం. కానీ అతనితో ఇవన్నీ కాసేపు సంభాషిస్తే చాలు. అతను తనకు తానుగా రూపొందించుకున్న 'ప్రపంచం'లో భాగమని తెలుస్తుంది.

ఇతను డిజైన్ చేసిన స్వీట్‌బాక్స్‌పై పర్యావరణ ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పే చిన్న చిన్న కవితలు, వాటితో పాటు ఒక చక్కటి ప్రకృతి దృశ్యం ఆహ్లాదంగా కనిపిస్తుంది. అలాగే ఇతను తెలుపు, గోధుమ రంగులో ఉన్న పేపర్ బేగ్స్‌పై Life is natural,not plastic. Use bio-degradable material అనే వాక్యాలూ, Save the earth, preserve the nature అని ముద్రించిన లోగో కనిపిస్తుంది. వీటి గురించి ఆయన చెప్పింది చూసాక... కళ, పర్యావరణ పరిరక్షణ, మిఠాయి వ్యాపారం ఈ మూడిటినీ చక్కగా సమన్వయం చేస్తున్న తీరుకు ముగ్ధులవుతాం.

విజయరామ్ స్వస్థలం బందరు. వారిది మధ్యతరగతి కుటుంబం. గొప్పగా సంపాదించాలనే లక్ష్యంతో విజయరామ్ హైదరాబాద్ రాలేదు. ఇంటర్ పూర్తయ్యాక జె.ఎన్.టి.యులో అప్లయిడ్ ఆర్ట్ కోర్సులో చేరుదామని వచ్చాడు. అయితే ఇది ఐదేళ్ల చదువు. అది పూర్తయ్యాక ప్రభుత్వఉద్యోగం వచ్చే అవకాశాలూ తక్కువే. దీనికి బదులు ఒక యాడ్ ఏజెన్సీలో కుదిరిపోవడమే ఉత్తమం అనుకున్నాడు. అనుకున్నట్లే యాడ్ ఏజెన్సీలో చేశాడు. అప్పటికే చిత్రకళలో ప్రవేశం ఉన్నందున తన కళకు మరిన్ని మెరుగులు దిద్దుకున్నాడు. రెండేళ్లు పనిచేసాక సొంత స్టూడియో ఏర్పాటు చేసుకుని పూర్తికాలం ప్రొఫెషనల్ ఆర్టిస్ట్‌గా స్థిరపడ్డాడు. పనిలో పనిగా తన చిన్ననాటి అభిరుచి మేరకు ప్రకృతిని కాపాడాలని పర్యావరణ ప్రాముఖ్యాన్ని వివరించే పెయింటింగ్స్ వేయసాగాడు. వాటికి మంచి ప్రోత్సాహం వచ్చింది. ఒకసారి మిత్రుల ప్రోద్బలంతో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసాడు కూడా.

సరిగ్గా ఈ సమయంలోనే తన అన్నయ్యను హైదరాబాద్‌కు తీసుకువచ్చాడు. అతనికి ఫుడ్ బిజినెస్ చేయాలనే కోరిక మెండు. దాన్ని దృష్టిలో ఉంచుకుని అతనితో ఒక మొబైల్ వ్యాన్‌లో మిఠాయి అమ్మకాలు ప్రారంభించాడు. ఈ వ్యాన్‌ను తన స్టూడియోకు సమీపంలోనే ఉన్న ఇందిరాపార్క్ వద్ద ఉంచేవారు. తొందర్లోనే ఈ మొబైల్ వ్యాన్ ద్వారా మిఠాయి అమ్మకాలు





జోరందుకున్నాయి. బిజినెస్ పెరగడంతో ఈ పరిసర ప్రాంతంలోని వ్యాపారులు, స్నేహితులు ఇక్కడే ఒక షాపు తెరిస్తే బావుంటుందని సూచించారు. దాంతో 'ఎమిరాల్డ్ మిఠాయి షాపు' ప్రారంభమయింది. ఆ షాపు తెరిచి నేటికి రెండున్నరేళ్ళయింది. మొన్నటికి మొన్న ఐదవ తేదీన పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఇరుకిరుకుగా ఉన్న తన గదిని కాస్త విస్తరించాడు. ఇదీ క్లుప్తంగా విజయరామ్ బిజినెస్‌లోకి దిగిన వైనం.

"ఆర్ట్ నా వృత్తి, బిజినెస్ నా ప్రవృత్తి. అయితే, ప్రకృతిని కాపాడాలనే కోరిక చిన్నతనం నుంచే నాలో అంతర్లీనంగా ఉంది. ఆ భావనను కళాత్మకంగా వ్యక్తం చేయగలిగే శక్తి కళాకారుడిని కావడం వల్ల నాకు అబ్బింది. ఆ నైపుణ్యాన్ని బిజినెస్‌తో మేళవించాను. ఫలితంగా మిఠాయి నా మెసేజ్‌ను తీసుకెళుతుంది. అది నాకెంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తోంది" అన్నాడు విజయరామ్ ఒకింత గర్వంగా.

"ఆర్థికంగా మా అన్నయ్య స్థిరపడతాడని మిఠాయి షాపును తెరిచానుగానీ నిజానికి నేను బేసికల్‌గా ఆర్టిస్ట్‌నే' అని అంగీకరించాడు.

'మీ అన్నయ్య ఏం చేస్తున్నాడు?' అని అడిగితే 'అతను ఇప్పటికీ అదే మొబైల్ వ్యాన్‌లో బందరు లడ్డు, హల్వా అమ్ముతున్నాడు. వి.యస్.టి. దగ్గర కనిపించే వ్యాన్ మా అన్నయ్యదే" అన్నాడు విజయరామ్.

+++

ఇంతకీ మీ మిఠాయిలోని గొప్పతనం ఏమిటి? అని అడిగితే...

"చూడండి. నేను బిజినెస్‌లో నిజాయితీని నమ్ముతాను. ఇది స్వీట్ షాపు. దీంట్లో మోసానికి



తావులేదు. నా వరకు నేను ఐటమ్ నచ్చితేనే అమ్మకానికి పెడతాను. అది నా ప్రిన్సిపల్. అలాగే నేను చేసే స్వీట్స్‌కు రంగులు కలపడానికి ఇష్టపడను. వాటిని నేచురల్ కలర్స్‌తోనే వుంచుతాను. మరీ అవసరం అనుకుంటే ఎక్కువ ఫ్రై చేసి కావలసిన షేడ్స్ తెస్తాను. ఆర్టిస్టను కదా, స్వీట్స్ షేపుల విషయంలోనూ కొంచెం శ్రద్ధ వహిస్తాను. ఇక మా వద్ద లభించే స్వీట్స్ అంటారా?... స్పెషల్ కోవా, కేసరి కోవా, డ్రైఫ్రూట్స్ లడ్డు, ఖర్జూరా డ్రైఫ్రూట్స్ చెక్కీ, బేసిన్ లడ్డూ, ఖాజూ కత్లి, బొబ్బట్లు, పూతరేకులు, బెల్లం జిలేబి వంటి అనేక రకాలున్నాయి. మోతిచూర్ లడ్డు, డ్రైఫ్రూట్స్ లడ్డు మా ప్రత్యేకం" అని వివరించాడు.

మోతిచూర్ లడ్డు గూర్చి చెబుతూ "ఎన్నడూ లైక్ చేయని వారు కూడా మోతిచూర్ లడ్డును లైక్ చేస్తారు. ఎందుకంటారా? అందులో పెద్ద రహస్యం ఏమీ లేదు. ఈ స్వీట్స్‌లో షుగర్ కంటెంట్‌ను తక్కువ వేస్తాను. దాంతో ఒకటికి బదులు రెండు తినాలనిపిస్తుంది. అంతే' అన్నాడు నవ్వుతూ.

షాపు బయటకు వచ్చేస్తూ బోర్డు చూస్తే... 'ఎమిరాల్డ్ మిఠాయి షాపు' అన్న అక్షరాల కింద Missing taste of Life అనే వాక్యం నల్లటి అక్షరాల్లో రాసి వుంది.

"మిఠాయి గురించి కాదు. మనమందరం పచ్చదనాన్ని కోల్పోతున్న భావాన్ని లీలగా గుర్తుచేసేందుకే ఆ వాక్యం" అన్నాడతను.

"ఇందిరా పార్క్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ పడ్డ చోటునుంచి నా షాపు వద్దకు వచ్చేవరకూ ఎంత చల్లగా ఉంటుందో గమనించారా? ఇక్కడ పార్క్ వుండటం వల్లే ఈ చల్లదనం. చెట్లే లేకపోతే..." అర్థాంతరంగా ఆపేసాడు.

చివరగా ఒక చిన్న విషాదం.

ఇతని బిజినెస్ పుంజుకుంటుండగా టాంక్ బండ్‌పై ఫ్లైవోవర్ నిర్మాణం మొదలైంది. దీంతో ఇందిరాపార్క్ నుంచి హుస్సేన్‌సాగర్ వెళ్లే ప్రధాన రోడ్డుపై జనసమ్మర్దం సగానికి సగం తగ్గిపోయింది. నిజానికి పావువంతు కూడా లేకుండా పోయింది. అయినా పర్లేదు. ఇతని స్వీట్స్ రుచి, ప్రచార సరళి నచ్చినవారు ఎంత దూరం నుంచైనా వస్తున్నారు. అదే చెప్పాడతను.

ఫోటోలు: బాలస్వామి

25 మే 2003

విజయరామ్,
ఎమిరాల్డ్ మిఠాయి షాపు, పెట్రోల్‌బంక్ పక్కన,
లోయర్ ట్యాంక్‌బండ్, రామకృష్ణమఠ్ రోడ్, ఇందిరాపార్క్, హైదరాబాద్-80.
ఫోన్: 040 27654336



# రెక్కల మనిషి


తెలంగాణాలోని ఒక కుగ్రామం నుంచి బయలుదేరిన రమణారెడ్డి జర్మనీలో చిత్రకారుడిగా స్థిరపడ్డాడు. ఇన్‌స్టలేషన్ చిత్రకళలో ఈయన తనకు తానే సాటి.

## 8.
## రమణారెడ్డి

ఎనభై నాలుగులో... సిద్దిపేట కళాభవన్ దగ్గర ఒక చాయ్‌తాగి, "ఇదేం జీవితం, సొంత కాళ్లమీద నిలబడాలి. స్వతంత్రంగా బతకాలి" అని గట్టిగా అనుకున్నాడు రమణారెడ్డి. అనుకున్నదే తడవుగా ఇల్లు విడిచిపెట్టి నగరానికి వచ్చాడు. వచ్చాక గానీ అర్థం కాలేదు. ఇక్కడ 'నా' అనే వారులేరని. అయితేనేం. రాత్రయితే రైల్వేస్టేషన్, పగలంతా రోడ్లు, అలా గడిచాయి రోజులు. అక్కడా ఇక్కడా తిరిగాడు. పనేం దొరకలేదు. అప్పటికే బ్రష్ పట్టుకున్నవేళ్లు కదా! జె.యన్.టి.యులో చేరాడు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసి మాస్టర్ డిగ్రీకోసం సూరత్ వెళ్లాడు. అక్కడ తొమ్మిదినెలలు ఉన్నాడో లేడో జర్మనీ వెళ్లే అవకాశం వచ్చింది. అది మొదలు, దేశవిదేశాలు సందర్శించడం మొదలెట్టాడు. చివరకు జర్మనీలోని మ్యూనిచ్‌లో స్థిరపడ్డాడు.







"ఇన్‌స్టలేషన్ అంటే, ఆర్ట్‌ను నాలుగు గోడల మధ్యనుంచి బయటకు తెచ్చి జనం ముందు ప్రదర్శించడం."







ఇదంతా క్లుప్తంగా పద్దెనిమిదేళ్ల చరిత్ర. ఇటీవల హైదరాబాద్ వచ్చిన రమణారెడ్డి నాటి విషయాలను జ్ఞాపకం చేసుకున్నాడు. "అప్పటి పరిస్థితి యాదికొస్తే భయమైతది" అన్నాడు జర్మన్ యాసలో. ప్రస్తుతం సొంతగడ్డపై కళా ప్రదర్శన నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నానని ఆయన చెప్పాడు.

చిత్రమేమిటంటే, మనిషి వినా ఇతని కళలో మరేదీ డామినేట్ చేయదు. అలా అని రమణారెడ్డికి మనిషి రూపురేఖలతో పనిలేదు. కుల, మత, లింగ, ప్రాంతాలతోనూ నిమిత్తం లేదు. యూనివర్సల్ హ్యూమన్ బీయింగ్, కాలంతో నిమిత్తంలేని మనిషి రమణారెడ్డి వస్తువు. ఆ మనిషిని వివిధ సందర్భాల్లో భిన్న వాతావరణాల్లో ప్రదర్శించడమే తరువాయి.

యాక్సిడెంట్ కారణంగా ముక్కు పై భాగంనుంచి తల వరకూ సర్జరీ చేయించుకోవడంతో ఈ చిత్రకారుడి మొహంలో హావభావాలు తక్కువ. పరిశీలనగా చూస్తేగానీ అతనికి సర్జరీ అయినట్టు తెలియదు. అయితేనేం, తనలోకి తాను తొంగి చూసుకున్న ఈ చిత్రకారుడు మనిషిని ఆవిష్కరిస్తున్నాడు. చిత్రకళ, శిల్పకళ, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీతో సహా ఇతనికి ఇన్‌స్టలేషన్ చిత్రకళలో మంచి అభిరుచి ఉంది. నిజానికి ఇన్‌స్టలేషన్‌లో ఈయన తనకు తానే సాటిగా ఎదుగుతున్నాడు.

ఇన్‌స్టలేషన్ అంటే ఆర్ట్‌ను నాలుగు గోడల మధ్యనుంచి బయటకు తెచ్చి జనం ముందు ప్రదర్శించడమే. ఈ ప్రక్రియలో వీక్షకులను ఆలోచింపచేయవచ్చు. ఆనందింప చేయవచ్చు. అయితే ఇన్‌స్టలేషన్‌లో మెసేజ్ అతి ముఖ్యం. ఈ కళలో రమణారెడ్డి సరికొత్త రీతిలో వ్యక్తమవుతున్నాడు.

"మెటీరియల్ ఏమిటనేది నాకెప్పుడూ సమస్య కాలేదు. నా ఫీలింగ్‌ను చెప్పడానికి తగిన మెటీరియల్ ఎంచుకుంటాను. అవసరాన్ని బట్టి కాన్వాసును, కుమ్మరి మట్టిని వాడుకుంటాను. ప్రాథమికంగా నేను శిల్పిని కనుక రాయిని వాడటం అలవాటు. కొన్నిసార్లు పేపర్‌బోర్డును, మరికొన్ని సార్లు కలప, ఫైబర్ గ్లాసును వాడతాను. తాగి పారేసిన కోక్ టిన్స్, బేగ్స్ కూడా నాకు మెటీరియలే" వివరించాడు రమణారెడ్డి. తాను ఎక్కువగా మొబైల్ ఇన్‌స్టలేషన్ వర్క్స్ చేయడానికి ఇష్టపడతానని ఆయన చెప్పాడు.

మొబైల్ ఇన్‌స్టలేషన్ అంటే కదలడానికి వీలుగా తయారు చేసిన చిత్రం. ఈ విధానంలో హ్యాంగింగ్ ఇన్‌స్టలేషన్స్ చేయడం ఇతడి ఇష్టమైన వ్యాపకం.

నదిలో వేసిన ఒక అండర్ వాటర్ పెయింటింగ్ చాలు, రమణారెడ్డి కళా హృదయాన్ని ఆవిష్కరించేందుకు. బ్రిడ్జిపైనుంచి వెళ్లేవారు కిందికి చూస్తే నీటిలో తేలియాడే మనుషులు కనిపిస్తారు. 'వారు నిజమైన మనుషులేమో' అని భ్రమించేలా ఉంటుందా పెయింటింగ్. నిజానికి ఆ మనుషులను స్ట్రెయిట్ లైన్లతో వేసినప్పటికీ నీటి అలల కారణంగా ఆ పెయింటింగ్‌లోని మనుషులు కూడా కదిలినట్లు కనిపిస్తుంది.

ఈ పెయింటింగ్ చూడటం ఓ గొప్ప అనుభవం.

వేస్ట్ మెటీరియల్ అని పారేసే కోకాకోలా వంటి శీతల పానీయాల టిన్స్‌తో రమణారెడ్డి మరొక ఇన్‌స్టలేషన్ చేశాడు. సంస్కృతి వేరైనా, ప్రాంతం వేరైనా మనుషులంతా ఒక్కటే. మనిషి స్వభావం ఒక్కటే. తనకు ఉపయోగపడేంత వరకూ ఏ వస్తువునైనా మనిషి గౌరవిస్తాడు. పని కాగానే ఆ వస్తువును విసిరేస్తాడు. ఇది మానవనైజం. మానవ స్వభావంలోని ఈ గుణాన్ని చెప్పేందుకు వందలాది టిన్స్‌ను వివిధ రకాల మొహాలకు మల్లే అణచి, వాటిపై వేర్వేరు ముఖాలను చిత్రించాడితను. వాటన్నిటినీ గోడకు వేలాడ దీసాడు. ఒంటరిగా ఈ ఇన్‌స్టలేషన్ చూస్తే రకరకాల ముఖాలతో సంభాషిస్తున్న అనుభూతిని పొందుతాము.

బస్ట్‌సైజ్‌లో తన ఫొటోను తానే తీసుకుని. ఆ ఫొటోలోని తన ముఖం, వీపును వేర్వేరు సైజుల్లో ఎన్‌లార్జ్ చేశాడు రమణారెడ్డి. తర్వాత ఆ ఫొటోలపై వేర్వేరు బొమ్మలను గీసాడు. ఉదాహరణకు ఒక ఫొటోపై అనేక కళ్లు గీసాడు. మరో ఫొటోపై ఒక కంప్యూటర్ తెరను చిత్రించాడు.

ఈ పెయింటింగ్‌లో చాతి ప్లేస్‌లో కీ బోర్డు ఉంటుంది. "సృజనాత్మకతకు తల ప్రాతినిధ్యం వహిస్తుంది. కళ్లు జీవితంలోని క్యూరియాసిటీకి సింబల్" అంటాడు రమణారెడ్డి. సింబాలిజం, ఫిలాసఫీ మిళితమైన ఈ 'ఫొటో+పెయింటింగ్ ఇన్‌స్టలేషన్' ఒక నూతన ప్రయోగమని చెప్పవచ్చు.

"లైఫ్ ఈజె కంటేనర్. ఒక పరిమితమైన స్థలాన్ని ఆక్రమించే బేగ్ కూడా జీవన రహస్యాన్ని చెబుతుంది" అంటాడు రమణారెడ్డి. ఈ బేగ్ లేదా కంటేనర్‌లో ఏమి ఉంచినా, దేన్ని వేసుకుపోయినా దానికంటూ ఒక లిమిటేషన్ ఉంది. సో లైఫీజ్ లిమిటెడ్" వివరిస్తాడు





రమణారెడ్డి. ఈ మెసేజ్‌ను చెప్పడానికి యాభైబేగ్స్‌పై రకరకాల బొమ్మలను చిత్రించి ప్రదర్శనకు పెట్టాడు. తల్లి గర్భం ఒక సంచి, జీవితమూ ఒక సంచి, అలాగే ఈ విశ్వమూ మరొక సంచి, దేనికైనా ఒక పరిమితి ఉంది. ఎదుగుదల, పురోగతితో పాటు ముగింపూ ఉంది. ఈ ఫిలాసఫీని సూచించే వివిధ జీవన దృశ్యాలను ఆ బేగ్స్‌పై చిత్రించాడు. విశాలమైన హాల్‌లో తెల్లటి గోడపై ప్రదర్శించే యాభై బేగ్స్‌ను చూసుకుంటూ వెళితే మనసును శూన్యం ఆవరిస్తుంది.

రైల్వే స్టేషన్‌లో వేలాడదీసిన ఇతని ఇన్‌స్టలేషన్ గూర్చి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వేలాడే పొడవాటి మనుషులు-రెక్కలు కట్టుకుని ఎప్పుడెప్పుడు ఎగురుదామా అన్నట్లుండే మనుషులు-తలకు మొలిచిన రెక్కలు. వీటిని జర్మనీలోని వివిధ రైల్వే స్టేషన్స్‌లో ప్రదర్శించాడు. 'ప్రయాణీకులు కాసింత ప్రశాంతంగా ఉన్నప్పుడు లేదా ఆలోచనా ముద్రలో ఉన్నప్పుడు తలెత్తి ఈ ఇన్‌స్టలేషన్స్ చూస్తే, వారికి ఒక ఆహ్లాదకరమైన అనుభూతి కలుగుతుంది కదా' అంటాడు రమణారెడ్డి. 'రైల్వే స్టేషన్‌లో అనేక జాతులు, తెగల మనుషులు కలుస్తారు. వారందరూ ప్రయాణీకులే. వచ్చే, పోయే ఈ ప్రయాణీకులతో స్టేషన్ రద్దీగా, ఉత్సాహంగా ఉంటుంది. అది చెప్పడానికే ముదురు రంగులతో తయారు చేసిన మనుషులు, వరుసగా ఒకరి పక్కన ఒకరు ఉన్నట్లు ఇన్‌స్టాల్ చేశాడు. ప్రయాణం గొప్ప కోర్కెలు, ఆశలను రేకెత్తిస్తుంది. అందుకే ప్రయాణాన్ని సింబలైజ్ చేస్తూ ఒక ప్రయాణీకుడి తలకు రెక్కలు మొలిచినట్లు ఇన్‌స్టాల్ చేశానని వివరించాడు. ఇలాంటి అనేక ఇన్‌స్టలేషన్‌ల గూర్చి ఎంతైనా వివరించవచ్చు.

+++


జర్మనీలో స్థిరపడ్డ రమణారెడ్డి అక్కడి పౌరసత్వాన్ని తీసుకోలేదు. సందర్భాన్ని బట్టి కళా ప్రదర్శనలు నిర్వహించడం, ఆర్ట్‌స్కూల్స్‌లో లెక్చర్స్ ఇవ్వడం, ఇలా వచ్చే ఆదాయంపైనే ఇతను ఆధారపడుతున్నాడు. "పూర్తిస్థాయిలో, ఒక ప్రొఫెషనల్ ఆర్టిస్ట్‌గా బతకడంలో ఎంతో ఆనందం ఉంది. ఆ మేరకు నేను అదృష్టవంతుడినే. అయితే ఇక్కడో చిక్కుంది. జర్మనీవారు తమకు కావలసిన ఇండియన్ కళాఖండాలను భారతీయ గ్యాలరీల నుంచి నేరుగా కొనుగోలు చేస్తారు. దాంతో జర్మనీలో స్థిరపడ్డ నా వంటి భారతీయ కళాకారులకు ఇబ్బందే. ఇక జర్మన్స్ మమ్మల్ని వారి మనిషిగా ఎలాగూ గుర్తించరు. దాంతో నేనిటు ఇండియన్‌ను కాదు, అటు జర్మన్‌నీ కాదు" అని తన సంకట పరిస్థితిని వివరించాడు.

చివరగా ఒక మాట. రమణారెడ్డిది సిద్దిపేట దగ్గరి లకుడారం. ఆయన తండ్రి ఒక ఆర్టీసీ ఉద్యోగి. ఇలాంటి పరిచయం ఆయనకు ఇష్టం ఉండదు. తన కళాకౌశలం ఎంత తూగుతుందో అంచనా వేస్తే చాలంటాడు! ఈ అంచనాల సంగతి పక్కనబెట్టి, ముందు ఆయన వర్క్స్ చూడటం బెటర్. నేనెంత రాసినా, మీరెంత చదివినా, అదంతా ఆయన వర్క్ గురించే కదా! సో, రమణారెడ్డి వెబ్‌సైట్‌లోకి వెళ్లండి. www.ramanareddy.de

ఫొటోలు: రాజు.వి. 18 మే, 2003

మానవ సంబంధాలన్నీ
రక్తసంబంధాలే

నలభైనాలుగేళ్ళ
కొలచల చంద్రశేఖర్ మానవ
సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు
కావని నిరూపిస్తున్నారు. అందుకు
రక్తదానాన్ని సాధనంగా ఎంచుకున్నారు.





## 9.
## కొలచల చంద్రశేఖర్

మొదటి చూపులో కొలచల చంద్రశేఖర్ వయసును పోల్చుకోలేము. ముప్పై ఏళ్ల యువకుడిలా వుంటాడు. కానీ అతని వయసు నలభైనాలుగేళ్లు. ఆయన తన ఈడు వారితోనే స్నేహం చేస్తాడా అంటే అదీ లేదు. చిన్నపిల్లల నుంచి పండుముసలి వరకు అతనికి స్నేహితులే. ఆయన ఎక్కడకు వెళ్లినా ఎవరో ఒకరు తోడుండాల్సిందే. తన కుటుంబ సభ్యులో, ఇరుగు పొరుగు వారో లేదా ఎవరో ఒక స్నేహితుడు ఆయన రాజ్‌దూత్‌పై తప్పక కనిపిస్తారు. ఆఫీసుకు వెళ్లేప్పుడు తప్ప తోడు లేకుండా ఆయన ఎక్కడికీ వెళ్లరు.

ఇదేం అలవాటని ఆయన్ని అడిగితే ఒత్తయిన గడ్డం మధ్యలోంచి ఆయన సన్నటి పెదాలు విచ్చుకుంటాయి. మరీ రెట్టిస్తే ఇలా చెప్పాడు. 'నేనెక్కడికి వెళతానో నా వెంట ఉన్నవారికి తెలుస్తుంది. ఉదాహరణకు నిన్నటి ఫోన్ కాల్‌నే తీసుకోండి. అతనెవరో తెలీదు. నిమ్స్‌లో నా ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. వారికి 'ఓ నెగెటివ్' రక్తం అవసరమైంది. వెంటనే నాకు ఫోన్ చేసారు. 'దానికేం భాగ్యం. తప్పకుండా డొనేట్ చేస్తాను' అన్నాను. పేషెంట్ పేరు, వార్డ్ నంబర్ వంటి వివరాలు తీసుకుని నేరుగా నిమ్స్‌కు వెళ్లాను. రక్తాన్ని డొనేట్ చేసి వస్తూ అదే విషయం వారికి ఫోన్ చేసి చెప్పాను. అయితే నిమ్స్‌కు వెళ్లేప్పుడు నా వెంట శిరీష్ అనే అబ్బాయిని తీసుకెళ్లాను. ఎందుకంటారా? అతను మా ఇంటి పక్కనే వుంటాడు. ఖాళీగా ఉన్నాడు, 'బయటకు పోయొద్దాం వస్తావా? అన్నాను. 'సరే' అన్నాడు. నేరుగా నిమ్స్‌కు వెళ్లాం. అక్కడ నేను రక్తం ఇచ్చేటప్పుడు మరొక మనిషిని లోపలకు అనుమతించరు. తెలుసు. అయినా చిరు ప్రయత్నం చేసాను. 'నాలాగా మరొకరు వలంటరీగా డొనేట్ చేయాలంటే ఈ ప్రాసెస్ అంతా తెలియాలి కదా. అందుకే అతన్ని రానివ్వండి' అని రిక్వెస్ట్ చేసినట్లే అడిగాను. ఆ మాటకు అక్కడున్న వారందరూ నవ్వేసారు. అందులో డాక్టర్లు కూడా వున్నారు. లక్కీగా ఒక డాక్టరు మాత్రం నవ్వలేదు. నా చేతినుంచి రక్తాన్ని తీసుకుంటూనే ఆ డాక్టరు శిరీష్‌ను 'నీ బ్లడ్ గ్రూప్ ఏమిటో తెలుసా?' అని అడిగాడు. తెలియదని చెబితే, చెక్ చేయమని ఒక టెక్నీషియన్‌ను పురమాయించాడు. చివరకు అతని గ్రూప్ 'బి పాజిటివ్' అని తేలింది. అలా శిరీష్ పేరూ, వివరాలు డోనర్స్ రిజిస్టర్‌లో నమోదయ్యాయి.'

'సరిగ్గా ఇందుకోసమే నేను శిరీష్‌ను తోడుగా తీసుకెళ్లాను. 'నేను పిల్లల కోడిలా తిరుగుతానని చాలా మంది అంటుంటారు. దాని వల్ల నష్టమేముంది' ప్రశ్నించాడు మృదువుగా. 'తెలిసిన వారందరినీ బ్లడ్ డొనేట్ చేయడానికి సంసిద్ధులను చేయాలని కాదు. కనీసం ఎవరి బ్లడ్ ఏమిటో వారు తెలుసుకోవాలి. రక్తదానానికి తొలి స్టెప్ అదే' అన్నారు చంద్రశేఖర్.

చంద్రశేఖర్ రెడ్ క్రాస్ సభ్యుడు కాదు, లయన్స్‌క్లబ్ మెంబరూ కాదు. అతనో సోకాల్డ్ యాక్టివిస్ట్ కానేకాదు. అతడు సామాన్యమైన మనిషి. ఎ.జి.ఆఫీసులో సెక్షన్ ఆఫీసరు. కానీ,

అతనికి ఆరోగ్యమంటే బంగారం. రక్తదానం చేయడం అతి మామూలు విషయం. ఆఫీసు పని అయిపోయి ఇంటికి వచ్చాక, రాత్రిపూట పడుకునే ముందు చంద్రశేఖర్ చేతికి బ్యాండేజ్ వేసివుంటే, 'హోహో! ఇవ్వాళ మా డాడీ బ్లడ్ డొనేట్ చేసాడన్నమాట' అని అనుకుంటాం, అన్నాడు చంద్రశేఖర్ అబ్బాయి అభినవ్. అతను సెవన్త్ స్టాండర్డ్ చదువుతున్నాడు.

'నా గూర్చి మరీ మరీ అడుగుతున్నారు కనుక చెబుతున్నాను. నేను ఇరవై ఏళ్లుగా రక్తదానం చేస్తున్నాను. ఏటా కనీసం రెండు సార్లు, ఒక్కోసారి మూడు సార్లు చొప్పున రక్తదానం చేసాను. రక్తదానం చేయడం వల్ల నాకు వచ్చిన నష్టం ఏమీ లేదు. ఇంకా చెప్పాలంటే ఆత్మసంతృప్తి మిగిలింది' అన్నారు.

'1983లో నేను తొలిసారిగా రక్తదానం చేసాను. అదీ ఒక అసోసియేట్ ప్రొఫెసర్ చెల్లెలికి. నిజానికి ఆ ప్రొఫెసర్ రక్తం చెల్లెలుకు సరిపోతుంది. కానీ అప్పట్లో రక్తదానం చేసే చైతన్యం బహు తక్కువ. అందువల్ల నేను ముందుకు రాక తప్పలేదు' అన్నారు చంద్రశేఖర్.

'అఫ్‌కోర్స్. డాక్టరు ఆ ప్రొఫెసర్‌ని సున్నితంగా మందలించాడు. 'నీవు ఇవ్వచ్చు కదా, స్నేహితుడినెందుకు పిలిచావు?' అని కొప్పడ్డాడు. అది అప్పటి పరిస్థితి. అయితే ఇప్పుడు మాత్రం పరిస్థితి మారిందా? అంటే పెద్ద మార్పేమీ లేదు. ఇరవై ఏళ్లు గడిచినా అదే పరిస్థితి కొనసాగుతోంది. అదీ ట్రాజెడీ' అన్నారు చంద్రశేఖర్.

'మనకు రక్తం అవసరం పడగానే ఎవరిస్తారా? అని చూస్తాం. బ్లడ్ బ్యాంకుకు వెళతాం. కానీ డొనేట్ చేయాలని అనుకోం. ఈ వైఖరిలో మార్పురావాలి' అన్నారాయన.

మన రాష్ట్రంలో పబ్లిక్ హెల్త్ గురించి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోదు. కాబట్టి మనమే అవేర్‌నెస్ పెంచుకోవాలి. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంచుకున్నట్లే, రక్తదానం గురించి కూడా అవగాహన వుండాలి. అప్పుడే మార్పు వస్తుంది' అని కూడా చంద్రశేఖర్ అన్నారు.

'ప్రతి మనిషి శరీరంలో కనీసం ఐదారు లీటర్ల రక్తం వుంటుంది. ఈ రక్తంలో కనీసం 350 మిల్లీ లీటర్ల రక్తాన్ని మూడు నెల్లకొకసారి దానం చేయొచ్చు. దీనివల్ల మనకు నష్టమేమీ లేదు. ఎలా అంటారా? బోన్ మ్యారోలో తయారయ్యే ఎర్రరక్త కణాల వయసు నూటా ఇరవై రోజులు. ఆ తర్వాత అవి చచ్చిపోతాయి. ఈ లోగా రక్తదానం చేస్తే వృధాగా పోయే కణాలకు, అంటే మరణించే రక్త కణాలకు ప్రయోజనం కలిగిస్తున్నామన్నమాట' చెప్పాడతను.

'రక్తదానం చేయండి. మీ తోటి వారిని కాపాడండి' అని జరిపే ప్రభుత్వం ప్రచారం వల్ల పెద్దగా లాభం లేదు. నిజానికి మనకు ఏ విధంగానూ పనికి రాని రక్తాన్ని దానం చేస్తున్నామని చెప్పాలి. అందులో ఎలాంటి రిస్క్ లేదని నొక్కి చెప్పాలి. అప్పుడే చాలా మంది రక్తదానానికి ముందుకు వస్తారు. నిజం.' అన్నారాయన.

'నాది 'ఓ నెగెటివ్' గ్రూప్. అయితే, పాజిటివ్ అంటే ఏమిటో నెగెటివ్ అంటే ఏమిటో చాలా మందికి తెలియదు. ఇప్పటి వరకు మానవ శరీరంలో ఎ, బి, ఎబి, ఓ అనే నాలుగు





గ్రూపుల రక్తం వుంటుందని గుర్తించారు. ఈ నాలుగు గ్రూపుల్లోనూ మళ్లీ పాజిటివ్, నెగెటివ్ అనే సబ్ గ్రూపులుంటాయి. ఇలా నాలుగు గ్రూప్‌లను సబ్ గ్రూప్‌లుగా విభజించి అర్థం చేసుకోవడానికి కారణం ఆర్.హెచ్ ఫ్యాక్టర్. రక్తంలో ఆర్.హెచ్ వున్నవారిని పాజిటివ్ అని, లేని వారిని నెగెటివ్ అని పిలుస్తాము. 'ఈ లెక్కన నాది ఓ నెగెటివ్ గ్రూప్ కనుక నాలో ఆర్.హెచ్.ఫ్యాక్టర్ లేదు' అన్నాడు చంద్రశేఖర్.

'ఇంతకీ ఆర్.హెచ్ ఫ్యాక్టర్ అంటే ఏమిటి? మానవుడు కోతి నుంచి పరిణామం చెందాడనడానికి మన రక్తమే సాక్ష్యం చెబుతుంది. Rh ఫ్యాక్టర్ అంటే కూడా దాదాపు అదే' అంటూ ఇలా వివరించాడు. '1937లో అలెగ్జాండర్ వీనర్ అనే శాస్త్రవేత్త ఒక కుందేలుకు Rhesus అనే కోతి నుంచి రక్తాన్ని తీసి ఎక్కించినప్పుడు ఎర్రరక్తకణాల్లో అప్పటి వరకూ కనిపించని నూతన రసాయనం కనిపించింది. మరింత ఆసక్తితో పరిశోధనకు పూనుకోవడంతో ఈ రసాయనం మనుషుల్లోనూ వున్నట్లు కనిపెట్టారు. ఈ పరిశోధనవల్లే అప్పటి వరకు నాలుగు గ్రూపులుగా గుర్తించిన రక్తంలో పాజిటివ్, నెగెటివ్ అనే సబ్ గ్రూపుల ఆవిష్కరణ జరిగింది. దీనివల్లే నేడు ఎటువంటి రియాక్షన్ లేకుండా, రక్షిత రక్త మార్పిడికి వీలు కలుగుతోంది. అప్పటినుంచి Rhesus అనవాళ్లు మన రక్తంలో వుంటే ఆ రక్తాన్ని పాజిటివ్ అని, లేనట్లయితే నెగెటివ్ అనీ పిలుస్తాము.'

'...అంటే ఎ,బి,సి,డి అనే నాలుగు గ్రూపుల్లో పాజిటివ్ వున్నవారందరిలో ఈ కోతి తాలూకు లక్షణం ఉందన్నమాట' నవ్వుతూ అన్నాడు చంద్రశేఖర్. 'అంతేకాదు, ఆర్.హెచ్ ఫ్యాక్టర్ గూర్చి తెలిసిన తర్వాతే శిశు మరణాలకుగల కారణం వెల్లడైంది. గర్భంలో వుండే పిండంపై తల్లి రక్తం యుద్ధం ప్రకటించడానికి కూడా ఇదే కారణం. సరే, అది వేరే కథ' అని కాసేపు ఆ టెక్నికల్ డిటైల్స్ చెప్పడం ఆపేశాడు చంద్రశేఖర్.

+++

చంద్రశేఖర్‌కు మెడికల్ సైన్సెస్ పట్ల ఆసక్తికి పునాది వేసింది ఆయన తండ్రే. ఇతను మద్రాసులో యాభయవ దశకంలో 'లైసెన్సియేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్' (ఎల్.ఐ.ఎమ్)ను పూర్తి చేసి కృష్ణా జిల్లా నూజివీడు దగ్గరి రెడ్డిగూడెంలో ఆస్పత్రి నడిపారు. ఆయన అల్లోపతి, ఆయుర్వేదం- రెండింటినీ కలిపి వైద్యం చేసేవారు. ఇటీవలే ఆయన రిటైర్ అయ్యారు. 'మా నాన్న ఎల్.ఎమ్.ఎమ్. చేసిన రోజులనుంచి 'యాంటి సెప్టిక్' అనే మెడికల్ జర్నల్ క్రమం తప్పకుండా మా ఇంటికి వచ్చేది. ఆ మేగజైన్‌ను చిన్నప్పటి నుంచి చదవడం అలవాటయింది. అలాగే నాన్న పేషంట్లను చూస్తుంటే, వారి జబ్బు గూర్చి, దాన్ని నయం చేయడానికి చేసే ప్రయత్నాల గురించి ఆసక్తిగా తెలుసుకునేవాడిని' చెప్పాడు చంద్రశేఖర్.

'మా అన్నయ్య మెడికల్ ఫీల్డ్‌లో వున్నాడు. అతను సేల్స్‌మేనేజర్. అన్నయ్య స్నేహితులైన డాక్టర్లు, మెడికల్ రిప్రెజెంటేటివ్స్‌తో నాకు బాగా పరిచయం, దాంతో తరచూ వారితో వివిధ

జబ్బుల గురించి, మెడిసన్ గురించి చర్చించేవాడిని. ఇలా, ఆరోగ్య పరిరక్షణ గురించిన అనేక విషయాలు తెలుసుకోవడం నా జీవితంలో ఒక భాగమైంది' వివరించాడు చంద్రశేఖర్.

చంద్రశేఖర్ భార్య రజని. ఆమె సికింద్రాబాద్‌లోని వెస్లీ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్. 'రజనితో నా వివాహం అయ్యాక ఆమె మా ఇంటికి అనేక పుస్తకాలు తెచ్చింది. అందులో reader's digest వారు ప్రచురించిన Book of human body ఒకటి. ఇది నాకు ఒక బైబిల్ వంటిది. ప్రతిరోజూ ఈ పుస్తకంలోని కొన్ని పేజీలనైనా తిరిగేస్తాను. గొప్పలకోసం చెప్పడం లేదు. ఇటువంటి ఆసక్తి, చదివే అలవాటును ప్రతి ఒక్కరూ పెంచుకోవాలి. ఆరోగ్యాన్ని ఆస్పత్రిలో రక్షించుకోవడమంటే నాకు చిరాకు, అంతెందుకు, చాలా మందికి జ్వరమొచ్చినప్పుడే ఆపిల్, బత్తాయి పండ్లు గుర్తొస్తాయి. మోటుగా అంటున్నానని అనుకోకపోతే, ఆకుల్ని మేకల్లా తినాలి. అప్పుడే మన ఆరోగ్యం గూర్చి బెంగ ఉండదు' అన్నాడు ఒకింత ఆవేశంగా చంద్రశేఖర్.

'రెండు దశాబ్దాలుగా బ్లడ్ డొనేట్ చేస్తున్నాను. అప్పటికీ ఇప్పటికీ రక్తాన్ని స్వీకరించడంలో పెద్ద మార్పేమీ రాలేదు. బాటిల్స్‌కు బదులు ప్లాస్టిక్ బేగ్స్ వచ్చాయి. వెయింగ్ మెషీన్స్ వచ్చాయి. పడక మంచంవలే వుండే డోనర్ కోచెస్ వచ్చాయి. రక్తదానం తర్వాత టీ, కాఫీకి బదులు కూల్‌డ్రింక్స్, ఫ్రూటి వంటివి ఇవ్వడం మొదలెట్టారు. అయితే డోనర్‌ను మోటివేట్ చేసేలా, 'హ్యూమన్‌టచ్'తో మాట్లాడే అలవాటు మాత్రం టెక్నీషియన్స్‌లో పెరగలేదు. యాంత్రికంగా రక్తం లాగేసుకుంటారు. అది మారాలి' అని చంద్రశేఖర్ ఆవేదనతో సూచించారు..

మరో విషయం. ఈ ఇరవై ఏళ్లలో ఒక పదేళ్లు తనది కాని బ్లడ్ గ్రూప్‌ను డొనేట్ చేసిన అనుభవం చంద్రశేఖర్‌ది. ఆ అనుభవాన్ని కూడా ఇలా పంచుకున్నారు. 'ఒక హాస్పిటల్ వారు నా బ్లడ్ గ్రూప్ 'ఓ పాజిటివ్' అన్నారు. దాంతో పదేళ్ళు 'ఓ పాజిటివ్' పేరుతోనే బ్లడ్ డొనేట్ చేసాను. ఆ తర్వాత గానీ నా బ్లడ్ గ్రూప్ 'ఓ నెగెటివ్' అని తెలియలేదు. జరిగింది తెలిసాక షాక్ తిన్నంత పనైంది. అయితే రక్తదానం చేయగానే మన రక్తాన్ని పేషెంట్‌కు ఎక్కించరు. టెస్ట్ చేసాకే ఎక్కిస్తారు. దాంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ అనుభవం తర్వాత ఏ హాస్పిటల్‌లో బ్లడ్ డొనేట్ చేసినా సర్టిఫికెట్ ఇవ్వమని కోరుతున్నాను. ఆ క్రమంలోనే బ్లడ్ డొనేట్ చేసినందుకు ప్రభుత్వోద్యోగులకు ఒక రోజు స్పెషల్ కాజువల్ లీవ్ దొరుకుతుందని కూడా గ్రహించాను. (ఆ మేరకు జి.వో.యం.యస్. నం.యం అండ్ హెచ్. 137, తేది 3-2-1984) అంతేకాదు, డోనర్‌కు ప్రమాదవశాత్తూ యాక్సిడెంట్ జరిగితే ఇరవై ఐదు వేల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కూడా వుందని తెలిసింది. అయితే ఇది ఇస్తున్నదీ లేనిదీ కనుక్కోవాల్సివుంది.'

'వైద్యపరమైన జ్ఞానాన్ని పంచడంలో డాక్టర్లు, టెక్నీషియన్లు పోటీ పడతారు. ఇద్దరూ ఇద్దరే. డోనర్‌కు ఎవరూ సహకరించరు. ఏదైనా అడిగితే 'దాంతో మీకేం పని' అన్నట్లు చూస్తారు. ఇటీవలే నా బ్లడ్ గ్రూప్ 'ఓ నెగెటివ్' అని తెలిసిన మిత్రుడొకరు నీది 'బాంబే ఫినోటైపేనా?' అని అడిగాడు. ఈ ప్రశ్నకు నేను దిమ్మదిరిగిపోయాను. అదేం టైపో తెలుసుకోవడానికి వెంటనే ఒక బ్లడ్ బ్యాంకుకు వెళ్లి అడిగాను. 'అవును. అదొకటుంది. వివరాలేం తెలియవు' అన్నారు.



కోళ్ళ మంగారం మరి కొందరు

డోనర్స్ తరచూ ఎదుర్కొనే సమస్యలను కూడా చంద్రశేఖర్ వివరించారు. స్వీకర్తల్లో రుణపడి వున్నామనే ఫీలింగ్ ఒకటి ఏర్పడుతుంది. దాంతో డోనర్స్‌ని పేషెంట్ తాలూకు కుటుంబ సభ్యులు, స్నేహితులు చాలా మొహమాటపెడతుంటారు. 'కాఫీ, టీ, టిఫిన్, లంచ్ వంటి ప్రతిపాదనలు మామూలే. అలాగే, డొనేషన్‌కు ముందు పికప్ చేసుకుంటామని, ఆ తర్వాత ఇంటి వద్ద డ్రాప్ చేస్తామని రిక్వెస్ట్ చేస్తారు. వీటన్నింటి కంటే బ్లడ్ డొనేట్ చేశాక ఆ డోనర్‌కు బ్లడ్ రిపోర్ట్‌ను పంపించగలిగితే అది సరైన మర్యాదగా నేను భావిస్తాను. ఇరవై ఏళ్ల నా అనుభవంలో ఒక్కసారి మాత్రమే నేను కోరినట్లుగా రిపోర్ట్ అందుకున్నాను.

డోనర్స్‌లో ప్రొఫెషనల్ లేదా కమర్షియల్ డోనర్స్ వున్నారు. వీరు డబ్బు కోసమే రక్తదానం చేస్తారు. వీరితో ఒక ప్రమాదం ఉందంటారు చంద్రశేఖర్. 'కమర్షియల్ డోనర్స్ మూడు నెలలకొసారి రక్తదానం చేస్తున్నారా? లేక డబ్బులు అవసరమై తరచూ ఇస్తున్నారా? ఎవరికీ తెలియదు. దాన్ని చెక్ చేసే విధానం హాస్పిటల్స్ పాటించడం లేదు. నిమ్స్‌వంటి పెద్ద హాస్పిటల్ అధికారులు కూడా వలంటరీ డోనర్స్ లిస్ట్‌లోంచి నా వంటివారి పేర్లను అవసరమైన వారికి ఇస్తున్నారు గానీ, మేం చివరిసారిగా ఎప్పుడు రక్తం ఇచ్చామో వారు చెప్పలేరు. అందుకే రికార్డ్ మెయింటేన్ చేయాలనేది నా వాదన' అన్నారు చంద్రశేఖర్.

'అన్నట్టు, మీరు డోనర్స్‌తో మాట్లాడుతున్నప్పుడు ఎంతమందికి రక్తదానం చేసారు? అని అడగొద్దు. ఎన్నిసార్లు ఇచ్చారు అనడమే కరెక్ట్' అంటారు చంద్రశేఖర్. 'ఎందుకంటే, రక్తం ఇచ్చిన అన్ని సార్లు వారికి రక్తాన్ని సదరు పేషెంట్‌కే ఎక్కించాలన్న నియమం లేదు. డోనర్ ఆనందంలోని మోతాదు తగ్గేదీ, పెరిగేదీ ఇలాంటి విషయాలతోనే' అంటూ రక్తదానం చేసేప్పుడు పేషెంట్ హోదా, అధికారం, జెండర్, కులం వంటివి పనిచేస్తాయి. ఇక డబ్బు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తనకైతే ఇవేవీ అడ్డం రావంటాడు చంద్రశేఖర్.


చివరకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను అన్నారు చంద్రశేఖర్ కాస్త బరువుగానే. 'బజార్లో, మెడికల్ షాపుల్లో మెడిసిన్ దొరికినంత తేలిగ్గా మనకు రక్తం దొరకాలి. ప్రస్తుతానికి మనుషుల రక్తాన్ని మాత్రమే మనుషులకు వాడుతున్నారు. ఇది కొనసాగినంతకాలం దాతలు ముందుకు రావాలి. ఆరిపోతున్న ప్రాణాల్ని కాపాడాలి. ఒకవేళ పరిశోధనలు ఫలించి జంతువుల రక్తం కూడా మనుషులకు ఎక్కించిన రోజు మానవజాతి ఒక మంచి అవకాశాన్ని 'మిస్' అవుతుంది. అప్పుడు మానవ సంబంధాలకు గల అర్థాన్ని జంతువులు తిరగరాస్తాయి.'

ఫోటో: రాజు.వి.
13 జూలై 2003

కొలచల చంద్రశేఖర్,
1-325/4/హెచ్.ఐ.జె., రాజమణి నిలయం,
రాంనగర్ గుండు వద్ద, హైదరాబాద్-44. ఫోన్: 040-27071022

అయ్యా...
అబద్ధమాడద్దు!

ఇతను తినడు. తాగడు.
అబద్ధం ఆడడు.
మోసం చేయడు.
ఎవరిపైనా ఆధారపడడు. మాట
వరసకు చెప్పడం కాదు, ఇతడి
జీవనశైలే అంత!





10.

## గుడికాడి చిన ఐలయ్య

ఇతనికి సుమారు అరవయ్యేళ్లు. నల్లటి శరీరం. నరాలు తేలిన దేహం. ఒంటిపై ఖాకీ బట్టలు. తలపై మార్వాడీ టోపి. చురుకైన కన్నులు. ప్రేమపూరితమైన మొహం. 'ఐలయ్య' అంటే నువ్వేనా? అంటే 'అవును. గుడికాడి ఐలయ్యను' అంటాడు.

నలభై ఏళ్లుగా ఇతని నివాసం ఫుట్‌పాత్.

సికింద్రాబాద్‌లోని రెతిఫైల్ బస్‌స్టాప్ నుంచి ప్రధాన రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారిలో ఎడమవైపున గణేష్ దేవాలయం ఉంది. ఆ పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌మీద చిన్న టెంట్ వేసుకుని పంక్చర్‌లు చేస్తూ బతుకుతాడితను.

'పంక్చర్లు వేయడానికి' అని యథాలాపంగా అంటాము గానీ నిజానికి 'ప్యాచ్‌లు వేయడానికి' అనాలి.


ఫుట్‌పాత్‌పై వేసిన ఆ చిన్న టెంట్‌ను లేదూ అది ఆక్రమించిన స్థలాన్ని ఐలయ్య 'దుఖానం' అని పిలుచుకుంటాడు. ఆ దుఖానంలో ఆయన తాలూకు వస్తువులు బహు తక్కువ. రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న దుఖానం కదా, ఆ రైళ్లలో సమోసాలు అమ్ముకునే పిల్లలు తాము తిరిగి వచ్చే వరకు జాగ్రత్తగా చూడమని పెట్టిన సంచులే అక్కడ ఎక్కువ కనిపిస్తాయి. వాటితోనే



అతని 'దుఖానం' నిండిపోతుంది.

మరి ఆయన వస్తువులు?

గాలి కొట్టే పంపు, రెండు పానాలు, కొన్ని ట్యూబులు, క్లచ్ వైర్లు, సొల్యూషన్, ఉప్పుకాగితం. వీటితోపాటు అతిథులకోసం ఒక తెల్లటి టీ కప్పు, చుట్టు పక్కల వారి దాహార్తిని తీర్చడానికి చల్లటి నీళ్ల సీసాలు నాలుగు. వాటిని ఒక చేయి సంచిలో జాగ్రత్తగా దాస్తాడు.







పని ఉంటే అతను దుఖానంలో కనిపిస్తాడు. లేదంటే ఆ పక్కనే ఎక్కడో ఉంటాడు.

మాటిమాటికి చాయ్ కోసం ఎదురుగా ఉండే కేఫ్ వైపు వెళుతుంటాడు. అలా వెళ్లేప్పుడు వచ్చేపోయే బస్‌లు ఆగిపోతాయి. అవును. అతను గాలిలోకి చేయి పైకెత్తి నడుస్తుంటే బస్సులు ఆగాల్సిందే.

రద్దీగా ఉండే జనసమ్మర్దంలో అతనొక సామాన్యుడిగా కనిపించడు. ఆ ప్రాంతమంతా తనదే అన్నట్లు ప్రవర్తిస్తాడు. ఆయన దుఖానం పక్కన బండిపై దువ్వెనలు, క్లిప్పులు, అద్దాలు,



పర్సులు, ప్లాస్టిక్ వస్తువులు పెట్టుకుని అమ్మే వారితో పరాచకాలాడుతుంటాడు. 'సారా తాగుతావా?' అంటూ 'స్టీలు గిలాస'లో తాను తెచ్చుకున్న టీని వారికి అందించి ఆనందిస్తాడు.


రాత్రి ఒంటిగంట వరకు మేలుకునే ఐలయ్య కేవలం గంటసేపు నిద్రపోతాడు. అదీ మధ్యలో ఎవ్వరూ లేపకపోతేనే. ప్యారడైజ్ వద్ద టైరు పంక్చరైనా ఐలయ్యే దిక్కు. రాత్రీ, పగలూ లేదు. పంక్చరైతే చాలు-ఆ రోడ్డు పొడవునా ఐలయ్యనే తలుచుకోవాలి.

"రాత్రింబవళ్లు నడక, నడక, ఆడోళ్లు, మగోళ్లు, జనానికి తెరిపి లేదు. గుంటూరు, విజయవాడ నుంచి కూడా జనం వస్తున్నరు. పాపం అనిపిస్తుంది" బాధను వ్యక్తం చేశాడు ఐలయ్య.

ఇలా తన బాధను వ్యక్తం చేయడానికి రెండు కారణాలున్నాయి. బతుకు తెరువు లేక వలస వస్తున్న వైనం ఒకటైతే, 'రజాకార్ల టైంలో' వరంగల్ జిల్లా ఆలేరు గ్రామం నుంచి ఐలయ్య కూడా అలా 'బత్క' రావడం రెండో కారణం.

హైదరాబాద్‌కు వచ్చినప్పటి పరిస్థితిని గురించి చెబుతూ "యాభై ఏళ్లనుంచి నేనిక్కడ ఉన్నానయ్యా... అప్పుడు ట్రేన్లెక్కడివి? బొగ్గు బళ్లు. అవి గూడ ఏ మూలనో ఒక్కటి' జ్ఞాపకం చేసుకున్నాడు. "చౌరస్తాల మీద వీధి దీపాలెక్కడివి? ఆముదం దీపాలే" అన్నాడు ఐలయ్య.

"అప్పుడంతా వెండి రూపాయలు, రాగి పైసలు. మనం ఎక్కిపోయేంతటి మేక పది రూపాయలుండె. పాలిచ్చే బర్రె ఇరవై రూపాయలు, తులం బంగారం పది రూపాయలు. ఎవరూ కొనేటోళ్లు కాదు. ఇప్పుడంత పైస యావ' అన్నాడు.








ఆయన మాటల్లో కాసింత వ్యంగ్యం కనిపించింది.

పైసకోసమే కదా బతికేది? అంటే ఆయన మౌనం దాల్చాడు. తర్వాత ఇలా చెప్పుకొచ్చాడు.

"నేను ఫుట్‌పాత్‌పై బతికేటప్పుడు నాకు రైల్వే పోలీసు ఉద్యోగం వచ్చింది. అదొక ఉద్యోగమా? ఛీ..ఛీ.. బిచ్చగాళ్ల బతుకు. గరీబోళ్లమీద పడి పీక్కోవడం. ఎనిమిదేళ్లు చేసిన. నాతో గాలేదు. అందుకే రాజీనామా చేసిన. కాయిదాలన్నీ కుప్పవెట్టి అగ్గి పెట్టిన" అన్నాడు.

"నన్ను ఆ ఉద్యోగంల పెట్టించింది ఒక 'బాపండ్ల' పిలగాడు. పెద్ద సదువులే సదివిండుగని నౌకరి కాలేదు. అకౌంట్లు గికౌంట్లు రాస్తుండె. నా దగ్గరికి వస్తుండె. మంచి నీయతున్న పిలగాడని ఉద్యోగంల పెట్టించిన. పెద్దగ ఎదిగిండు. డియస్‌పి అయ్యిండు. తర్వాత నన్ను ఉద్యోగంల వెట్టించిండు"

"ఆ పిలగాడి పేరు యాదికస్తలేదు. ఆయనకు నేనంటే పాణం. చెల్లెలి పెండ్లి చేసినప్పుడు నాకు ఒడిబియ్యం పోసిండు. అంత ప్రేమ! నన్ను బలిమీటికి రైల్వేల పెట్టించిండు. ఆ ఉద్యోగంల ఉన్నట్టే గని చేసిందేమీ లేదు. ఏం ఉద్యోగం? సేవ చేసుడు లేదు. దోసుకోవడమే. నోరెత్తితే తిట్లు తిట్టాలి. ఇవన్నీ నావల్ల యాడైతది? ఉద్యోగం మానేసిన. మస్తు బతిమిలాడిండు. పించను వస్తదని గూడ చెప్పి చూసిండు. అయినా నేను వినలె"

"బతికి మంచి పేరు సంపాయించుకోవాలె. కొలువు చేసి నలుగురికి సాయం చేయాలె. అది కానప్పుడు ఎందుకు? పైసల కోసం కాదు గదా!" అన్నాడు ఐలయ్య.

ఐలయ్య అంతటితో ఊరుకోడు. తన వద్దకు వచ్చిన వారికి ఆయన తత్వం కూడా చెబుతాడు. "అబద్ధం ఆడద్దు బిడ్డా. అబద్ధం ఆడద్దు" అంటాడు.

"దొంగతనం చేయవద్దు. మోసం చేయవద్దు. తిని తినలేదనద్దు. ఎవ్వరి మీద ఆధారపడి బతకద్దు" నొక్కి చెబుతాడు.

ఎందుకూ? అంటే 'తప్పు' అని ఒక్కమాటలో తన సమాధానాన్ని వివరిస్తాడు.

"తప్పు చేసి చేయలేదనద్దు. నీ దయ అని ఒప్పుకోవాలి. భగవంతుడు మెచ్చుతాడు. లోకం గూడా మెచ్చుతది" చెప్పాడు.

"అందరికి ఇదే చెప్పుత. వింటె వినని. లేకపోతే లేదు. చెప్పడం నాధర్మం" అని ముగించాడు.

ఇది గుడికాడి చిన ఐలయ్య ఫిలాసఫీ.

ఐలయ్య అబద్ధం ఆడకుండా ఉండేందుకు, మోసం చేయకుండా ఉండేందుకు తన ఉద్యోగాన్ని మానేశాడు. అదేనా ఆయన ప్రత్యేకత అంటే ఇంకా కొన్ని కూడా చెప్పాల్సి వస్తుంది.

ఉదయం సాయంత్రం  రద్దీగా ఉండే స్టేషన్ రోడ్డులో, తానున్నచోటే ట్రాఫిక్ నియంత్రణ చేస్తాడు. అలా చేసినందుకు గాను స్థానిక ట్రాఫిక్ సి.ఐ. ప్రతి సాయంత్రం ఇరవై రూపాయలు పంపిస్తాడు.

పంక్చర్‌లు వేయడం ఎంత శ్రద్ధగా చేస్తాడో ట్రాఫిక్ నియంత్రణ కూడా అంత బాధ్యతగా నిర్వహిస్తాడు. అదీ ఆయన నిబద్ధత!

"తొవ్వొంటి పొయ్యేటోళ్లను ఫుట్‌పాత్ మీదినుంచే నడవమంట. కాళ్లు జేతులు ఇరిగితే ఎవ్వరూ గంజిపోయరు. పెండ్లాం మాట మొగడు వినడు. మొగని మాట పెండ్లాం వినది. కాళ్లు రెక్కలు మంచిగున్నంత వరకే ఏదైనా. ఈ మాటంటె నవ్వుకుంట పోతరు.'







"పోలీసోళ్లకు పబ్లిక్‌కు నడుమ లొల్లయితే నన్ను పెద్దమనిషిగ పెడుతరు. వాళ్లను సముదాయించి పంపుత" చెప్పాడు ఐలయ్య.

ఐలయ్యలో మరిన్ని విశేషాలున్నాయి.

ఆయన తాగడు. తినడు.

టీ తప్ప ఏమీ తాగడు. మరి తిండి అంటారా? వారానికి ఒక్కరోజు అన్నం తింటాడు. అదీ మెత్తగా 'జావలెక్క' చేయించుకొని.

మరి తిండి లేకుండా ఎలా ఉంటావు? అని అడిగితే, ఏం జెయ్యాలె. ఇల్లూ వాకిలి లేకుంట బతుకుతున్న. ఛాయ్‌నీళ్ల మీద బతుకుతున్న. మరి, నాకిక్కడ ఎవరు వండి పెడతరు?' ఎదురు అడుగుతాడు.

"రోజుకు అరవై చాయలు తాగుతాను. పొద్దున లేవంగనే రెండు ఇడ్లీలు తింటె తింట. లేకపోతే లేదు"

గుచ్చి గుచ్చి అడిగితే "ఎవరికి భారం కాకుండ బతకాలనే ఇదంతా' అంటాడు. ఆమాటలోని నిగూఢార్థం వేరు.

ఆయనకు భార్యా పిల్లలు  ఉన్నారు. కానీ వారికి భారం కాకూడదనే ఇలా జీవిస్తున్నాడు.

"ఆలేరులోని రంగనాయకుల గుడి దగ్గర మా ఇల్లు. నన్ను గుడికాడి ఐలయ్య అనేది కూడా అందుకే. ఈ గుడికాడ ఉన్నానని కాదు" అన్నాడు.

"నాకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. నా భార్య ఇంటికాడనే ఉంటది. అందరి పెళ్లిళ్లూ చేసిన. ఎవరంతల వాళ్లు మంచిగనే బతుకుతున్నరు. నా బాధ్యతలు తీరినై. ఇక ఇంట్ల ఉండి చేసేదేముంది?"

"మా ఊర్లె రెండొందల గడప. ఎవరింటికి పోయి ఇంటిమీదికి కమ్మకూడ అడగలేదు. నా అంతల నేను బతికిన. అట్లనే బతుకుత. ఎవ్వరిని చేయి సాపి ఎరగను"

"ఫుట్‌పాత్ మీదనే ఉంట. పంక్చర్లు వేస్త. ట్రాఫిక్‌ను చూస్త. వారానికోసారి శనివారం 'గోల్కొండ'కు ఇంటికి పోయస్త. నా భార్యకు పెయ్యి బాగలేదు. బి.పి. అందుకే యాభై రూపాయలు ఇచ్చి పొద్దుమూకి వచ్చేస్త" అన్నాడు.

మాట్లాడటం ముగించి వెనుతిరిగి వెళుతుంటే 'అయ్యా ఒక్కమాట' అన్నాడు.


ఏమిటి? అంటే...

"అబద్ధమాడితే ఎన్నడో ఒకనాడు మనకే దెబ్బ తల్గుతది. యాదికి వెట్టుకో" అన్నాడు.

ఫొటోలు : వంశీ. 24 ఆగస్టు 2003

ముఖచిత్ర
కథనం

ఇంద్రధనుస్సు చీమల పుట్టలోంచి పుట్టిందని గిరిజనుల విశ్వాసం. సత్యశ్రీనివాస్‌కీ అలాంటి నమ్మకం ఒకటున్నది. నీటి వర్ణాలతో అలాంటి ఇంద్రధనుస్సులను గీసి చూపిస్తున్నది అందుకే.






11.

## సత్య శ్రీనివాస్

Artists don't create works and exhibitions only to discuss art, but to discuss LIFE

+++

కళ గురించి చర్చించుకోవడమంటే జీవితం గురించి చర్చించుకోవడమే. అది పెయింటింగ్ అయినా, పోట్రెయిట్ అయినా జీవితంలోని సంక్లిష్టతను సరళంగా విప్పిచెప్పుకోవడానికే. అమ్మలు, అమ్మమ్మలు, నాన్నమ్మలపై సత్య శ్రీనివాస్ వేస్తున్న పోట్రెయిట్స్ కూడా అంతే. అవి వర్తమాన సందర్భాన్ని పట్టిస్తాయి. ఒక వైఫల్యాన్ని చెప్పకనే చెబుతాయి.

పద్నాలుగేళ్ల క్రితం సోషియాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సత్య శ్రీనివాస్ సామాజిక జీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించాడు. గిరిజనుల హక్కుల కోసం, వారికి అడవిమీద అధికారం కోసం ఇతను 'గ్రాస్‌రూట్' కార్యకర్తవలే పని చేస్తున్నాడు. పరిచితులు ఇతన్ని పర్యావరణ కార్యకర్తగా గుర్తిస్తే, సన్నిహితులు, మిత్రులు 'అడవి మనిషి'గా గుర్తిస్తారు. అతను నెలకు పాతిక రోజులు అడవిలోనే ఉండటం ఇందుకు కారణం.



బంజారాహిల్స్ నుంచి ఇటీవలే గచ్చిబౌలికి మకాం మార్చిన ఇతను రోజు రోజుకూ తల్లివేరును పట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నం ఒక ఆశ్చర్యం!

తన తల్లినే కాదు, స్నేహితుల తల్లుల ఫొటోలు అడిగి తీసుకుని పోట్రెయిట్స్ వేయడం ఒక విశేషం.


అమ్మలు, అమ్మమ్మలు, నాన్నమ్మల పోట్రెయిట్స్‌ను ఒక సిరీస్‌గా వేస్తున్నాడు, "మొదట్లో ప్రముఖుల మొహాలు వేసేవాడిని. ఇప్పుడు నా స్నేహితుల అమ్మల, అమ్మమ్మల పోట్రెయిట్స్ వేస్తున్నాను" అని చెప్పాడితను.

వృద్ధ మహిళల పోట్రెయిట్సే వేయడానికి గల కారణం ఏమిటి? అని అడిగితే అతను సూటిగా సమాధానం ఇవ్వడు. కానీ అతని మాటల్లోని సారాంశాన్ని రెండు విధాల అర్థం చేసుకోవచ్చు. ఒకటేమో, మన నిర్లక్ష్యానికి గురవుతున్న స్త్రీ మూర్తులకు గౌరవంగా ప్రణమిల్లడం-కని, పెంచి, పెద్ద చేసినందుకు కృతజ్ఞతగా వారిని రేఖామాత్రంగానైనా చిత్రించి పదిలపరచడం. రెండవది తరతరాలుగా వంటింట్లో మగ్గిపోయిన స్త్రీలను చిత్రిస్తూ వారి చరిత్రను చేతనైన రీతిలో భద్రపరచడం. ఈ రెండు కర్తవ్యాలను యధాలాపంగా చేస్తున్నట్టు కనిపించే సత్యశ్రీనివాస్ మూడు తరాల మహిళల పోట్రెయిట్స్ నిశ్శబ్దంగా వేసుకుంటూ పోతున్నాడు. కనీసం ముప్పై


దొంతినేని సంపతమ్మ






ముప్పనేని నాగరత్నం

మంది మహిళల పోట్రెయిట్స్ వేసి వాటితో ఎప్పటికైనా ఒక ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలనేది ఇతని కోరిక.

వయసు మీద పడిన తల్లులను ఇంతగా పట్టించుకుంటున్నావేమిటి? అని అడిగితే ఇతను వియర్ ఎల్విన్ రాసుకున్న నోట్స్‌లోంచి (లైవ్స్ ఫ్రం జంగిల్) ఒక అనుభవం చెబుతానని మొదలెడతాడు. "చీమల పుట్టలోంచి ఇంద్రధనుస్సు పుట్టిందనేది గోండుల విశ్వాసం. ఎంత అద్భుతమైన భావన ఇది. కవిత్వాన్ని మించిన భావన. ఇలాంటి ఇమేజరీ, సింప్లిసిటీ కోసమే నేను గిరిజనులను ప్రేమిస్తాను. సరిగ్గా అలాంటి అనుభూతిని, ఆప్యాయతను పంచే తల్లులను ప్రేమిస్తాను. అందుకే అమ్మల, అమ్మమ్మల, నాన్నమ్మల పోట్రెయిట్స్ వేస్తున్నాను" అని వివరించాడు.

"ఏ అలికిడీ చేయకుండా ఉండీ లేనట్లుగా మసిలే తల్లులను చూస్తే పోట్రెయిట్ గీయాలనిపిస్తుంది. వృద్ధాప్యం వల్ల తాము కుటుంబానికి భారంగా మారామని మధనపడే వారిని ఓదార్చాలనిపిస్తుంది. శారీరకంగా, మానసికంగా వారికి స్వాంతన ఇవ్వడంలో, సృజనాత్మక వ్యాపకం కల్పించడంలో మనం ఎక్కడున్నాం?" ప్రశ్నిస్తాడితను.

"ఈ ముసలమ్మలే లేకపోతే కుటుంబం ఎక్కడిది? మనం ఈ స్థాయికి ఎలా వచ్చేవారం?" అని ముక్కుసూటిగా ప్రశ్నిస్తాడు. సత్య శ్రీనివాస్ పోట్రెయిట్స్ వెనుక ఇలాంటి అనేక ప్రశ్నలున్నాయి.

ఇక రంగుల సమ్మేళనానికి వస్తే...

"నిశ్చలమైన నీటి చెలమలో ఒక రాయి విసిరితే సుతిమెత్తని తరంగాలు పరివ్యాప్త మవుతాయి. తరంగాలు మనకి కనిపిస్తున్నాయంటే అది రంగువల్లా? కాదు. నీటి ప్రతిఫలనం వల్ల. ఇలాంటి రిఫ్లెక్షన్ టెక్నిక్‌ను పోర్ట్రెయిట్స్‌లో చూపాలనేది నా ప్రయత్నం."

"వాటర్ మార్క్ టెక్నిక్ ఉపయోగిస్తూ, అతి తక్కువ రంగుల్లో మొహాన్ని చిత్రించాలనేది నా ప్రయత్నం. ఫేస్ ఈజ్ మిర్రర్ ఆఫ్ లైఫ్. ఘడియ ఘడియకూ మారే ముఖాలను. ఎక్స్‌ప్రెషన్స్‌ని నీటి రంగులతో చిత్రించాలని ప్రయత్నిస్తున్నాను. నిజానికి రంగులు లేకుండా గీయాలనేది నా ఆదర్శం. కుదరదు కదా!" అన్నాడు.

ఎవరు పోర్ట్రెయిట్ వేసినా మొదట కళ్లతో ప్రారంభిస్తారు. తర్వాత ముక్కు, నోరు గీస్తారు. ఆ తర్వాతే ఒక ఔట్‌లైన్ వస్తుంది. సత్య శ్రీనివాస్ కూడా అలాగే గీస్తాడు. అయితే ముఖంలోని ముడతలకన్నా కళ్లే ఇతను ప్రధానంగా తీసుకుంటాడు. కళ్లు జీవితానుభవం తాలూకు బడలికను చెబుతాయని ఇతని అభిప్రాయం. "ముడతలు ఫిజికల్ ఏజ్‌ని చెబితే, కళ్లు మోర్ దాన్ ఫిజికల్ అనిపిస్తుంది. కళ్లల్లో నాకు వయసుతో పాటు వయసుకు తగ్గ ఎక్స్‌ప్రెషన్ కనిపిస్తుంది" చెప్పాడతను.

సత్య శ్రీనివాస్ ఇదంతా కూల్‌గా చేయడం లేదు. ఇతన్ని చికాకు పరిచే అంశాలూ ఉన్నాయి. పోర్ట్రెయిట్ గీసేందుకు ఎవరిని ఫోటో అడిగినా లేదంటారని విసుక్కుంటాడితను. "ఒక వేళ ఉన్నా గ్రూప్ ఫోటోలుంటాయి. ఎంత మంది తల్లులు ఇలా గ్రూప్‌ఫోటోల్లో చచ్చిపోతున్నారో?" అని విచారిస్తాడు.


తల్లావఝుల సంపతమ్మ






ఉలిమిరి కామాక్షి

మనిషి ఉన్నప్పుడు వారికి విలువ ఇవ్వం. పోయాక అదే గ్రూప్ ఫోటోను ఎన్‌లార్జ్ చేయించి పూలదండ వేస్తామని తిరస్కారంగా చెబుతాడు.

సత్యశ్రీనివాస్ తిరస్కారంగా అన్నాడని తప్పుపడదామా?

ముక్కూ మొహం లేనట్లు, ఎవరి దృష్టినీ ఆకర్షించకుండా కాలంతో పాటు అదృశ్యమయ్యే మన అమ్మలు, అమ్మమ్మలు, నాన్నమ్మలను చిత్రించి మన చేతిలో పెడుతున్నాడు. ఇతనికి పోర్ట్రెయిట్ వేయడమంటే తల్లిని స్మరించుకుంటూ చేసే ఒక చిన్న గెశ్చర్. మర్యాద. ఇటువంటి మర్యాదను మనలో నెలకొల్పాలనే ఇతని ప్రయత్నం.

అన్నట్టు ఇతను పురుషుల పోర్ట్రెయిట్స్ వేయడెందుకు?

"ఎందుకు వేయాలి. వారికేం తక్కువ" అన్నట్లు మొహం పెట్టాడు. కానీ ఇలా చెప్పాడు: "నాకు పురుషుల మొహాల్లో ఒక కంటిన్యూటీ కనిపించదు. అదే స్త్రీలలోనైతే ఒక పరంపర, పరిణామక్రమం కనిపిస్తుంది." అని ముగించాడు.

7 సెప్టెంబర్ 2003


తోడేటి కోటమ్మ

జోక్స్ ఎక్స్‌ప్రెస్
వయా రాజమండ్రి

రాజమండ్రిలో ఉండే ఈ
కుర్రాడు కాలక్షేపం జోక్స్
పుస్తకాలు అమ్ముకునే
పబ్లిషర్ల పాలిట కల్పతరువు
అయ్యాడు.





12.

## సుభాని అలియాస్ శైలి

బతుకు దెరువులేక భాగ్యనగరానికి పారిపోయి వచ్చిన బావమరిదికి నచ్చజెప్పి, సొంత ఊరికి తీసుకుపోవాలని సుభాని హైదరాబాద్ వచ్చాడు. ఎలాగూ ఇంతదూరం వచ్చాడు కనుక పనిలో పనిగా వివిధ పత్రికా కార్యాలయాలకు వెళ్లి తన రచనలను పరిశీలించమని చూపుతున్నాడు.

“నేను జోక్స్ రైటర్‌ని. నా పేరుతో అచ్చయిన రచనలు రెండువేల వరకూ ఉన్నాయి” అని తనను తాను పరిచయం చేసుకుని చెబుతుంటే ముందు చాదస్తంగా అనిపించింది. కానీ బరువైన ఒక ఫైల్‌లోంచి ఒక డజనుకు పైగా తాను రాసిన జోక్స్ పుస్తకాలను తీసి చేతిలో పెట్టినప్పుడు ఆశ్చర్యం వేసింది. అట్ట తిప్పగానే ఇతని పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, దానికింద ‘ఈ జోక్స్ రచయిత శైలి’ అని అచ్చువేశారు. సన్నగా పీలగా ఉండే ఈ అబ్బాయిని చూస్తే రైల్వే స్టేషన్లో పల్లీలు అమ్ముకునే వాడిలా కనిపిస్తాడు (సారి), కానీ ఇతని జోక్స్ పుస్తకాలే రైల్వే స్టేషన్లో అధికంగా అమ్ముడుపోతాయని తెలిసిన తర్వాత విస్తుపోక తప్పలేదు.

“నా కలంపేరు శైలి. ఒరిజినల్ పేరు సుభాని. మాది రాజమండ్రి’ అంటూ తన వ్యక్తిగత వివరాలు అప్పగించాడు. ఆ తర్వాత జోక్స్ పుస్తకాలతో పాటు తాను రాసిన సినిమా పజిల్స్, కవితలు, యూత్ ఆర్టికల్స్, సీరియల్స్ ఒక్కటొక్కటిగా చూపించి, వాటి గూర్చి వివరించాడు.

“మా అమ్మానాన్నలు బట్టల వ్యాపారం చేస్తారు. మద్రాసు నుంచి పాత బట్టలు తెచ్చి, కొత్తవాటిలా తయారు చేసి అమ్ముతారు. నాకు తమ్ముడు సిలారి, చెల్లెలు హసీనా ఉన్నారు. అయితే మా అమ్మ తప్ప ఇంకెవరూ నా రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహించరు’ నవ్వుతూ చెప్పాడు.

సుభాని వైజాగ్ జువనైల్ హాస్టల్‌లో ఏడవ తరగతి వరకు చదివాడు. తర్వాత ఆంధ్రా యూనివర్సిటీలో మెట్రిక్యులేషన్ చేసి, ఇక చదివింది చాలనుకున్నాడు. ‘మామూలే. ఇంటికి పెద్ద కావడమే అందుకు కారణం’ అన్నాడు. ఏదో ఒక చిరుద్యోగం చేయాలనుకుని ఒక రెండు దిన పత్రికలు, మరొక మాస పత్రికకు సేల్స్ ప్రమోటర్‌గా జాయినయ్యాడు. ఇప్పటికీ అదే వృత్తి. ‘నెలకు మూడువేల సంపాదన’ అని చెప్పాడు.




చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టిన రోజుల్లోనే ఒక వారపత్రిక నడిపే కలం స్నేహం శీర్షికకు తన చిరునామా పంపించి, ఒక ముప్పై ఐదు మందితో కలం-స్నేహం మొదలెట్టాడు. అదే అతని జీవితాన్ని మలుపు తిప్పింది.

ముప్పై ఐదుమందిలో ఐదుగురు అమ్మాయిలు. అందులోని ఒక

అమ్మాయి ఇచ్చిన స్ఫూర్తితో ఇతను గత సంవత్సరం 'ప్రియ నేస్తం, స్వాగతం' అనే సీరియల్ రాసాడు. అతి సామాన్యమైన మనిషిని ఉన్నత వ్యక్తిత్వం సంతరించుకునేలా ప్రోత్సహించి, అతన్ని సమాజంలో యోగ్యుడిగా మలిచే కలం-స్నేహితురాలి కథ ఇది. ఈ నవల ఒక ప్రధాన దినపత్రికలోని మహిళా పేజీలో సీరియల్‌గా పబ్లిష్ అయిందని చెప్పాడు సుభాని. ఈ సీరియల్ కాకుండా విజయవాడ, గుంటూరు వంటి పట్టణాలనుంచి ప్రచురించబడే దినపత్రికలకు రెండుమూడు సీరియల్స్ రాశాడు. ప్రస్తుతం ప్రేమకీ, ఆకర్షణకీ తేడా తెలియని యువతీ యువకులపై రాసిన నవల అచ్చుకు సిద్ధంగా ఉందని చెప్పాడు.

ఆ నవల పేరేమిటో తెలుసా? మనసా త్రుళ్లిపడకే!

జోక్స్ రాయడంలో చేయి తిరిగిన సుభాని నవలలు రాసేందుకు ప్రేమ ఇతి వృత్తాలను ఎందుకు స్వీకరిస్తున్నాడో కూడా వివరించాడు. "జోక్స్ రాయడానికి ఒక సంఘటన చాలు. కానీ ఒక హాస్య నవల రాయడం అంత తేలిక కాదు. ప్రతి సంఘటన, సన్నివేశం, కథాగమనాన్ని రక్తి కట్టించాలి. అది చాలా కష్టం. అందుకే ప్రేమ కథలు రాయడానికే అధిక ప్రాధాన్యం ఇస్తాను."

ఇతనిది సేల్స్ ప్రమోటర్ ఉద్యోగం కదా! టంచనుగా చేతికి డబ్బులు రావు. దాంతో ఇతని తండ్రి తరచూ అరుస్తాడట. "ఆ బాధనుంచి, ఆవేదన నుంచి చక్కటి వ్యాసం పుడుతుంది. సాధారణంగా అది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. అందుకే అటువంటి వ్యాసాలను రాసి స్థానిక పత్రికల్లో యువత పేజీలకు పంపిస్తుంటాను" అని చెప్పాడు సుభాని.

ఇక సుభాని అలియాస్ శైలి ప్రధాన వ్యాపకం అయిన జోక్స్ గురించి వివరాలు ఇవి.




మోహన్ పబ్లికేషన్స్, రోహిణి పబ్లికేషన్స్, లక్ష్మీనారాయణ పబ్లికేషన్స్, గొల్లపూడి వీరస్వామి అండ్ సన్స్, జె.పి. పబ్లికేషన్స్ ఇతని జోక్స్ పుస్తకాలను ప్రచురిస్తుంది. సంవత్సరానికి ఏడెనిమిది పుస్తకాలు రాస్తానని చెప్పాడితను.

ఇతనికి పుస్తకం అంటే ఒక నోట్‌బుక్. అందులో డమ్మీ వేసుకున్నట్లు మొదటి పేజీలో ఇతని పరిచయం, పబ్లిషర్ వివరాలు, పుస్తకం వెల తమాషాగా రాస్తాడు. ఒక్కో పుస్తకంలో వంద జోక్స్ తప్పనిసరి. ఆ జోక్స్ కూడా సంక్షిప్తంగా కేవలం రెండు డైలాగ్స్‌తో కట్ అవుతాయి. 'పుస్తకంలో సెంటర్ స్ప్రెడ్ ఉంటుంది కదా! ఆ రెండు పేజీల్లో సాధారణ జోక్స్‌కి భిన్నంగా,






వెరైటీ కోసం వంటల పంచాంగం, చెత్త చిట్కాలు, పిచ్చి ఉత్తరాలు, జీవిత సత్యాలు, సరదా కవితలు-వీటిల్లో ఏదో ఒకటి రాస్తాను. ఇక చివరిపేజీలో పేరడీ సాంగ్ తప్పనిసరి" చెప్పాడు. "పూర్తి చేసిన నోట్‌బుక్‌ను పబ్లిషర్‌కు ఇచ్చేస్తాను. అందుకుగానూ రెండొందల రూపాయలు తీసుకుంటాను. వారు డి.టి.పి. చేశాక, ప్రూఫ్స్ దిద్దడానికి కొరియర్‌లో మా ఇంటికి పంపిస్తారు. వాటిని సరిచేసి పంపిస్తే ఇక ఆ పుస్తకంతో నాకే సంబంధమూ లేదు" వివరించాడు సుభాని.

వంద జోకులకు రెండొందలేనా? అని ఆశ్చర్యంగా అడిగితే, "అంతే, నాకు రెండొందలు ఇచ్చి వారు ఇరవై వేల పుస్తకాలు ప్రింట్ చేయిస్తారు. ఒక్కో పుస్తకం ఐదు రూపాయలు. అలా చూస్తే ఒక్క పుస్తకానికి లక్ష రూపాయలు వస్తాయి. అయినా నాకు బాధ లేదు" అన్నాడు సుభాని.

తిరిగి కొనసాగించాడు."నా పుస్తకాలు అన్ని రైల్వే స్టేషన్లలో, బుక్ షాపుల్లో కనిపిస్తాయి. అవి ఒరిస్సా బార్డర్ వరకూ వెళతాయి. సమెసాలతో పాటు నా జోక్స్ ప్రయాణీకుల అభిరుచిని తీరుస్తున్నాయి. అది చాలదూ" ఆనందం నిండిన స్వరంతో చెప్పాడు.

"ముందు నా పేరు పుస్తకంపై చూసుకోవాలని అనుకున్నాను. ఆ కోరిక నెరవేరింది. తర్వాత సీరియల్స్ రాయడం ప్రారంభించాను. అదీ నెరవేరింది. దాంతో నాకు టాలెంట్ ఉందనే నమ్మిక కుదిరింది. అయితే పుషప్ లేదు. అదే ఉంటే భవిష్యత్తులో ఎంతైనా సంపాదించుకోగలను" అశ, నిరాశల మధ్య ఊగిసలాడుతున్నట్లు చెప్పాడు సుభాని.

"ఇవన్నీ ఒరిజినల్‌గా నీవు రాసినవేనా?"అంటే, "అవును, నావే. దినపత్రికలు చదవుతాను. హాస్య కథలు చదువుతాను. ఇక రోజువారీ జీవితాన్ని రచయితగా గమనిస్తూనే ఉంటాను. వాటిల్లోంచి మంచి ఐడియా తీసుకుని జోక్‌గా మలుస్తాను" అన్నాడు.




ఒక్కోసారి ఖాళీగా ఉన్నప్పుడు, లేదా ప్రయాణాల్లో ఉన్నప్పుడు రైల్వే స్టేషన్‌లో ఉండే బుక్‌షాపుకు వెళతాడు సుభాని. తన పుస్తకం తీసి 'ఇదెంత' అంటాడు.

"ఐదు రూపాయలు" చెబుతారు వాళ్లు.

"తక్కువ లేదా?" బేరం చేస్తాడు.

పైసా తక్కువ లేదు. తీసుకుంటే తీసుకో. లేకపోతే లేదు"కరుగ్గా చెబుతాడు షాపు యజమాని.

"ఒక్క రూపాయి తగ్గించండి" మళ్లీ రిక్వెస్ట్.

"కాదంటే కాదు. చెప్పేది నీక్కాదా?" విసుగ్గా

ఆ పుస్తకాన్ని సుభాని చేతుల్లోంచి లాక్కొంటాడు షాపు యజమాని.

అప్పుడు 'ఒక్క నిమిషం' అంటూ ఆ పుస్తకం అట్ట తిప్పి తన ఫొటో చూపించి 'ఈ జోక్స్ రాసింది నేనే ' అంటాను.

"అంతే. వాడు స్టన్నవుతాడు" చెప్పాడు సుభాని.

సుభాని జీవితంలో ఇలాంటి అనుభవాలు ఎన్నో.

నవ్వొస్తే నవ్వండి. సూపర్ కామెడీ జోక్స్, జోకులు గురూ జోకులు, గర్ల్‌ఫ్రెండ్ జోక్స్, కామెడీ కబడ్డీ, స్టూడెంట్స్ జోక్స్, తొక్కలో ప్రేమ, నవ్వుకుందాం రా, పెళ్లంటే నూరేళ్ల పంట, కామెడీ జంక్షన్, డమాల్ క్లినిక్, ఫిలింనగర్ జోక్స్ - ఇలాంటి టైటిల్స్‌తో కనిపించే జోక్స్ పుస్తకాలు సుభాని అలియాస్ శైలి రాసినవే. వీటి శీర్షికలు మోటుగా ఉన్నప్పటికీ ఆరోగ్యకరమైన హాస్యాన్నే రాస్తానని ఇతను హామీ ఇస్తున్నాడు. మచ్చుకు కొన్ని జోక్స్.

+++

ఒక మతిమరుపు ప్రొఫెసర్‌గార్ని పార్టీలో ఒకావిడ పలకరించి "గుర్తు పట్టారా? కాలేజీ రోజుల్లో నాకు ప్రేమలేఖలు రాసి పెళ్లి చేసుకోమని అడిగారు?" అంది.

"ఆ, అవును, నిజమే. అప్పుడేమైంది. మరి చేసుకున్నానా?" ఆ ప్రొఫెసర్‌గారు కుతూహలంగా అడిగారు.

+++

సునీల్: నేను వందేళ్లు బతకాలంటే ఏం చేయాలి?

సురేష్: సిగరెట్లు కాల్చకు, తాగుడు మానెయ్. శాఖాహారం తిను. అమ్మాయిలతో విచ్చలవిడిగా తిరగకు.




సునీల్: ఇలా చేస్తే వందేళ్లు బతుకుతానా?

చెప్పలేను గానీ, నీకు క్షణమొక యుగంలా అనిపిస్తుంది.

+++

అతడు: ఏమండి. మీరు చాలా అందంగా ఉన్నారు. మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను.

ఆమె: సారీ బ్రదర్, బట్ ఐ అప్రిషియేట్ యువర్ టేస్ట్.

+++





ముందే చెప్పినట్లు సుభానికి మొత్తం ముప్పై ఐదుమంది కలం స్నేహితులు అందులో ఐదుగురు అమ్మాయిలు. ఇంతకీ సుభాని ఎవర్ని పెళ్లి చేసుకున్నాడు?

కలం-స్నేహితురాలినేనా?

అదే అడిగితే. స్నేహానికీ, ప్రేమకు తేడా తెలియదా? అన్నట్లు తీవ్రంగా చూశాడు సుభాని.

"ముఖ పరిచయం లేకుండా, జీవితాంతం స్నేహాన్ని నెరపడమే కలం స్నేహం ఉద్దేశ్యం. ఇందులో ప్రేమకు చోటివ్వడం సరైంది కాదు" అని నచ్చచెప్పినట్లు వివరించాను.

ఇంతకీ సుభాని ఎవరిని పెళ్లి చేసుకున్నాడు?

మేన మరదలు జహీదాను పెళ్లి చేసుకున్నాడు.

"ఆమె చదువుకోలేదు. టైలరింగ్ చేస్తుంది. నా జోకులు, రచనలతో ఆమెకు ఎలాంటి సంబంధం లేదు" చెప్పాడు. 'మరదలు సంగతి ఎందుకుగానీ, ప్రోత్సహించాల్సిన వారు ప్రోత్సహిస్తే అంతే చాలు' అన్నట్లుంది అతని సమాధానం.

28 సెప్టెంబరు, 2003



బాయెనుకా బంతీతోటా
నా గజ్జెల మోనారె

మాట్లాడే బొమ్మకు
జానపద బాణీలు
నేర్పిన కళాకారుడీయన.

## 13.
## మల్లెల సుధాకర్

హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో వెంట్రిలాక్విజం ప్రదర్శన జరుగుతోంది. ఈ ప్రదర్శన చూడటానికి వచ్చిన జనంతో కుర్చీలన్నీ నిండిపోయాయి. ఉదయం ఆరుగంటల నుంచి సాయంత్రం ఏడుగంటల వరకూ ఏకధాటిగా జరిగే ప్రదర్శన కాబట్టి జనం కుతూహలంగా వేచివున్నారు.

రాష్ట్రంలో పదమూడు గంటలపాటు నిరాటంకంగా వెంట్రిలాక్విజం ప్రదర్శన ఇచ్చిన తొలి కళాకారుడిగా గుర్తింపు పొందాలనేది సుధాకర్ తహతహ.





ప్రదర్శనలో అత్యధిక భాగం మాట్లాడేబొమ్మ వినోదం పంచుతుంది. ఒకటి కాదు, నాలుగు బొమ్మలతో ఆ రోజు ప్రదర్శన ఇచ్చాడు సుధాకర్.

పిల్లవాడు, పెద్దవాడు, ఒక కోతి, ఒక రాబోట్- ఈ నాలుగు బొమ్మలతో పదమూడు గంటలపాటు వినోదం. ఇది మాత్రమే కాదు, ఆయన ప్రదర్శనలో మరో కొత్తదనం కూడా ఉంది.

గుండ్రంగా, అందంగా వున్న ఒక బొమ్మను ఎడమతొడపై కూచోబెట్టుకుని ప్రదర్శనకు సిద్ధమయ్యాడు సుధాకర్. మాట్లాడే బొమ్మతో తాను చేయబోయే కొత్త ప్రయోగం గురించి ఆయన ముందుగా ఎవరికీ చెప్పలేదు. ప్రేక్షకులందరూ ఆ మాట్లాడే బొమ్మ వైపు కన్నార్పకుండా చూస్తున్నారు. వారందరినీ ఆశ్చర్యపరుస్తూ ఆ బొమ్మ నెమ్మదిగా పాటందుకుంది.

'బాయెనుకా బంతీతోటా నా గజ్జెల మోనారె' ఈ జానపద గీతాన్ని ఆ బొమ్మ కళ్లెగరేసి పాడుతుంటే చూస్తున్న వాళ్లంతా త్రుళ్లిపడ్డారు.

'కలుపుకోస్తవా నా మరదలు పిల్లా' అంటుంటే సభ అంతా ఆశ్చర్యంతో మౌనంగా వింటూండిపోయారు. ఒకటి తర్వాత ఒకటి పాట ఎత్తుకుంటూనే వున్నాడు సుధాకర్.

'అత్తరుసాయిబు మంచోడమ్మా
ఉత్తరమొచ్చిన నా మొగుడు' సాగుతోందా గీతం.

త్యాగరాయ గానసభలో చప్పట్ల మీద చప్పట్లు.

బొమ్మకు పాటలు నేర్పిన సుధాకర్ ఆనందానికి హద్దులు లేవు.

"బడికి వెళ్లే రోజుల్లో సినిమా డైలాగ్స్‌ను చెప్పి స్నేహితులను నవ్వించే వాడిని. ఆ తర్వాత కాలేజీ వార్షికోత్సవాల్లో పిల్లా పెద్దలని మిమిక్రీ కళతో నవ్వించేవాడిని. వివిధ రంగాల్లో నిష్ణాతులు హాజరైన ఈ సభలో పాడే బొమ్మతో ఆనందాన్ని పంచుతున్నాను. ఒక్కో మెట్టు ఎక్కుతున్న కొద్దీ నాకు ఆనందంగా వుంది. మీ సహకారానికి కృతజ్ఞతలు" అన్నాడాయన, పదమూడు గంటల ప్రదర్శన ముగించేముందు.

"మాట్లాడే బొమ్మతో పదమూడు గంటలపాటు ఏకబిగిన ప్రదర్శన నిర్వహించడం మాటలు కాదు. కాబట్టే నెలరోజుల ముందుగా రిహార్సల్ మొదలెట్టాను. ఓ రోజు హఠాత్తుగా ఈ ఆలోచన వచ్చింది. ముందు స్నేహితుల వద్ద చేసి చూపాను. వారంతా బాగుందన్నాకే ఈనాటి ప్రదర్శనలో పాటను ప్రవేశపెట్టాను. అలా తొలి 'సింగింగ్ డాల్' పుట్టింది" నవ్వుతూ వివరించి చెప్పాడు సుధాకర్.

మూడుపదులు నిండిన మల్లెల సుధాకర్ పాలమూరులోని మేల చెరువులో, ఒక నిరుపేద దళిత కుటుంబంలో పుట్టాడు. ఆయన తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. 'పెద్ద పెద్ద చదువులు చదివించే స్తోమత వారికి లేదు. దాంతో సుధాకర్ చిన్ననాటి నుంచే ట్యూషన్లు చెబుతూ

ఇంటర్ పూర్తిచేశాడు.

ఆ తర్వాత డిగ్రీ చదివేరోజుల్లో మిమిక్రీ, వెంట్రిలాక్విజంపై దృష్టి పెట్టాడు. ఒకరకంగా చదవుకోవడానికి ఆయన పూర్తిగా మాట్లాడేబొమ్మపై ఆధారపడ్డాడు. తెలంగాణ జిల్లాలే కాదు, కోస్తా జిల్లాల్లోని మండల కేంద్రాలకూ వెళ్ళి, అక్కడి పాఠశాల విద్యార్థులను తన కళతో ఆనందింప చేశాడు. అలా వచ్చిన డబ్బుతో ఇంజనీరింగ్ పూర్తిచేసి, పోటీపరీక్షలకు కూచున్నాడు. కష్టపడే తత్వానికి తోడు అదృష్టం కలిసొచ్చింది. బి.ఎస్.ఎన్.ఎల్. టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం దొరికింది.

సుధాకర్ వెంట్రిలాక్విజాన్ని జె.వి.ఎన్.రాజు వద్ద అభ్యసించాడు. తెలుగు విశ్వవిద్యాలయంలో డిప్లొమా కూడా పూర్తిచేశాడు. ఇప్పుడు రాజుని మించిన కళాకారుడిగా గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో వున్నాడు. 'ఈ పాటపాడే బొమ్మ ప్రయోగం విజయవంతం కావడంతో నాకు భవిష్యత్తు మరింత ఆశావహంగా కనిపిస్తోంది'అని మెరుస్తున్న కళ్లతో చెప్పాడు సుధాకర్.

ఎన్ని కష్టాలెదురైనా చిరునవ్వుతో కనిపించే సుధాకర్‌కు ఉద్యోగం రావడంతో కొందరు స్నేహితులు ఈర్ష్య పడ్డారు. అందులో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా సుధాకర్ కళా ప్రదర్శన ఇవ్వడాన్ని వారు తప్పుపట్టారు. 'సరిపోయినంత డబ్బు వస్తోందిగా, ఇంకా ఆ బొమ్మను పట్టుకుని తిరగడమేమిటి'అని అన్నారు. ఈ మాటలకు సుధాకర్ బాగా నొచ్చుకున్నాడు. "కష్టకాలంలో ఈ బొమ్మ నా కడుపు నింపింది, చదువు చెప్పింది. ఇపుడు ఉద్యోగం వచ్చింది కదా అని దాన్నెలా వదిలేస్తాను? నేనేమీ చీటింగ్ చేయడంలేదు. కళతో నలుగుర్ని ఆనందింపచేస్తున్నాను. తప్పేమిటి?' అనేది ఆయన ఎదురు ప్రశ్న.

" నేను కళాకారుడిని. ఈ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలనేది నా ఆశయం. లక్షలాది జనాన్ని నా ప్రదర్శనలతో ఆనందింపచేయడంలోనే నాకు సంతృప్తి వుంది. కళకు అంతులేనట్టే, నా ఆశయానికి అంతులేదు. అయితే వచ్చిన గుర్తింపు నిలుపుకోవడం, మరింత ఉన్నతమైన కళాకారుడిగా ఎదగడం నా ముందరి కర్తవ్యం" అన్నాడు పట్టుదలగా.

సుధాకర్ జానపదబాణీలనే కాదు, ప్రజల్లో బాగా ఆదరణ పొందిన విప్లవ గీతాలను కూడా బొమ్మతో పాడిస్తున్నాడు.

"కర్మభూమిలో పూసిన ఓ పూవా" అనే పాటను ఆయన బొమ్మ కీచుగొంతుతో పాడుతున్నాసరే శ్రోతలు కంటతడి పెడతారు. అదీ సుధాకర్ గొప్పదనం.

28 డిసెంబర్ 2003

మల్లెల సుధాకర్
ఇం.నెం.13-95/1, టి.ఎన్.టి. కాలనీ,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్.
ఫోన్: 040-24151555



# చిత్రరాజం

కాపు రాజయ్య అచ్చమైన
జానపదుడు. ఆయన చిత్రమే
కాదు, చిత్తమూ జానపదమే!





14.

## కాపు రాజయ్య

బడికి వెళ్లే పిల్లవాడివలే దినాం కళాభవన్‌కు వెళ్లి బొమ్మలు దించుకోవడం కాపు రాజయ్యకు అలవాటు. 79 ఏళ్ల వయసులోనూ ఆయన ఈ అలవాటు మానలేదు.

ఎనిమిదిన్నరకు ఇంటినుంచి బయలుదేరి కళాభవన్‌కు చేరుకుంటే మళ్లీ పొద్దు పోయాక విశ్రాంతి తీసుకోవడానికి ఇంటికి చేరుకుంటారు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లేముందు స్వయంగా కళాభవన్‌కు తాళం వేసి, గేటు మూస్తారు. ఆ గేటు పక్కన స్టాండ్‌వేసిన సైకిల్‌పై ఇంటికి బయలుదేరుతారు. ఈ మధ్యలో ఆయన ఒక జానపద మహిళకో, ఒక పశువుల కాపరికో పురుడు పోస్తారు. లేదా పాత పెయింటింగ్‌పై పరుచుకున్న బల్లిపాతర (బూజు) తీసేస్తుంటారు.

ఇదే ఆయన దినచర్య.

ప్రస్తుతం ఆయన చేతిలో ముగ్గురు మగువల చిత్రం ఒకటి రూపుదిద్దుకుంటోంది.

కాన్వాసుపై నిదానంగా ఆయన చిత్రానికి మెరుగులు దిద్దుతూ వుంటే బతుకమ్మను తీర్చిదిద్దుతున్నట్లే ఉంది.

+++

ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను చూసి గర్వపడే ఈ పెద్దమనిషి కొత్త అన్నా, ఫ్యాషన్‌లన్నా అనుమానంతో చూస్తారు. అందుకే ఆయనకు హైదరాబాద్ కూడా ఇరకాటంగానే వుంటుంది. అందువల్లే, ఆయన పుట్టి పెరిగిన సిద్దిపేటలోనే ఇంకా కళాకారుడిగా, కళాబోధనలో నిమగ్నమయి ఉన్నారు. సంప్రదాయాలతో, పురాణ గాథలతో, విశ్వాసాలతో, ఊహలతో కూడిన తన స్వంత ప్రపంచంలో సుఖంగా, సంతృప్తిగా జీవిస్తున్నారు.

"కాండిన్‌స్కీ అన్నట్లు, ఒక కళాఖండం రచించటమంటే ఒక ప్రపంచాన్ని సృజించటం. నేను నా చుట్టూ వున్న ప్రపంచాన్ని రచిస్తూనే వున్నాను. నా ప్రపంచం నిత్య నూతనం" అని ఆయన అన్నారు.

రాజయ్య ప్రపంచం జానపదం. అందువల్లే ఆయన నాగరీకులకే కాదు, ఆధునిక చిత్రకారులకీ సంప్రదాయవాదిగా కనిపిస్తారు. ఇదే మాట ఆయనతో ప్రస్తావిస్తే "నేను సంప్రదాయవాదినే. అయితే ఆధునికత కూడా సంప్రదాయంలోనే ఇమిడివుంది కదా' అన్నారు. 'అంతేకాదు, సంప్రదాయ చిత్రానికి మరణం లేదు' అని విస్పష్టంగా చెప్పారు.

ఆయన వెంట ఇంటికి వెళ్లినప్పుడు ఐదు నిమిషాల్లో భోజనం కానిచ్చారు. 'ఇంత తొందరనా?' అంటే 'జీర్ణం కావాలె కదా!' అన్నారాయన. చిత్రకళలోనూ ఆయనది ఇదే దృష్టి.

ఆయనకు బాగా జీర్ణమైన జీవితాన్నే చిత్రిస్తారు. ఏదీ కృతకంగా వుండదు. గ్రామీణుడికి అన్ని కులాలతో సంపర్కం వున్నట్టే రాజయ్యకు అన్ని కులాల జీవనశైలితో గాఢమైన పరిచయం, అనుబంధం వుంది. అందుకే ఆయన చిత్రాల్లో సమిష్టి జీవనశైలి, పనిపాటలు, పండగలు, పబ్బాలు తరచుగా కనిపిస్తాయి. తాను పుట్టి పెరిగిన గడ్డమీది మమకారం అతని ప్రతి చిత్రంలో కనిపిస్తుంది. దానికి తోడు సంప్రదాయం అతని చేతిలో గొప్పశక్తి పుంజుకోవడంతో పాశ్చాత్య కళారీతులు వాటిముందు దిగదుడుపే అనిపిస్తుంది.

ఇదే రాజయ్యలోని గొప్పతనం.

తన చిత్రకళను వ్యక్తిగతం అనుకోరాయన. చిత్రాలకు ఎంచుకునే జీవితం, శైలి, కాల్పనిక దృష్టి, సాంకేతిక ప్రక్రియ అంతా కూడా సమిష్టిగా తమవే అనుకుంటారు. 'అవును మరి. నా కళా ప్రస్థానం మా వాడకట్టు నుంచి మొదలైందే కదా!' అన్నారాయన.

"సిద్దిపేట మా స్వంత గ్రామం. మా వీధి పారుపల్లి. ఇది కళాకారుల వీధి. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, పద్మశాలి, మార్వాడి, నకాషి, బ్రాహ్మణ, ముదిరాజు, యాదవులు, గౌండ్లు, దూదేకులు, రజకులు- అందరి కూటమి" చెప్పారాయన.

"మా గ్రామంలో జానపద సంప్రదాయాలు సుసంపన్నంగా వుండేవి. మా దగ్గర నకాషి చిత్రకారులు, రంగోళి కళాకారులు, రథ చిత్ర లేఖకులు, బొమ్మల పనివాండ్రు, పట చిత్రకారులు వుండేవారు. అందుకే ఇంకెవరినీ కళకోసం యాచించే అవసరం నాకు రాలేదు"

"దేవాలయాలపై మెరుగులు దిద్దడం. గ్రామ పొలిమేరల్లో దేవతలను చిత్రించడం, పల్లకీలను, గంపలను, కుండలను, మూకుళ్లను బొమ్మలతో అలంకరించడం, రథాలమీద వివిధ ఆకృతులను చిత్రించడం, వినాయక చవితి పండుగకు గణపతులను నిర్మించడం- ఒకటి కాదు, ఎన్నో విధాల చిత్రజీవితం నన్ను అంటిపెట్టుకునే వుండేది. వీటన్నిటినీ పరిశీలించేవాడిని. సున్నం, ఎర్రమట్టి, నీలిమందు వంటి సహజ వర్ణాలతో వారు పని చేసేవారు.

చిన్ననాడు మార్వాడి వాళ్ల ఇండ్లపైన వేసిన నకాషి చిత్రాలు చూసి గీసేవాడిని. యింటి పెరట్లలో మట్టి ఇటుకలతో గుళ్లు, గోపురాలు కట్టేవాడిని. తోటి పిల్లలతో కలిసి భాగవతం ఆడేవాడిని. నాటకాలు, తోలు బొమ్మలాటలు, హరికథలు, పటముల ద్వారా చెప్పే పాండవుల కథ, ఒగ్గుకథలు, వీధి భాగవతాలను బాగా చూసేవాడిని. నాటక పరదాల చిత్రాలపై వుండే వాస్తవిక కళ నన్ను ఎంతగానో ఆకర్షించింది. నాటకశాలలో పెయింటింగ్ చేసేటప్పుడు ఎలా వేస్తున్నారో చూసేవాడిని. మొహర్రం పీరీలకు, ఉత్సవ రథములకు అలంకరణ చేసేవాడిని. ఇలా నా కళా వ్యాసంగం మొదలైంది. నకాషివాళ్ల పెద్దపులులు, ఏనుగులు, నెమళ్లతో మొదలై అప్నా స్టయిల్ బనాయా" అన్నారాయన.


తన పరిసరాలనుంచి ప్రేరణ పొందినా, రాజయ్యను డ్రాయింగ్ పరీక్షలో కూర్చుండబెట్టి,





స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్సులో చేర్చినవారు కుబేరుడు, నింబగిరిలు. వారిద్దరూ రాజయ్యకు చిత్రకళలో గురువులు. వారిని ఆయన సదా గుర్తుచేసుకుంటారు. హైదరాబాద్‌లో డిప్లొమా చేశాక డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరిన రాజయ్య సంగారెడ్డిలో నాలుగేళ్లు పనిచేశాక 33 ఏళ్లు సిద్దిపేటలోనే ఉన్నారు. కళాభవన్ కార్యక్షేత్రంగా ఆయన కృషి చేస్తూనే ఉన్నారు.

రాజయ్య కళా ప్రతిభను, కళావికాసాన్ని తొలుత గుర్తించింది సుప్రసిద్ధ కళా విమర్శకుడు, ఇలస్ట్రేటెడ్ మాజీ సంపాదకులు అయిన ఎ.ఎస్.రామన్ గారు. ఆయన యాభయ్యవ దశకంలోనే



వేములవాడ



బోనాలు, వేములవాడ,1994

కాపు రాజయ్య శైలి జానపదమే అయినా అది నీరసంగా, కృతకంగా వుండదు. నిత్యనూతనంగా వుంటుంది. ఇక ఆయన చిత్రాలు గ్రామ జీవనానికి, గ్రామీణుల విశ్వాసాలకు నిదర్శనాలు. ఆయన టైటిల్స్ చూస్తే చిత్రాలు చూసినట్టే అనిపిస్తుంది. ఇక రేఖా చిత్రాల సంగతి చెప్పనక్కరలేదు. బతుకమ్మ, బోనాలు, వీధి భాగవతం, కోలాటం, వల్లుబండ, గృహిణి, రామదూత, ఎల్లమ్మజోగి, మాయలేడి, గీత పరిశ్రమ, కొమురవెల్లి, నాగపంచమి, గోపీకృష్ణ, ఉడుతభక్తి, పనితనం, రామ పరాజయం, కార్తికేయ, నందనిపూజ, వటపత్రసాయి, అన్నదాత, దోభీఘాట్, వడ్డెరలు, కలశం, నాగకన్య, మృగశిర, కామధేనువు, పరమాత్మవైపునకు జీవాత్మ, తిరుపతి నుంచి తిరుగు, విశ్వశక్తి, శివలింగం, పాలోయమ్మపాలు, కడగండ్ల బతుకులు. ది డివైన్ ఇంప్రింట్స్, గాడ్ ఆఫ్ సెవెన్ హిల్స్, క్రెడిల్‌సెర్మని, ఆన్‌దివే, ఎట్ టెంపుల్ డోర్, షెపర్డ్, మదర్ హోప్, కాక్‌టైల్, మిల్క్‌మేడ్, స్మైలింగ్, పాట్ మేకర్స్, కోయకపుల్, సాక్రిఫైస్ హార్స్-ఇంకా చాలా.





రాజయ్య చిత్రాలను అచ్చువేశారు. లండన్ నుంచి వచ్చే 'స్టూడియో' పత్రికలో భారతదేశంలోని యువ చిత్రకారులు గురించి రాస్తూ రాజయ్య పనితనాన్ని ప్రశంసించారు. 'పురాణ గాథలూ, నమ్మకాలూ, జానపద సంస్కృతితో సారవంతమైన జీవితం ఆయనది. అసలు వాటితో రూపొందిన మనిషే రాజయ్య. అతని చిత్రాలలో నన్ను ఎక్కువగా ఆకర్షించిన అంశం అచ్చమైన అతని జానపద ఆత్మ' అన్నారు.


"రాజయ్య కళలో గతకాలపు గతత్వం, వర్తమానపు యధార్థత రూపుగొంటుంది. అతడు గొప్ప కళాకారుడని నేను అనను. కానీ అతడు మంచి కళాకారుడు" అని కూడా వేరొక సందర్భంలో పేర్కొన్నారు.

రామన్ చెప్పినట్లు రాజయ్య మంచి కళాకారుడు. అందుకే కళను కాసులకు అమ్ముకోవడంలో ఆయనకు ఆసక్తి లేదు. తన జీవితంలో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన చిత్రం రిస్కీలైఫ్. వెల 70 వేలు అని చెప్పారాయన. డబ్బులకోసం తానెన్నడూ చిత్రించలేదని, తన దృష్టంతా కాల పరీక్షకు తట్టుకుని నిలబడే చిత్రం గురించేనని ఆయన చెప్పారు.

"కళాకారుడికైనా, ఎవడికైనా క్యారెక్టర్ ఒకటే ముఖ్యం. అదే సత్యం" అన్నారాయన.

స్థానిక నకాషి కళాకారుల పనితనం నుంచి ఎదిగిన రాజయ్య తమకు తామే ఆధునికులమని వ్యవహరించే వారిని చూసి తప్పుకుంటారు. అలాగే సృజనశక్తి సొంతదనుకునే కళాకారులను చూసినా ఆయన స్పందన అంతే.

కోణార్క్ దేవాలయం,1986





మార్కెట్ వద్ద, సిద్దిపేట,1985

"కళాభవన్ నిర్మించాలని అనుకున్నాం. లలిత కళా అకాడమి ద్వారా తెలంగాణ, కోస్తా, రాయలసీమల్లో ఒక్కొక్కటి చొప్పున నిర్మించాలని అనుకున్నాం. సిద్దిపేటలో నేను మొదట నిర్మించి ఎంతో మందికి శిక్షణ ఇచ్చాను. యాసాల బాలయ్య, బాలరత్నం, గౌరీ శంకర్, కడార్ల శేషయ్య వంటి చాలామంది డ్రాయింగ్ టీచర్లుగా, ఆర్టిస్టులుగా స్థిరపడ్డారు. ఆకాడమీలు మూతపడ్డా నా వంతు సేవ నేను చేశాననే ఆనందం మిగిలింది."





'పేరెందుకుగని, ఫలానా కళాకారుడు- నేను క్రియేటర్‌ని అన్నాడు. వాడికి ఎవడు చెప్తాడు!' అని బోసినవ్వు నవ్వారు రాజయ్య. అదీ ఆయన విమర్శనా పద్ధతి.

ఇంతకీ మీ కళా ఆదర్శం ఏమిటని ప్రశ్నించినప్పుడు సంస్కృతిని కాపాడటమే అని చెప్పారు. "ముందు తరాలకు మన సంస్కృతి తెలియాలంటే శిల్పకళ, చిత్రకళపైనే ఆధారపడాలి. నా వంతుగా చిత్రకళలో సాధన చేస్తున్నాను" అని వినయంగా చెప్పారు.

రాజయ్య తొలి చిత్రాలు సాంప్రదాయకమైనవి. మొదట వాష్ పద్ధతిలో చిత్రించేవారు. తర్వాత నకాషి చిత్రకారుల టెక్నిక్‌కు ముగ్దుడై టెంపరా (పౌడర్) రంగుల వాడకం మొదలెట్టారు. టెంపరా రంగుల నుంచి కాలానికి తట్టుకునేందుకుగానూ పాశ్చాత్యుల మాధ్యమమైన తైలవర్ణాలకు మారారు.

1960ల నుంచి జాతీయ స్థాయిలో అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌కు ఆదరణ పెరగడంతో రాజయ్య కూడా ఈ ప్రభావానికి గురయ్యారు. అయితే ఆయన ఈ పోకడల్లో కొట్టుకుపోలేదు. తన కళా విశిష్టత బాగా ఎరిగిన రాజయ్య ఒంటరిగా, అచంచలంగా నిలబడ్డారు.

'అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌ను ఎందుకు వేయకూడదు' అని మాత్రం రాజయ్య తనలో తానే ప్రశ్నించుకునేవారట. ఆ ప్రశ్నకు వెంటనే తనలో నుంచి ఈ సమాధానం వచ్చేదట.

"....ఎందుకు ప్రయత్నించాలి? కళ అనేది ఏనాడూ అబ్‌స్ట్రాక్ట్‌గా, అంటే రూపాతీతంగా వుండదు. ఒక చిత్రకారుడు ఒక రేఖ గీసినా, ఒక రంగు చుక్కను కాన్వాసుపై వేసినా వెంటనే దానికి ఒక రూపం ఏర్పడుతుంది. అలాంటప్పుడు అబ్‌స్ట్రాక్ట్ అనేది అర్థరహితం" అనిపించేదట.

ఇప్పటికీ ఆయన ఆలోచనల్లో మార్పు రాలేదు. ఆ సంగతి ప్రస్తావిస్తూ 'సంగీతంవలె చిత్రలేఖనాన్ని నైరూప్యం చేయడం కష్టం" అన్నారు.

"అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ అనేది వున్నదని, వుంటుందని అనుకోవడం వట్టి భ్రమ. అది కుందేటి కొమ్ము" అన్నారు.

అరవయ్యవ దశకం చివర్లో ఒక ఉదాత్తపు భావనతో అబ్‌స్ట్రాక్ట్‌ను పోలిన చిత్రాలు వేయడం ప్రారంభించారు రాజయ్య. తన ఇష్టదైవం నిరాకారతతో రాజయ్య సామరస్యాన్ని సాధించుకున్నారు.

రాజయ్యగారి అమ్మాయి విజయలక్ష్మి ఒకరోజు 'నాయినా! నాకు కలలో వెంకటేశ్వరస్వామి కనిపించాడు. ఆయన మీద పెయింటింగ్ చేయవే!' అనికోరిందట. వెంటనే ఏడుకొండలవాడిని వస్తువుగా గ్రహించి గాడ్ ఆఫ్ సెవెన్ హిల్స్ పేరిట తిరుపతిలో చిత్రాలను ప్రదర్శించారు రాజయ్య. ఈ చిత్రాల్లో స్వామిని తాళమాన నిష్పత్తులతో ప్రతీకాత్మకంగా చిత్రించారు. ఇటువంటి కళను చిత్రకళా పరిభాషలో తాంత్రిక్ పెయింటింగ్స్ అంటారు.



కుతూహలం, సిద్ధిపేట,1956





ఒగ్గు కథకుడు,
కొమరవెల్లి,1992

తీసుకున్న ఏ వస్తువునైనా కొంత వాస్తవిక దృష్టితోనూ, కొంత ప్రతీకాత్మకమైన దృష్టితోనూ చిత్రించే రాజయ్య ఇలాంటి చిత్రాలు చాలా చేశారు. రామన్ వీటిని భారతీయ చిత్రకళకు చక్కని లక్ష్యాలు, ఆధునిక చిత్రకళకు అవి విశిష్ట లక్ష్యాలు అని పేర్కొన్నారు.

"తాంత్రిక కళలో నేను ఎక్కువేమీ లేను. మళ్లీ జానపద శైలికే వచ్చాను. ఇందులోనే నాకు సంతృప్తి లభించింది" అని ఆయన చెప్పారు.


"ఇటీవల అంటే 85 నుంచి కొంచెం రియలిస్టిక్ పెయింటింగ్ చేస్తున్నాను. కార్గిల్ తర్వాత కొత్త పెయింటింగ్స్ చేశాను. అలాగే ఈ నడుమ పెయింటింగ్, నీరు మీరు, మదర్ చైల్డ్, మ్యూజిక్‌ఫ్లూట్, అరకులోయ వంటి వర్క్స్ చేశాను" అని వివరించారాయన.

ప్రస్తుతం మీ ఆశయం ఏమిటని అడిగితే "ఒక మాస్టర్ పీస్‌ను చేయాలని ప్రయత్నిస్తున్నాను. అందుకే నేను ఇప్పటివరకూ గీసిన చిత్రాలను తదేకంగా చూస్తూ వున్నాను. అందులోని

లోటుపాట్లేమిటో పరిశీలిస్తున్నాను. పేరుకు తగ్గట్టు చేయాలిగద!" అన్నారు.

21 మార్చి, 2004

కాపు రాజయ్య,
కళా భవన్, సిద్దిపేట. ఫోన్: 08457 226484






# అమ్మవంటి అతడు

ఒక నిండు మనిషి పరిచయం.





15.

## మేఘరాజ్ అగర్వాల్

అతడి పేరు అగర్వాల్, మేఘరాజ్ అగర్వాల్. ఆయన ఒక స్టీల్ దుకాణం యజమాని. ఆయన మాటల్లోనే చెబితే-ఇస్టీల్ షాప్ ఓనర్. స్వస్థలం జైపూర్‌లోని కట్‌పుత్లి. నివాసం హైదరాబాద్‌లోని వివేకానంద నగర్ కాలని. ఏడాదికి ఇరవై కోట్ల టర్నోవర్ గల బిజినెస్‌తో అగర్వాల్ బిజిబిజీగా ఉంటాడు. అయితే అదంతా ఉదయం ఏనిమిది గంటలు దాటాక. ఆ లోపు ఆయన అరవై పశువులకు రారాజు.

ఆరు గంటలలోపు మీరు కూకట్ పల్లి హౌజింగ్ బోర్డు కాలనీ దాటి కొంచెం ముందుకు వెళ్తే వివేకానంద నగర్ కాలనీ ఉంటుంది. ఆ కాలనీ రోడ్డు గుండా వెళుతుంటే కొంచెం ఖాళీ ప్రదేశం కనిపిస్తుంది. అక్కడ ఎపి 28 ఎం 7817 నంబరు తెల్ల మారుతి ఒకటి నిలిపి వుంటుంది. దాని కారు డిక్కీ తీసి వుంటుంది. కారుపై రెండు మూడు ప్లాస్టిక్ డబ్బాలు కనిపిస్తాయి. ఇదేమిటా అని అటూ ఇటూ చూస్తే నల్లటి ప్యాంటుపై తెల్లటి టీ షర్ట్ తొడుక్కుని ఉన్న అగర్వాల్ కనిపిస్తాడు.

మీరలా చూస్తుండగానే ఆయన చకచకా వచ్చి మారుతీకారు డిక్కీలోంచి మరిన్ని ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో వున్న ప్లాస్టిక్ డబ్బాలు బయటకు తీస్తాడు. తౌడుతో (మేత) వున్న ఆ డబ్బాలను తీసుకొని ఆవులు, ఎద్దులు, లేగదూడల వద్దకు పరుగు పరుగున వెళుతుంటాడు. ఆయనతో ఏదైనా మాట్లాడాలనుకుంటే కుదరదు. ముందు వాటికి మేత పెట్టిన తర్వాతే ఏదైనా.

+++

హాయిగా మేస్తున్న గోవులను, ఎద్దులను మురిపెంగా చూస్తూ'... ఇవన్నీ స్ట్రీట్ ఎస్టేట్' అన్నాడాయన సరదాగా.

'స్ట్రీట్ ఎస్టేట్ అంటే అర్థం కాలేదా? వీధి పశువులండీ. వీధి పశువులు' అన్నాడు వివరణగా, అవి తన స్వంత ఆస్తి కాదన్న ధ్వని ఆయన గొంతులో విన్పించింది.

'పాలిచ్చినన్ని రోజులు ఇచ్చాయి. ఆ తర్వాత వీటి యజమాని తరిమేశాడు. దాంతో రోడ్డుమీదే జాగా వెతుక్కున్నాయి' ఒకింత బాధగా చెప్పాడు అగర్వాల్.

అయితే అగర్వాల్ అండ దొరికిన నాటి నుంచీ వీటి తిండికి ఢోకాలేదు. ఉదయమే ఒకటి కాదు రెండు కాదు, అరవై పశువులు ఆవురావురుమంటూ ఆయన రాకకోసం ఎదురు చూస్తుంటాయి.

తనకోసం ఆ మూగజీవులు వేచి ఉంటాయనే ఎరుకతో అగర్వాల్‌కు పొద్దున్నే మెలకువవవుతుందట. ఇంకేం వెళ్లిపోతాడు. ఆ మాటే చెప్పి, 'నేను పశువులకు మేతపెట్టి

ఇంటికి వెళ్లేసరికి మా పిల్లలు ఇంకా నిద్రలేవరు' నవ్వి చెప్పాడాయన.

సరిగ్గా ఉదయం ఐదు, ఐదున్నరకు మేలుకొని వెంటనే కాలకృత్యాలు తీర్చుకుంటాడు అగర్వాల్. ఒక బ్యాగ్ తౌడును, పాతిక ప్లాస్టిక్ డబ్బాలను మారుతీ కారు డిక్కీలో వేసుకుని కాలనీలోని ఒక ప్లేగ్రౌండ్‌కు బయలుదేరుతాడు. టంచన్‌గా ఆయన కారు ఆరు గంటలకల్లా అక్కడికి చేరుకోవాల్సిందే. డోర్ తీసుకొని అగర్వాల్ బయట కాలుపెట్టగానే ఒకటి తర్వాత ఒకటి, కనీసం ముప్పై ఆవులు, ఎద్దులు నిదానంగా నడుచుకుంటూ  వస్తాయి. ఆ దృశ్యాన్ని చూడటం గొప్ప అనుభవం.

అవి యథాలాపంగా నడిచినట్లు కనిపించినా వాటి నడకలో ఒకలాంటి ఆనందం, భరోసా కనిపిస్తుంటే చూడముచ్చటగా ఉంటుంది.

కారు దిగి, మేత వుంచిన ప్లాస్టిక్ డబ్బాలను వాటిముందు పెడతాడు. అవి మేత మేసేంతవరకూ అగర్వాల్ వాటి మేనును ఆప్యాయంగా నిమురుతూ గడుపుతాడు. అలా ఒక అరగంట గడుస్తుంది. ఆ తర్వాత డిక్కీలో ఉన్న మరికొన్ని డబ్బాలతో పక్కనే ఉన్న వెంకటరమణ కాలనీకి వెళతాడు. అక్కడా ఇదే పని. కాకపోతే ఇక్కడ పదిహేను, ఇరవై పశువులే ఉంటాయి. అక్కడ్నుంచి అదే కాలనీలోని మరొక ప్లేస్‌కు వెళతాడు. అప్పటికే అక్కడికి పదిహేను పశువులు చేరుకుని ఉంటాయి. వాటికీ మేత పెడతాడు.

ఇలా రెండు గంటల్లో అగర్వాల్ మూడు ప్రాంతాలకు వెళ్లి కనీసం ఒక అరవై పశువులకు దాణా పెట్టి ఇంటికి చేరుకుంటాడు. ఆ వేళకు ఆయన భార్య గంగాభాయి టిఫిన్ సిద్ధం చేస్తుంది. చకచకా తయారై టిఫిన్ చేసి దుకాణానికి వెళ్లిపోతాడు.

ఇది అగర్వాల్ ఉదయం కార్యక్రమం. ముందే చెప్పినట్లు ఎనిమిదికల్లా ముగిసే వ్యాపకమిది. ఆ తర్వాత ఆయన 'ఇస్టీల్' బిజినెస్ మొదలవుతుంది.

+++







కనీసం ఆరేళ్లుగా అగర్వాల్ ఉదారంగా పశువులకు మేత పెడుతున్నాడు. ఈ పనిలో రాంజీ, పాండేజి, శర్మ, దినేష్‌సింగ్ వంటి ఇరుగుపొరుగు వారు అగర్వాల్‌కు సహకరిస్తారు. ఏదైనా పనిమీద అగర్వాల్ ఊరు వెళ్లాల్సివస్తే ఇదంతా రాంజీ చూసుకుంటాడు. రాంజీ కూడా ఒక చిరు వ్యాపారి. అగర్వాల్ వెంట ఆయనా తెల్ల చొక్కా, ప్యాంటులో ఉత్సాహంగా కనిపించాడు.

"అగర్వాల్ చేస్తున్న సేవ నన్ను కూడా స్పందింపజేసింది. నిస్వార్థంగా పని చేస్తున్నాడు. ఆయనకు సహకరించడం బాధ్యతగా ఫీలవుతున్నాను. అందులో నాకూ ఆనందం వుంది" అన్నాడు రాంజి.

"ప్రతి రోజూ పశువులు టంచన్‌గా వస్తాయి. ఎన్ని పశువులు వస్తాయో అగర్వాల్‌కు లెక్క వుంటుంది. వీటన్నిటికి మేత పెట్టాలంటే ఖర్చుతో కూడుకున్న పనే. ప్రతిరోజూ కనీసం ఒక బ్యాగ్ దాణా కావాలి" వివరించాడాయన.

ఒక్కో బ్యాగు మూడొందల యాభై రూపాయల ఖరీదు చేస్తుంది. ఆగర్వాల్ ఈ స్టాక్‌ను వారానికి ఒకసారి టోకున ఖరీదు చేసి తెస్తాడట. ఖర్చులకు సంబంధించిన వివరాలు అడిగితే అగర్వాల్ ఇబ్బందిగా చూశాడు. ఖర్చుదేముంది అన్నట్టు చూస్తున్నాడాయన.

క్రమం తప్పకుండా అగర్వాల్ ఉదారంగా చేస్తున్న సేవను గమనించే వారిలో కోటిరెడ్డి ఒకరు. అగర్వాల్ మేతపెడుతుంటే, పక్కనున్న మంగలిషాపులో గడ్డం చేయించుకుంటున్న కోటిరెడ్డి ఒక టెలివిజన్ ఛానల్లో పశువుల పెంపకంపై ప్రసారమవుతున్న ఒక కార్యక్రమం చూస్తున్నాడు.

"అగర్వాల్‌ను నేను ఐదేళ్లుగా చూస్తున్నాను. క్రమం తప్పకుండా ఆయన మేత పెడుతుంటాడు. ఎందుకు చేస్తున్నాడనే సందేహమే మాకు రాలేదు" అన్నాడాయన.

"బహుశా గో సంరక్షణ చేస్తున్నాడనే సంతృప్తి వల్ల కావచ్చు లేదా జీవకారుణ్యం మంచిదనే



భావన కావచ్చు. హిందూ మతంలో గోవుకు ఎంతో ప్రాధాన్యం వుంది. గోమాత తల్లిలాంటిది. వాటికి సేవ చేయడమంటే తల్లికి సేవ చేసినట్లే. అగర్వాల్ ఈ పని చేయడం వెనక ఇలాంటి కారణాలేవైనా కావచ్చు" అన్నాడాయన, సాలోచనగా.

ఆ సందేహాన్ని అగర్వాల్ వ్యక్తం చేసినప్పుడు కొంచెం ఇబ్బంది పడి "ఎందుకు చేస్తున్నానంటే ఏం చెప్పను?" అన్నాడు.

+++

ఇంత చిన్న విషయం గురించి ఏం చెప్పను అన్నట్టు ముందు మొహమాటంగా చూశాడాయన. "అనాథ జీవులకు అన్నం పెడుతున్నాను. ఎందుకంటే ఏం చెబుతాను" అన్నాడు.

"మా తండ్రి చేసిన పనినే నేను కొనసాగిస్తున్నాను. ఆయన పోయారు. ఆయన తర్వాత ఆ బాధ్యతను ఆనందంగా స్వీకరించాను" అని చెప్పాడు. తాను చేస్తున్నది సేవ అని కూడా అగర్వాల్ అంగీకరించలేదు. "నాకు చేతనైనంత చేస్తున్నాను. ఇందులో నాకు సంతృప్తి, ఆనందం దొరుకుతుంది. అంతేకాదు, వీటికి మేత పెట్టడం, ఆలనా, పాలనా చూసుకోవడం వల్ల నాకు హెల్త్, వెల్త్ కూడా బాగుంటోంది" అన్నాడు.

'వీటికి టైమ్ సెన్స్ ఉంటుంది. నేను మేత తీసుకెళ్లగానే అవి పంక్చువల్‌గా వస్తాయి. ఆనందాన్ని వ్యక్తం చేస్తాయి. వాటిని చూస్తే భగవంతుడిని చూసినట్లే అనిపిస్తుంది' అని కూడా అన్నాడు అగర్వాల్.

పశువులకు మేత పెట్టి వదిలేయడమే కాదు. వాటికోసం అగర్వాల్ ఎంతటి రిస్క్ అయినా తీసుకుంటారట. బక్రీద్ సమయంలో ఆవులను తీసుకెళ్లేప్పుడు అగర్వాల్ వారితో గొడవపడి ఇక్కడనుంచి తీసుకెళ్లకుండా పట్టుబట్టిన సందర్భాలు కూడా ఉన్నాయని ఇరుగుపొరుగు వారు చెప్పారు.

అగర్వాల్ ఈ మూగజీవుల పట్ల కరుణ చూపడానికి మరొక కారణం కూడా ఉంది. ఆ సంగతి ఆయనే చెప్పాడు. అగర్వాల్ కొడుక్కి కొన్నేళ్లక్రితం ఒంట్లోని సగభాగం చచ్చుబడి పోయింది. ఇల్లు తాకట్టుపెట్టి వైద్యం చేయించారు. అయినా ఆశ కనిపించలేదు. న్యూరోసర్జన్ కూడా చేతులెత్తేయడంతో కనపడని దైవం కన్నా కనిపించే పశువులకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆశ్చర్యం, అబ్బాయి కోలుకున్నాడు. ఇప్పుడు ఎంచక్కా క్రికెట్ కూడా ఆడుతున్నాడు. ఆ నాటి నుంచి అగర్వాల్ మరింత భక్తిశ్రద్ధలతో పశువులను కన్నబిడ్డల్లా చూసుకుంటున్నాడు.

'...చెప్పానుగా, పశువులకు సేవ చేస్తే హెల్త్, వెల్త్ బాగయిందని' అన్నాడాయన.

'అబ్బాయి బాగవడమే కాదు, పశువులను రబ్ చేస్తే బి.పి. కూడా నార్మల్ అవుతుంది' అని నవ్వి చెప్పాడాయన. జ్యుయలరీషాపులో గుమాస్తానుంచి కోట్ల బిజినెస్ టర్నోవర్ చేసే





స్థాయికి రావడానికి ఇదే కారణమనే నమ్మకం కూడా ఆయనలో బలంగా కనిపించింది. ప్రస్తుతం ఆయనకు కూకట్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్‌లలో మూడు నగల దుకాణాలున్నాయి.

అగర్వాల్ సేవాభావాన్ని ఆయన భార్య గంగాభాయి కూడా ప్రోత్సహిస్తోంది. ఇదంతా బర్డెన్ కాదా అని అడిగితే, 'పుణ్యం చేస్తుంటే ఎందుకు వద్దనాలి?' అందావిడ చాయ్ అందిస్తూ.

+++

అన్నట్టు, అగర్వాల్‌కు వైద్యం కూడా తెలుసు. ఆవుపేడతో కొన్ని రకాల వనమూలికలను కలిపి ఆయన ఒక రకమైన మందును, మరొక తైలాన్ని తయారు చేశారు. మోకాళ్ల నొప్పులను తగ్గించేందుకు ఇవి దివ్యంగా పనిచేస్తాయట. తెగిన గాయాలు మానేందుకు కూడా ఆయన వద్ద మందు ఉంది. 'పశువుల సావాసం వల్ల అబ్బిన విద్య ఇది' అన్నారు గర్వంగా. బిజినెస్ నుంచి రిటైరయ్యాక ఉచితంగా వైద్య సేవ చేయాలనేది ఆయన ఆశయం.

ఆయన ఇంట్లోంచి రోడ్డుమీదికి వచ్చాక ఏ పశువును చూసినా అది అనాథగా గోచరించలేదు. అంతకు ముందు మేతపెడుతూ వాటి మేనును ఆప్యాయంగా నిమిరిన అగర్వాల్ గుర్తొచ్చి అ అంటే అమ్మ కాదు, అగర్వాల్ అనిపించింది, ఆ క్షణాన.

18 ఏప్రిల్ 2004

మేఘరాజ్ అగర్వాల్,
ప్లాటు నం.28, న్యూ ఎరా హై స్కూలు వద్ద,
వివేకానందనగర్ కాలనీ, కూకట్ పల్లి, హైదరాబాద్-72.
ఫోన్స్: 040-23079091, 23079863



అహింసా సిల్క్

'నేను పట్టుపురుగును చంపను, ప్రకృతికి వదిలిపెడతాను. దాని జీవితం నాలుగైదు రోజులే కావచ్చు. కానీ దాన్ని చంపే హక్కు మనకెక్కడిది' అంటున్నారు కుసుమ రాజయ్య. ఊరికే అనడం లేదు. పట్టుపురుగును చంపకుండానే పట్టు వస్త్రాన్ని నేసి చూపించి మరీ చెబుతున్నారు.





16.

## కుసుమ రాజయ్య

సుమారు ఐదువందల ఏళ్ళక్రితం...చైనా సామ్రాజ్ఞి జీ లింగ్ ఒక మల్బరీ చెట్టుక్రింద కూర్చొని టీ తాగుతోంది. అకస్మాత్తుగా ఆవిడ తాగుతున్న కప్పులో పట్టు గూడొకటి రాలిపడింది. అది చూసుకోకుండానే ఆవిడ టీ తాగడం పూర్తి చేసింది. అప్పటికే టీ వేడికి పట్టు గూడు కరిగిపోయి, పట్టు దారాలు మిలమిలా మెరవసాగాయి.

సిల్క్‌ను ఎవరు కనిపెట్టారంటే ఈ కథను చెబుతుంటారు.

జీ లింగ్ అనే మహారాణి సిల్క్‌ను డిస్కవర్ చేసిన విధం ఇది.

ఇప్పుడు కాలం మారింది. పట్టు వస్త్రాలు పవిత్రతకు సింబల్‌గా మారాయి. స్టేటస్ సింబల్‌గానూ మారాయి. కానీ వీటి పవిత్రతా, విలువా నిజమైనదేనా?

పట్టుగూళ్లను ఇంగ్లీషులో కకూన్ అంటారు. కకూన్‌నుంచి పట్టుపురుగు బయటకు రాకముందే అంటే ప్యూపాదశలోనే ఆ పట్టుపురుగును చంపేయాలి. చంపేస్తున్నారు కూడా. ఆ పురుగును గూడులోనే సమాధి చేస్తున్నారు. లేనట్టయితే నూటికి పావువంతు దారం కూడా చేతికి చిక్కదు. చంపేస్తే ఎంచక్కా నూటికి తొంభైశాతం పట్టు చేతికి చిక్కుతుంది. అలా తొంభైశాతం సిల్క్‌ను రాబట్టుకోవడం వల్లే ఈ పట్టు వస్త్రాల పవిత్రత ప్రశ్నార్థకమౌతోంది.

అవును, ప్రశ్నార్థకమౌతోంది.

కొంచెం ఓపిగ్గా చదవండి.

పట్టుగూళ్లను మరిగేనీళ్లలో వేస్తారు. పెద్దపెద్ద పట్టు పరిశ్రమల్లోనైతే అధునాతన ఛాంబర్లుంటాయి. సుమారు డెబ్బయ్ నుంచి తొంభై డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద, కనీసం మూడునాలుగు గంటలపాటు ఆ పట్టుగూళ్లను ఉంచుతారు. దాంతో ఆ గూళ్లలోని ప్యూపా మాడిమసైపోతుంది. ఆ తర్వాతే పట్టును తీస్తారు.

పట్టును రాబట్టుకోవడానికి ఇలాంటి హింస జరుగుతుందనే సంగతి ఎందరికి తెలుసు?

దేవాలయాల్లో దేవుడికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్నాం. ఒక రకంగా మూగజీవులను చంపి హారం వేస్తున్నాం. కానీ ఈ సంగతి ఎంతమంది గ్రహించారు? పోనీ ఈ సంగతి తెలిస్తే మానేస్తారా?

మానేసే అవసరం లేదంటున్నారు కుసుమ రాజయ్య.

పట్టు పురుగులను చంపనక్కర్లేదు. వాటిని హాయిగా ప్రకృతికి వదిలేసి కూడా పట్టు వస్త్రాలను నేయవచ్చు. అయితే కొంచెం రిస్క్.

ఆ రిస్క్‌కు సిద్ధపడి పరిశోధన చేశారు కుసుమ రాజయ్య.

తాను స్వయంగా పట్టుగూళ్లను సేకరించి, ఒక గంపలో ఉంచి, అవి సహజ సిద్ధంగా గూళ్లను ఛేదించుకుని బయటకు వచ్చేవరకూ వేచి చూశారాయన. ఆ పట్టుపురుగులు స్వతంత్రంగా ఎగిరిపోయాక మిగిలిన పట్టును ప్రాసెస్ చేయించారు. తర్వాత దాన్ని వడికించారు. వాటితో కావలసిన పట్టు వస్త్రాలు నేయిస్తున్నారు. ఇలా తయారైన వస్త్రాలకు ఆయన 'అహింసా సిల్క్' అని నామకరణం చేశారు.

అహింసా సిల్క్:

కులానికి పద్మశాలి అయిన కుసుమ రాజయ్య సంప్రదాయ బద్ధంగా నేతపని నేర్చుకున్నవారు కాదు. వాళ్లది వ్యవసాయ కుటుంబం. కానీ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లొమా చేసి ఇరవై మూడేళ్ల క్రితం 'ఆప్కో'లో చేరారు. ఇప్పుడు ఆయన సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్.

ఈ ఇరవై మూడేళ్ల ఉద్యోగ జీవితంలో ఆయన అనేక ప్రయోగాలు చేశారు. ఎనభై రెండులో తాను తయారు చేసిన 'డూపియాన్ టై అండ్ డై' అనే వస్త్రం ఆమెరికాలోని వైట్‌హౌజ్ పరదాలుగా రెపరెపలాడుతోంది. తాజాగా అంటే 1992లో పుట్టిన ఆలోచన రెండువేలలో నెరవేరింది. 'ఇంకా చాలా ప్రయోగాలు చేశాను.

ఏదో ఒకటి ఎక్స్‌ప్లోర్ చేయడం నా హాబి' అన్నారాయన నవ్వుతూ.

అహింసా సిల్క్ అని తాను నామకరణం చేశాడుగానీ దాన్ని గాంధీ సిల్క్ అని, పీస్ సిల్క్ అని, వెజిటేరియన్ సిల్క్ అని ఎవరికి తోచినట్టు వారు పిలుస్తున్నారు. 'పేర్లేమైనా కానీయండి. హింసకు తావులేకుండా సిల్క్ తయారు చేయవచ్చనే సంగతి నా వల్ల రుజువైంది కదా! ఇక ముందు తాము ధరించే పట్టు హింసతో రూపొందిందనే మెసేజ్ అందుతుంది. దానికి ప్రత్యామ్నాయం ఉందని గ్రహిస్తారు. అది నాకు ఆనందం కలిగిస్తుంది' అని ఆయన అన్నారు.







కాస్త ఖరీదైనదే:

నాలుగొందల గ్రాముల పట్టుచీర మార్కెట్లో రెండు వేలుంటుంది. అదే నా వద్ద అహింసా సిల్క్ మూడు, మూడున్నర వేలకు లభిస్తుంది. ఖరీదు ఎందుకంటే ఎక్కువ పట్టుగూళ్లను సేకరించాలి. వాటిలోంచి పట్టు పురుగులు సహజసిద్ధంగా ఎగిరిపోయాక ఆ పట్టును స్పిన్నింగ్‌మిల్లులో ప్రాసెస్ చేయించాలి. ఆ తర్వాత దాన్ని కావలసిన వస్త్రంగా నేయవలసి ఉంటుంది. ముందే చెప్పినట్టు, పురుగు వెళ్లిపోయాక ఆ గూడులో మిగిలేది పదిహేను శాతం పట్టు మాత్రమే. అందువల్ల అనేక పట్టుగూళ్లను సేకరించాల్సి వస్తుంది. ఆ పట్టును ప్రత్యేకంగా మిల్లుల్లో ప్రాసెస్ చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే కాస్తంత ఖరీదని చెప్పారాయన.

ఈ ఆలోచనకు నాంది:

1992లో రాష్ట్రపతి వెంట్రామన్ గారు సతీసమేతంగా హైదరాబాద్ వచ్చారు. అప్పుడు ఆప్కోలో ఏదైనా ఖరీదు చేస్తామని మెసేజ్ పంపించారు. అబిడ్స్ షోరూమ్ మేనేజర్ మా వద్దనుంచి కొన్ని వస్త్రాలు తీసికెళ్లి చూపించారు. మాటల్లో జానకీ రామన్‌గారు 'అహింసా సిల్క్' ఉందా అని అడిగారట. మేనేజర్ ఒక సందర్భంలో నాతో ఈ విషయం చెప్పినప్పుడు మొదట నేను ఆశ్చర్యపోయాను. 'అహింసా సిల్క్' అనే మాట నా బుర్రలో అలా ఉండి పోయింది. ఆ తర్వాత ఆలోచించగా ఆలోచించగా- పట్టుపురుగు జీవించి ఉండగా తీస్తే అది హింస కింద లెక్క అలా కాకుండా పురుగు బయటకు వెళ్లాక తీస్తే అది అహింసా సిల్క్ అనే స్ఫూహ కలిగింది. కానీ ఆ ఆలోచన అంతటితోనే ఆగిపోయింది.'

అమల కోర్కె మీదట:

'నాంపల్లిలోని ఎక్స్‌పోర్ట్ హౌజ్‌లో నేను పనిచేస్తున్నాను. ఒకసారి సినీనటి అమలగారు (బ్లూక్రాస్) కొన్ని బట్టలు కొనుక్కున్నారు. సినీ స్టార్ కదా అనే అభిమానంతో సిల్క్ పంజాబీ డ్రెస్ కానుకగా ఇవ్వాలనుకున్నాను. కానీ పట్టు వస్త్రాలు ధరించనని సున్నితంగా తిరస్కరించారు. దాంతో మళ్లీ అహింసా సిల్క్ అనే ఆలోచన మనసులో మెదిలింది. అమల రెగ్యులర్ కాంటాక్ట్‌లో ఉండేది. మరో సందర్భంలో, తాను ఆస్ట్రేలియాలో జరిగే ఒక ప్రదర్శనకు వెళుతూ 'అహింసా సిల్క్' దుస్తులు చేసివ్వమని రిక్వెస్టు చేశారు. నెలరోజుల్లోగా రెండు చీరలు తయారు చేసిచ్చాను. ఆ తర్వాత ఆ విషయమే మరచిపోయాను.

రెండు వేల ఒకటిలో అంటే ట్రాన్స్‌ఫర్ అయి మా హెడాఫీసుకు వచ్చినప్పుడు నాకు కాసింత ఖాళీ దొరికింది. ఆ వెసులుబాటును అహింసా సిల్క్ కోసం వినియోగించాను. తొలుత పట్టుపురుగులను సేకరించడంపై దృష్టి పెట్టాను. ప్రభుత్వ ఆధ్వర్యంలోని విత్తనాభివృద్ధి సంస్థకు (సిల్క్ గ్రేనేజ్) వెళ్లి కావలసిన పట్టు గూళ్లను, అంటే పురుగు వెళ్లిపోయిన గూళ్లను ఎంపిక చేసుకున్నాను. దాదాపు ఒక క్వింటాల్ పట్టుగూళ్లను తీసుకుని స్పినింగ్ మిల్లులో వడికించాను.'

అహింసా సిల్క్ యూనిక్ ప్రొడక్ట్ కావడంతో వాణిజ్యపరంగా కూడా ఈ దుస్తులకు మంచి గిరాకీ ఉంటుందని ఆయన అంటున్నారు.

'ఈ సిల్క్ తయారీకి పట్టుగూళ్ల అవసరం అధికంగా ఉంటుంది కనుక డిమాండ్ పెరిగితే ముందు మన రైతులు లబ్ది పొందుతారు. పెద్ద ఎత్తున ఉత్పత్తి ఉంటే నేతకారులకు కూడా పని దొరుకుతుంది' అని ఆయన అన్నారు.

ఏది ఏమైనా అహింసా సిల్క్ ఒక ప్రయోగం. మంచి ప్రయోగం. ఇప్పటికే మీడియా కవరేజీ వల్ల కొందరు హిందువులు జైనులు, బౌద్ధులు అహింసా సిల్క్ ప్రాధాన్యాన్ని గుర్తించిన వారు వీటిని, ఈ సిల్క్‌ను వాడటానికి మొగ్గుచూపుతున్నారు.

'ఇది మంచిదే. అయితే మన దగ్గర పుణ్యక్షేత్రాల వద్దా, పట్టు పీతాంబరాలు దేవునికి అర్పించే చోటా అహింసా సిల్క్ వాడకం పెరిగితే బాగుంటుంది' అని కూడా అన్నారాయన.



'వ్యక్తిగతంగా నన్ను సంప్రదిస్తున్న వారికి అహింసా సిల్క్ ఇస్తున్నాను. దేశవిదేశాల్లోని వారు మీడియా కవరేజి ఫలితంగా నన్ను సంప్రదించారు. ప్రైవేట్‌గా ఎంత పెద్ద డిమాండ్ వచ్చినా తయారు చేస్తాను. అయితే ముందు ఆర్డర్ కన్‌ఫర్మ్ కావాలి. అడ్వాన్సు ఇవ్వగలగాలి. లేదంటే కష్టం' అన్నారాయన. మేనకాగాంధీ, అమల వంటి వన్యప్రాణుల సంరక్షణకోసం పనిచేస్తున్న వారు నన్ను ప్రోత్సహించారు. సోనియాగాంధీ, షీలాదీక్షిత్ వంటివారు, సీతా సెతల్వాడ్ నుంచి మొదలుకొని తాజ్ గ్రూప్ అధిపతుల వరకూ నా వస్త్రాలను విక్రయిస్తున్నారు. ఇండోనేషియా అధ్యక్షురాలు మేఘావతి, మన దగ్గర గణపతి సచ్చిదానంద, ఆర్ట్ ఆఫ్ లైఫ్ రవిశంకర్ తదితరులు నన్ను సంప్రదించారు. నా ప్రయోగం విజయవంతమైన తర్వాత జానకీ రామన్ కూడా రెండు చీరలు కొన్నారు.





వడికించడమే కష్టం:

'ఇక్కడో సమస్య ఎదురైంది మనం పంపించిన గూళ్లను వడికి మనకు ఇవ్వాలి. అందుకు నమ్మకం కావాలి. అందుకోసం కర్ణాటకకు వెళ్లి అడిగాను. కుదరలేదు. ఆ తర్వాత ఒరిస్సా వెళ్లాను. పని కాలేదు. తర్వాత లోహియా గ్రూప్‌కు చెందిన ఇండోరమా వాళ్ల స్పిన్నింగ్ మిల్లుకు వెళ్లాను. అది చత్తీస్‌ఘడ్‌లో ఉంది. వాళ్లది వందశాతం ఎక్స్‌పోర్ట్ బిజినెస్. ముందు కాదన్నారు. అహింసాసిల్క్ గురించి ఈ పవిత్రమైన ఆశయం గురించి చెప్పి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశాను. చివరకు వాళ్లు ఒప్పుకున్నారు.

బల్క్‌గా తయారు చేయడం కష్టం:

'105 కిలోల యార్న్‌తో 15 కిలోల పట్టుదారం లభ్యమైంది. ఆ తర్వాత వస్త్రాలను నేయించాను. తొలుత వెంకటేశ్వరస్వామి పేరిట అంగవస్త్రాన్ని నేయించాను. తర్వాత చీరలు నేయించాను. 1991లో ఈ ఆలోచన కలిగితే 2001 కల్లా నెరవేరింది. కానీ పెద్ద ఎత్తున అహింసా సిల్క్ ఉత్పత్తి చేయాలంటే పెట్టబడితో కూడిన వ్యవహారం. నా వరకు నేను దీన్ని ప్రయోగాత్మకంగా మాత్రమే తయారుచేశానని' ఆయన చెప్పారు.

'నా ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు ఎనభై వేలు, మరో నలభై వేలు అప్పుచేసి ఈ ప్రయత్నం చేశాను. ప్రస్తుతం వరల్డ్‌వైడ్ పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. వెరిఫికేషన్ కూడా పూర్తయింది. అది త్వరలో రావచ్చు. అయితే ఇదంతా ఒకెత్తు బల్క్‌గా తయారు చేయడం ఒకెత్తు. ఆప్కో వారు టేకప్ చేస్తేగానీ ఈ ప్రయత్నం ప్రయోజనం పొందదు. ఈ దిశగా చొరవ చూపితే ప్రపంచ వ్యాప్తంగా మనం అహింసా సిల్క్‌ను ఎక్స్‌పోర్ట్ చేయవచ్చు' అని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

20 జూన్ 2004

కుసుమ రాజయ్య,
ఇం.నెం: 2-2-1105/37/ఇ, రెండో అంతస్థు, తిలక్‌నగర్, తిలక్ నగర్, హైదరాబాద్-44.
ఫోన్స్: 040-27552112, సెల్ ఫోన్: 9849212481
ఇమెయిల్: email:designer_weaves@rediffmail.com

బఫెల్లో

ఒక విద్యార్థి ట్రావెలాగ్





8.
# జల్లి మధు

గతం:

కళ్లద్దాలు, నుదుటిమీదికి పడే జుట్టు, నలిగిపోయిన దుస్తులు, అతి సాదాసీదా యువకుడు మధు. గదిలోంచి బయటపడి పంజాగుట్ట బస్టాప్‌లో నిలబడతాడు. ఎటు పోవాలో తెలియదు. బి.ఎఫ్.ఎ. పూర్తయిన విద్యార్థి మరి!

ఆవారాగా అలా కూచుంటాడో లేదో, ఇంతలో సికింద్రాబాద్ వెళ్లేందుకు వేచి ఉన్న ఒక మధ్య వయస్సు స్త్రీ ముఖ కవళికలు ఆకర్షిస్తాయి. పట్టి పట్టి చూస్తాడు. ఆమె నుదురు, కళ్లు, పెదములు, నాసిక, గడ్డం, చెంపలు చూస్తూ చూస్తూ ఒక్కసారి 'సరికొత్త స్టడీ' అనుకుంటాడు మనసులో. ఇంతలో ఆమె వడివడిగా నడిచి '108ఎ' బస్సు అందుకుని మాయమైపోతుంది.

పక్కనే ఉన్న గదికి వెళ్లి మనోఫలకంపై ఉన్న మోమును చకచకా గీసిపెట్టుకుంటాడు. ఓ నాల్రోజులు పోయాక అచ్చుగుద్దినట్టు ఆమె 'హెడ్ స్టడీ' రూపం పోసుకుంటుంది.

ఇప్పుడు మధు గదిలో ఆమె, యథావిధిగా బస్టాప్‌లోనూ ఆమె.

ఒకరు ఇద్దరైన సందర్భం. ఒకటికి రెండయిన ప్రపంచంతో మధు శిల్పాలయం ఇలా విస్తరిస్తోంది. ఇదంతా నెలక్రితం మాట!

వర్తమానం:

ఈ నెల రోజులుగా మధు అసహనంగా ఉన్నాడు. మాటిమాటికీ తన వద్ద మిగిలిన వర్క్ వైపు చూస్తున్నాడు. తన చేతిలో ఇప్పుడు 'మదర్ అండ్ చైల్డ్', 'సర్కస్ ఫీట్', మరికొన్ని చిన్న చిన్న శిల్పాలు తప్ప మరేమీ లేవు. ఇంట్లో పరిస్థితి సరే సరి. 'ఇప్పుడు బఫెల్లో కూడా లేదు, ఎట్లా?' బాధగా అనుకున్నాడు మధు.

బఫెల్లో?

బఫెల్లో అంటే మధు శిల్పం.

పశువుల కాపరి/బర్లకాపరి గేదెపై కూచున్న రీతిలో ఉండే లైఫ్‌సైజ్ ఫైబర్‌గ్లాస్ శిల్పం. బిజినెస్ స్కూల్ వారు దాన్ని డెబ్బయ్ వేలు పెట్టి కొనేశారు. 'ఇప్పుడా డబ్బులేదు. బఫెల్లో కూడా లేదు' బాధగా అనుకున్నాడు. అంతలోనే బఫెల్లోను బిజినెస్ స్కూల్‌కు తీసుకెళ్లినప్పటి ఆనందాన్ని పంచుకున్నాడు మధు.

'బఫెల్లోను లారీలో తీసుకెళుతుంటే చూడాలి జనం రెస్పాన్స్. ఒకటే ఈలలు, కేకలు' ఆనందంతో చెప్పాడాయన.

'లారీలోకి ఎక్కించేటప్పుడు మరో విచిత్రం జరిగింది.

నా బఫెల్లోను దూరం నుంచి నిజం బర్రెలు ఒక్క క్షణం ఆశ్చర్యంగా కళ్లు విప్పార్చి, చెవులు నిక్కబొడుచుకుని చూశాయి. పరుగు పరుగున దగ్గరకు వచ్చాయి' ఇప్పుడే జరిగినట్టు చెప్పాడు మధు.

'ఆ నిజం బర్రెలు అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానికా అన్నట్టు నిదానంగా నడిచివచ్చి 'బఫెల్లో' చుట్టూ తిరిగాయి. అనుమానంగా తాకి చూశాయి. ఇదంతా కొన్ని నిమిషాల్లో జరిగిపోయింది' వివరించాడు మధు.

'శిల్పిగా నాకు లభించిన గొప్ప ప్రశంస అది. బర్రెలు అందించిన ప్రశంసలను మించిన ప్రశంస వేరే ఏముంటుంది?' అని ఓ గమ్మత్తయిన వాక్యాన్ని చెప్పాడు మధు.

'బఫెల్లో ఒక చిన్న పని. దానికే ఇంత రెస్పాన్స్ వచ్చింది. కానీ నా బుర్రలో చాలా ఆలోచనలున్నాయి. అవి ఎప్పుడు రూపం పొందుతాయో!'

'ఒక్కటంటే ఒక్కటి, ఒక లిబర్టీ స్టాట్యూ వంటి శిల్పాన్ని మన దేశంలో చెక్కి చూపించాలి. అందుకోసం నైపుణ్యం పెంచుకోవాలి'.

'నైపుణ్యం ఒక్కటే చాలదు, సాంకేతిక ప్రతిభ కావాలి. అందుకోసం జె.ఎన్.టి.యులో వెతికి చూశాను. లాభంలేదు. ఇంటర్నెట్ బ్రౌజ్ చేశాను. తెల్లవార్లూ స్టడీ చేశాను. చివరకు





కోళ్ళ మంగారం మరి కొందరు

కాలిఫోర్నియా యూనివర్సిటీకి వెళ్లి తీరాలని నిశ్చయించుకున్నాను. అక్కడకు వెళితేగానీ నన్ను నేను రియలైజ్ చేసుకోలేను' తనలో తాను మాట్లాడుకున్నట్టు చెప్పాడు.

'అక్కడ రెండేళ్ల ఎం.ఎఫ్.ఎ. కోర్సు ఉంది. అక్కడ చదివి తీరాలి. ఇంటర్నెట్ ద్వారా ఒక రాయి విసిరాను. తగిలింది. డాక్యుమెంట్స్ సిద్ధం చేసుకోమన్నారు. కానీ వాటితోపాటు ఇప్పుడు నిజంగానే రాళ్లు కావాలి. ఎలా?' అయోమయంగా అన్నాడు మధు.

భవిష్యత్:

మధుకు ఇప్పుడు డబ్బు కావాలి. ఒకటి కాదు, రెండు కాదు, లక్షల రూపాయలు కావాలి. ఏవేవో ఏజెన్సీలు తిరిగాడు. 'లక్షలు కాదు, ముందు ముప్పై వేలు చాలు' అంటున్నాడు. వాళ్లనీ వీళ్లనీ సంప్రదిస్తున్నాడు. చివరకు తనవద్ద ఉన్న ఆస్తిపాస్తులవైపు చూసుకున్నాడు. రెండే రెండు శిల్పాలున్నాయి. ఒకటి 'మదర్ అండ్ చైల్డ్' మరోటి 'సర్కస్ గర్ల్'. మరికొన్ని చిన్న చిన్న శిల్పాలున్నాయి. ఇవి కాకుండా అమెరికా వెళ్లడానికి నెల రోజుల ఖాళీ టైమ్ ఉంది. ఎవరైనా అడిగితే ఈ కాలాన్ని ఖర్చు చేసి కావలసిన శిల్పం తయారు చేసిస్తానంటున్నాడు. కానీ ఆ అవకాశం వచ్చేదెలా అని అడుగుతున్నాడు.

తన వద్ద ఉన్న శిల్పాల్లో 'మదర్ అండ్ చైల్డ్' శిల్పం పెద్దది. అది లైఫ్ సైజ్ శిల్పం. దీన్ని కొనడానికి ఎవరైనా ముందుకు వస్తే కొంతలో కొంత ఆసరా అంటున్నాడు మధు.

'సరే, ఎంత ఖరీదు చేస్తుంది' అని అడిగితే తన కల అంత ఖరీదు చేస్తుందని అన్నాడు.

అంతలోనే, 'ఇప్పుడు ప్రాక్టికల్‌గా ఉండాలి కదా! మూడు లక్షల నుంచి ముప్పయ్ వేలదాకా!' అన్నాడు నవ్వుతూ.

వింటున్నారా?

20 జూన్ 2004

పోస్ట్ స్క్రిప్ట్: ఇప్పుడు మధు అమెరికాలో ఉన్నాడు. ఎలా వెళ్లాడు, ఏమిటీ? అనేది అతన్నే అడగండి.

email:madhujallie@rediffmail.com

బ్లేడుకారుడు

‘ఇంకు, పేపర్, బ్రష్, బ్లేడు. అంతే! బొమ్మలు రడీ. బ్లేడు ఎందుకంటారా? దానివల్లే కదండి, ప్రింట్ ఎఫెక్ట్ వచ్చింది’ అన్నాడు పాపర్, ది ఆర్టిస్ట్.





17.

## గుండా ఆంజనేయులు అలియాస్ పాపర్

‘pauper.

పాపర్ అంటే పేదవాడు, కటిక దరిద్రుడు అని అర్థం. అదే ప్రస్తుతం నా పేరు’ అన్నాడు ఆంజనేయులు, తనని తాను పరిచయం చేసుకుంటూ.

‘ఈ మధ్యే ఈ పేరు పెట్టుకున్నాను. కొత్తగా వేస్తున్న పెయింటింగ్స్‌కు పాపర్ అనే సైన్ చేస్తున్నాను’ అన్నాడు. పెయింటింగ్ సాక్షిగా తన పేరు మార్పును నొక్కి చెప్పాడు.

‘ ఏం లేదు, గరిడేపల్లి నుంచి సిటీకి వచ్చి తొమ్మిదేళ్లయింది. ఇక్కడంతా రోత పుట్టించే అనుభవాలు. ఎవర్నేమీ అనలేం కదా. నన్ను నేను తిట్టుకోవడానికి పేదవాడిగా నామకరణం చేసుకున్నాను’ అని వివరించాడు.

మూడేళ్లక్రితం బి.ఎఫ్.ఎ. పూర్తయిన కుర్రాడితను.

గచ్చిబౌలికి అవతల, టోలిచౌక్‌కు ఇవతల రాయదుర్గం అనే చిన్న గ్రామం ఉంది. అక్కడే ఇతడి రూం. ఇష్టమున్నట్టు బొమ్మలు దించుకోవడం ఇతడి దినచర్య.

ఆ మాటకొస్తే దివారాత్రులూ ఇదే పని.

ఇతడికి పై చదువులు చదవాలనే షోకు లేదట. ఓ పథకం ప్రకారం ఆర్ట్ వరల్డ్‌లో పడాలనీ లేదట. ఆర్టిస్టును అని చెప్పుకుంటే పేదవాడిగా చూస్తారు కనుక టైలర్, కార్పెంటర్ అని చెప్పుకునే అలవాటూ ఉండేదట. ఉండీ ఉండీ హైద్రాబాద్ బోర్ కొట్టేసిందిట.

ఇక, బాంబే వెళ్తానంటున్నాడు.

నెత్తిమీద మంకీ క్యాపు. ఒంటిపై ‘ఆఫ్ కథర్ మే హై’ అని హిందీలో రాసి ఉన్న టీ షర్టు, చంకలో పెయింటింగ్స్-ఇలాంటి వేషంలో కనిపిస్తే ఇతడితో మాట్లాడకుండా ఉండగలమా?

‘వీటిని ఫ్రేం చేయించాలా?’ అంటే ‘లేదండీ, ఎవరో చూస్తానంటే తెచ్చాను’ అన్నాడు.

చూస్తే అదిరిపోయేలా ఉన్నాయవి.


ప్రింట్ మేకర్ చేసే పని ఈ పెయింటర్ చేశాడు మరి!

‘జుమ్మేరాత్ బజార్‌కు వెళ్లానోరోజు, తెలుసు కదా! దొంగసామాను, సెకండ్ హ్యాండ్ సామాను దొరుకుతుందక్కడ. కొనడానికి వెళ్లలేదు. ఊరికే చూట్టానికి వెళ్లాను. టక్కున దళసరిగా ఉన్న తెల్ల షీట్స్‌పై పడింది దృష్టి. వాటికోసం అంతకు ముందు చాలా ట్రై చేశాను. దొరకలేదు. వాటని పల్ప్ షీట్స్ అంటారు. వందరూపాయలిచ్చి యాభైషీట్లు కొనేశాను. రూంకి వచ్చాక వాటిపై పెయింట్ చేశాను. రెండుమూడు పాడయ్యాయి. చివరికి ఓ స్టయిల్ వచ్చింది. అవే

ఇవి!' అంటూ ఒక్కోటి తీసి చూపించాడు.

'ఇంకు, పేపర్, బ్రష్, బ్లేడు. అంతే! బొమ్మలు రడీ. ఫీలింగ్ స్ట్రెయిట్‌గా చెప్పడానికి బ్లాక్ కలర్ వాడాను. బ్లేడు ఎందుకంటారా? దానివల్లే కదండి, ప్రింట్ ఎఫెక్ట్ వచ్చింది' అన్నాడు.

'బ్రష్‌తో గీసింతర్వాత అవసరం ఉన్నచోట బ్లేడుతో స్క్రాచ్ చేశాను' వివరించాడు.



ఆంజనేయులు సెల్ఫ్ పోట్రెయిట్.





'స్క్రాచ్ చేయడం అంటే?' అన్నప్పుడు 'బ్లేడుతో గీకాను సార్. అంతే' వివరించి చెప్పాడు.

ఈ బొమ్మలకు ముందు ఏం గీశావంటే 'బొమ్మలను దించడమే మన పని కదా' అన్నట్టు చూశాడు. ఆ తర్వాత నవ్వుతూ 'సైన్‌బోర్డులు రాయడంతో మొదలైంది మన కళా జీవితం. తర్వాత పత్తాలపై (ప్లాస్టిక్ ప్లేయింగ్ కార్డ్సు) ఓ రెండొందల బొమ్మలు గీశాను. ఆ తర్వాత చిన్న చిన్న కాంపొజిషన్స్ లెక్కలేనన్ని చేశాను. పెన్సిల్, ఇండియన్ ఇంక్‌తో వేసిన డ్రాయింగ్స్



స్నేహితుడు, ఆర్టిస్టు అయిన బ్రహ్మం పోట్రెయిట్

మామూలే. ఆయిల్ గీయిల్ పెన్సిల్ గిన్సిల్ అన్ని మీడియాలూ ట్రై చేశాను.

ఇవి కాకుండా న్యూడ్స్ కూడా గీశాను' అన్నాడు.

ఈ కుర్రాడు నవ్వుతుంటే నల్లగొండ బయటపడుతుంది. అంటే ఏమీ లేదు, ఫ్లోరోసిస్ తాలూకు పచ్చదనం పంటిపై మెరుస్తుంది. సరే, ముందు ఆయన చెప్పేది చదువండి.


'న్యూడ్సా' అంటే, 'అవును, మేల్ న్యూడ్స్, గర్ల్స్ ఎక్కడ దొరుకుతారు' నవ్వి చెప్పాడు.

మళ్లీ కొనసాగిస్తూ, 'నా గదికి ఫ్రెండ్స్ వస్తుంటారు కదండి. వారికి సిగ్గేమి లేదండి. బట్టలిప్పి పడుకోగానే బొమ్మలు వేసేస్తాను. క్లాస్‌మేట్స్ వస్తే అదో అనుభవం. ఒకసారి వాడు విప్పితే నేనొకసారి విప్పాలి. తప్పదు. అందరం ఆర్టిస్టులమే కదా!' నవ్వుతూ చెప్పాడు.

ముందు ముందు ఏం చేయాలని ఉందని అడిగితే, 'ఏముంది బొమ్మలు వేయాలనే' అని స్థిరంగా చెప్పాడు. ఇదీ, పాపర్, ది ఎమర్జింగ్ ఆర్టిస్ట్ స్టోరీ ఇన్ బ్రీ...ఫ్.

4 జులై,2004

గుండా ఆంజనేయులు,
ఇం.నెం.3-78/1, హెచ్.ఎస్.దర్గా,
గోల్కొండ పోస్ట్, హైదరాబాద్.



ఈ పుస్తకం గురించి మీ అభిప్రాయాలను దయచేసి
నాకు తెలియజేయండి. పుస్తకాలకోసం నన్నుగానీ,
ఈ పుస్తకంలో పరిచయం చేసిన వ్యక్తులను గానీ
సంప్రదించండి.

-కందుకూరి రమేష్ బాబు
ఇ.నెం. 1-6-212/6/ఎ,
మొదటి అంతస్తు, వెస్లీ స్కూలు ఎదురుగా,
పార్సీగుట్ట, హైదరాబాద్-20
ఫోన్ : 99480 77893
email: kandukurirameshbabu@yahoo.co.in
www.ordinarology.blogspot.com
www.samanyashastram.com

